
'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 161

గురువారం 31-8-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పాక్ ఆడుతూ పాడుతూ...

ఆసియా కప్ టోర్నీలో నేపాల్‌పై 238 పరుగులతో విజయం. - 12లో



ఇండియన్ బ్యాలెరినా..

'బ్యాలె ఈజ్ బ్యూటిఫుల్' అంటోంది హైదరాబాద్ బాలిక ఇష్నా చౌదరి. - 11లో



ఎంపీ అధిర్ సస్పెన్షన్ రద్దు..

లోక్‌సభ నుంచి కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్ రద్దు అయింది.ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ ప్రకటించింది. - వివరాలు 6లో



సూర్యుడి గుట్టువిప్పే ఆదిత్య-ఎల్1

సూర్యుడిపై పరిశోధనలే లక్ష్యంగా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహ ప్రయోగాన్ని సెప్టెంబర్ 2న నిర్వహించేందుకు ఇస్రో సన్నాహాలు చేస్తోంది. - వివరాలు 6లో



వచ్చే 13 వరకు జైల్లోనే ఇమ్రాన్..

అధికార రహస్య పత్రాల లీకేజీ కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ప్రత్యేక కోర్టు రిమాండ్ విధించింది - వివరాలు 6లో



కర్ణాటక మోడల్.. ఇక దేశమంతా

ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటక ప్రజలకిచ్చిన కీలక ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చామని కాంగ్రెస్ నేత రాహుల్ చెప్పారు. - వివరాలు 6లో

వానలు మిస్సింగ్!



రాష్ట్రంలో నెల రోజులుగా జాడలేని వర్షాలు

ఆగస్టులో ఇలాంటి డ్రైస్పెల్ గత 122 ఏళ్లలో ఇదే తొలిసారి

- నైరుతి రుతుపవనాల మందగమనమే కారణమంటున్న ఐఎండీ
- ఆగస్టు నెలంతా అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి
- ఈ నెలలో కురవాల్సిన వర్షపాతం 21.96 సెంటీమీటర్లు.. కురిసినది 7.96 సెం.మీ.
- జూలైలో కుండపోత వర్షాల తర్వాత.. ఒక్కసారిగా మారిన వాతావరణం
- చాలాచోట్ల వరుసగా నెల రోజుల పాటు చుక్కవాన లేని పరిస్థితి

సాక్షి, హైదరాబాద్: నెల కిందట ఇంట్లోంచి కాలు బయటపెట్టకుండా వానలు.. రాత్రయితే చలి పెట్టేలా గాలులు.. వారం పదిరోజులు కొనసాగిన ఆ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నెల రోజులుగా వానల జాడే లేకుండా పోయింది. ఇదేమైనా ఎండా కాలమా అన్నట్టుగా ఉష్ణోగ్రతలూ నమోదవుతున్నాయి. నిజానికి ఏటా నైరుతి రుతుపవనాల సీజన్‌లో సంతృప్తికరంగా వానలు పడేది ఆగస్టు నెలలోనే. అలాంటిది ఈసారి భిన్నమైన పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో అడపాదడపా చినుకులు, తేలికపాటి జల్లులు కురిసినా.. ఎక్కడా భారీ వర్షాలు పడలేదు. నెలంతా పొడి వాతావరణంతోనే గడిచింది. ఇదే సమయంలో ఈ నెలలో సగటున 29.5 డిగ్రీలకుపైన గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవడం, గత నాలుగు దశాబ్దాల్లోనే అత్యధిక వేడి ఆగస్టుగా నిలవడం గమనార్హం. ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న తీవ్ర మార్పుల కారణంగా.. ఇలా వానలు ఆగిపోవడం, ఒక్కసారిగా భారీగా కురవడం వంటివి మిగతా 2వ పేజీలో ▶

జిల్లాల వారీగా వర్షపాతాన్ని పరిశీలిస్తే...

ప్రస్తుత సీజన్‌లో 14 జిల్లాల్లో అధికంగా, 19 జిల్లాల్లో సాధారణ స్థాయిలో వానలు పడినట్టు అధికారులు చెప్తున్నారు.

➤ మండలాల వారీగా పరిశీలిస్తే 26 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 236 మండలాల్లో అధిక వర్షపాతం, 293 మండలాల్లో సాధారణ వర్షపాతం, 27 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది.

➤ జూన్ 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మూడు వారాలు వానల్లేక రాష్ట్రంలో డ్రైస్పెల్ నమోదైంది. జూలై తొలి రెండు వారాలు కూడా చాలాచోట్ల పొడి వాతావరణమే ఉంది. ఆగస్టు మొదటి వారం నుంచి మూడో వారం వరకు వరుసగా పొడి వాతావరణంతో డ్రైస్పెల్ నమోదైంది. చివరి వారంలో మాత్రం పలుచోట్ల తేలికపాటి వానలు పడ్డాయి. కొన్నిచోట్ల వాతావరణం కాస్త చల్లబడింది.

పంటలకు 'డ్రైస్పెల్' దెబ్బ!

- నెల రోజులుగా చినుకుజాడ లేక ఆరుతడి పంటలపై తీవ్ర ప్రభావం
- పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ పరిస్థితి దారుణం
- వానల్లేక, అధిక ఉష్ణోగ్రతలతో అనేక పంటలపై చీడపీడలు
- మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి.. వ్యవసాయశాఖ హెచ్చరిక
- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ వర్సిటీ సూచన - 2లో



బుధవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ముఖ్యనేతలు బండి సంజయ్, లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరిన డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు, ఆయన భార్య డాక్టర్ దీప

రాష్ట్ర రక్షణకు మేధావులు బీజేపీలోకి రావాలి..

- కల్వకుంట్ల కుటుంబం రాష్ట్ర ప్రజల రక్తం తాగుతోంది
- భూములు, మద్యం అమ్మనిదే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే స్థితి లేదు
- ఈ పరిస్థితుల్లో విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి
- కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పిలుపు
- చెన్నమనేని వికాస్‌రావు, ఆయన భార్య దీప బీజేపీలో చేరిక
- ప్రజలకు సేవ చేసేందుకే కమలంలోకి: వికాస్‌రావు

సాక్షి, హైదరాబాద్: కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ ప్రజల రక్తం తాగుతోందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఒక చేత్తో ఆసరా పెన్షన్ ఇచ్చి, మరో చేతిలో మద్యం బాటిల్ పెట్టి కేసీఆర్ సర్కారు డబ్బులు లాగేసుకుంటోందని విమర్శించారు. రాష్ట్రంలో భూములు, మద్యం అమ్మనిదే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ, భూముల రిజిస్ట్రేషన్, ఇంటిపన్ను ఇలా.. అన్ని రకాల చార్జీలను పెంచి ప్రజలపై ప్రభుత్వం తీరని భారం మోపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి, ముఖ్యనేతలు బండి సంజయ్, కె.లక్ష్మణ్, ధర్మపురి అర్వింద్ సమక్షంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు కుమారుడు డా.చెన్నమనేని వికాస్‌రావు, ఆయన భార్య డా. దీప బీజేపీలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి పార్టీ మిగతా 10వ పేజీలో ▶

న్యూస్‌రీల్

పట్టా పాసుపుస్తకానికి ఆధార్ తప్పనిసరి కాదు: హైకోర్టు



పట్టాదార్ పాసుపుస్తకం జారీకి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆధార్ లేనంత మాత్రాన పాసుపుస్తకం జారీ చేయలేమని రెవెన్యూ అధికారులు చెప్పడాన్ని తప్పుబట్టింది. - వివరాలు 14లో

దళితబంధు అర్హుల ఎంపిక ఎలా?



ఆర్థికంగా వెనుకబడిన దళితులకు ఇచ్చే దళిత బంధు పథకం కింద అర్హులను ఎలా ఎంపిక చేస్తున్నారో వెల్లడించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఇందుకు ఏ ప్రక్రియ పాటిస్తున్నారో చెప్పాలని స్పష్టం చేసింది. - వివరాలు 14లో

లక్షకు చేరువలో ఇంజనీరింగ్ విద్యార్థులు



ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ తుదిదశకు చేరింది. కన్వీనర్‌కోటా కింద 75 వేలు, యాజమాన్యకోటా కింద మరో 25 వేలకు పైగా సీట్లు భర్తీ అయినట్టు తెలిసింది. - వివరాలు 14లో

రాష్ట్రంపై ఆర్ఎస్‌వీ పంజా



రాష్ట్రంలో శ్వాసకోశ సంబంధిత వైరల్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన రెస్పిరేటరీ సింకీషియల్ వైరస్ (ఆర్ఎస్‌వీ) కేసులు పెరుగుతున్నాయి. చిన్న పిల్లల ఆసుపత్రులు, ఇతర సాధారణ ఆసుపత్రుల్లోనూ ఇలాంటి కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తుంది. - వివరాలు 3లో

నేటి నుంచే.. 'ఇండియా' మూడో భేటీ

- ముంబైలో రెండు రోజుల పాటు కీలక సమావేశం
- సమన్వయ కమిటీ, లోగో వెల్లడి!
- కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకల్పనకు కమిటీలు
- కూటమిలోకి మరిన్ని ప్రాంతీయ పార్టీలు!
- సమన్వయకర్త, చైర్‌పర్సన్ ఎంపికపైనా చర్చ



➤ జాతీయ స్థాయిలో అధికార బీజేపీకి ప్రత్యామ్నాయంగా పురుడు పోసుకున్న విపక్ష 'ఇండియా' కూటమి రెండు రోజుల కీలక సమావేశం మహారాష్ట్ర రాజధాని ముంబైలో గురువారం ప్రారంభం కానుంది. గ్రాండ్ హయత్ హోటల్‌లో జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్‌తో పాటు 27 పార్టీలకుపైగా హాజరు కానున్నట్టు చెబుతున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమిని ఓడించడమే లక్ష్యంగా ఉమ్మడి ప్రచార వ్యూహానికి తుదిరూపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన ఉమ్మడి కార్యక్రమాలు, సీట్ల పంపకం కోసం కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించనున్నారు. కూటమి కన్వీనర్‌గా బిహార్ సీఎం నితీశ్‌కుమార్ పేరు వినిపిస్తోంది. ముంబై భేటీ సందర్భంగా మరిన్ని ప్రాంతీయ పార్టీలు కూటమిలో చేరతాయని నాయకులు చెబుతున్నారు. ఈ వేదిక నుంచి 'బీజేపీ చలే జావ్' (బీజేపీ వెళ్లిపో) అనే నినాదం ఇవ్వబోతున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే చెప్పారు. - 6లో

'కొడవలి'తో కుదిరేనా?

- వామపక్షాలతో పొత్తుపై కాంగ్రెస్ ఊగిసలాట
- హైకమాండ్, రాష్ట్ర పార్టీ మధ్య భిన్నాభిప్రాయాలు
- సీపీఎం అడుగుతుందని భావిస్తున్న ఆరు స్థానాలూ కాంగ్రెస్‌కు కీలకమే
- సీపీఐ ఆశించే స్థానాల్లో మునుగోడు మినహా అన్నింటా కష్టమే
- తమ్మినేని, కూనంనేనికి ఇవ్వడం కూడా అసాధ్యమేనా!

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి విడిపోయిన ఉభయ కమ్యూనిస్టు పార్టీలను వచ్చే ఎన్నికల్లో తమతో కలుపుకోవడంపై కాంగ్రెస్ పార్టీ ఊగిసలాటలో ఉంది. సీపీఎం, సీపీఐలతో కలసి వెళ్లడంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెజార్టీ నేతలు పొత్తులు వద్దనే అభిప్రాయంతో ఉండగా, పార్టీ హైకమాండ్ మాత్రం అందుకు భిన్నంగా ఆలోచన చేస్తోంది. జాతీయ స్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో కాంగ్రెస్, లెఫ్ట్ భాగస్వాములైన మిగతా 3వ పేజీలో ▶

టికెట్ వస్తుందా.. కటీఫ్ చెప్పేద్దామా?

- డజన్‌కు పైగా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌లో తగ్గని అసంతృప్తి
- మైనంపల్లి, బేతి, తుమ్మల ఇతర అసంతృప్తుల అడుగులపై సస్పెన్స్
- అమెరికా నుంచి కేటీఆర్ రాక కోసం ఆశావహుల ఎదురుచూపులు
- విపక్ష అభ్యర్థులు ఎవరై ఉంటారనే ఉత్కంఠలో బీఆర్ఎస్ సిట్టింగ్‌లు
- ప్రచారానికి పచ్చ జెండా ఊపాలని హరీశ్, కవితకు ఆహ్వానాలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ముందస్తుగా విడుదల చేయడం ద్వారా రాష్ట్ర రాజకీయాలను వేడెక్కించిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో అసంతృప్త జ్వాల మాత్రం ఆరడం లేదు. జాబితా వెలువడి పది రోజులు గడిచినా టికెట్ ఆశించి భంగపడిన కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఇతర కీలక నేతలు అసంతృప్త స్వరాన్ని తగ్గించడం లేదు. నియోజకవర్గ ప్రజలు, తమ అనుచరవర్గంతో చర్చించిన తర్వాత భవిష్యత్ మిగతా 3వ పేజీలో ▶

టీచర్ల బదిలీలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

- తుది ఉత్తర్వులకు లోబడే నియామకాలు
- సంఘాల నేతలకు 10 పాయింట్లు ఇచ్చేందుకు నో
- దంపతులకు ప్రత్యేక పాయింట్లకు ఓకే
- స్టేను సవరిస్తూ ప్రధాన న్యాయమూర్తి బెంచ్ ఆదేశాలు



పదోన్నతుల ఆశ.. బదిలీలకు భరోసా 2లో



పదోన్నతుల ఆశ.. బదిలీలకు భరోసా



టీచర్ల ప్రమోషన్లు, బదిలీలకు తొలగిన న్యాయ వివాదం

- ఎనిమిదేళ్ల తర్వాత 10 వేల మందికి ప్రమోషన్లు
- కొత్త షెడ్యూల్‌పై విద్యాశాఖ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: బదిలీలు, పదోన్నతులకు న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడంతో విద్యాశాఖలో మళ్లీ హడావుడి మొదలైంది. కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న టీచర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై కొన్ని నెలల క్రితం విధించిన స్టేకి హైకోర్టు బుధవారం సడలింపు ఇచ్చింది. దీంతో తక్షణమే ప్రక్రియను మొదలుపెట్టాలని విద్యాశాఖకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్టు తెలిసింది. కోర్టు ఉత్తర్వులు వెలువడిన మరుక్షణమే విధివిధానాలపై ఉన్నతాధికారులు చర్చించే అవకాశముంది. వీలైనంత త్వరగా కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తామని అధికార వర్గాలు చెబుతున్నాయి. బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన డేటా, దరఖాస్తుల స్వీకరణకు అవసరమైన సాఫ్ట్‌వేర్ రూపకల్పనపై దృష్టి పెట్టాల్సి ఉందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

ఎనిమిదేళ్లుగా నోచుకోని పదోన్నతులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వగా, దాదాపు 6 వేల మంది పదోన్నతులు పొందారు. ఆ తర్వాత ప్రమోషన్ల వ్యవహారం వాయిదా పడుతూనే ఉంది. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేకపోవడంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. 2021లో బదిలీలు, పదోన్నతులు చేపడతామని ప్రభుత్వం ప్రకటించినా కోవిడ్ దృష్ట్యా ఇది కార్యాచరణకు నోచుకోలేదు. ఆ తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు, 317 జీవో అమల్లో భాగంగా కొత్త జిల్లాలకు బదిలీలు చేపట్టడం అనేక వివాదాలకు దారితీసింది. వాస్తవానికి ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల్లో 6,362 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాల్సి ఉంటుంది. 7,141 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని విద్యాశాఖ తెలిపింది. ఇందులో 30 శాతం నేరుగా టీఆర్టీ ద్వారా భర్తీ చేయనుండగా, 70 శాతం ప్రమోషన్ల ద్వారా భర్తీ చేస్తారు. హెచ్‌ఎం పోస్టులు 1,947 ఖాళీలుండగా, ఇందులో పదోన్నతులతో భర్తీ చేసేందుకు 1,367 మంది అర్హులని లెక్కతేల్చారు. ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంల పోస్టులు 2,043 ఖాళీలుంటే, 1,942 మందికి పదోన్నతులు లభిస్తాయి. ఇతరత్రా కలుపుకొంటే మొత్తం 10,352 మంది టీచర్లకు పదోన్నతులు లభించే వీలుంది.

బదిలీలకు 50 వేల మంది

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2018లో సాధారణ బదిలీలు చేశారు. నిబంధనల ప్రకారం ఐదేళ్లు ఒకేచోట పనిచేసే హెచ్‌ఎంలు, 8 ఏళ్లుగా ఒకేచోట పనిచేసే టీచర్లు బదిలీలకు దరఖాస్తు చేసుకునే అర్హత ఉంటుంది. 2018లో 78 వేల మంది దరఖాస్తు చేసుకోగా, 48 వేల మందికి బదిలీలు జరిగాయి. గత జనవరిలో బదిలీల షెడ్యూల్ ఇవ్వగా.. 75 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా షెడ్యూల్ ఇస్తే 8 ఏళ్లు నిండిన వారి సంఖ్య మరో 2 వేలు పెరిగే అవకాశముంది. వీరిలో సీనియారిటీ, సర్వీస్ పాయింట్ల ప్రాతిపదికన 50 వేల మంది బదిలీ అయ్యే వీలుంది.

కొత్త షెడ్యూల్ ఎప్పుడు?

ఆన్‌డ్యూటీ తీసుకునే ఉపాధ్యాయ సంఘాల నేతలకు సర్వీస్ పాయింట్లపై కోర్టు అభ్యంతరం వ్యక్తం చేయడంతో తాజా షెడ్యూల్‌లో ఈ పాయింట్లను తొలగించాల్సి ఉంది. దీంతో గత జనవరిలో మొదలుపెట్టిన బదిలీల ప్రక్రియలో మార్పులు చేసి ప్రభుత్వం కొత్త షెడ్యూల్ ఇవ్వడంతోపాటు మార్గదర్శకాలను రూపొందించాల్సి ఉంటుంది. హెచ్‌ఆర్‌ఏ ప్రాతిపదికన మూడు కేటగిరీలుగా సర్వీసు పాయింట్లు ఇస్తారు. దీంతోపాటే సర్వీస్‌ను బట్టి కొన్ని పాయింట్లు ఇస్తారు. వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకుని జిల్లాల వారీగా సీనియారిటీ, సబ్జెక్టుల వారీగా సీనియారిటీని తయారు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుందని, షెడ్యూల్ మాత్రం వీలైనంత త్వరగా ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

టీఆర్టీకి పోస్టులు పెరుగుతాయా?

విద్యాశాఖలో 22 వేల ఖాళీలుంటే, ప్రభుత్వం కేవలం 5,089 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనిపై నిరుద్యోగులు, ఉపాధ్యాయ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. తాజాగా పదోన్నతులు చేపడుతున్న నేపథ్యంలో కొన్ని కొత్త ఖాళీలు వెల్లడయ్యే వీలుంది. మొత్తం 10 వేలకుపైగా పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రకటించిన ఐదువేలతో కలుపుకొంటే మొత్తం 15 వేలకుపైగా నియామకం చేపట్టాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ ఇస్తుందా అనే చర్చ జరుగుతోంది.

ఇప్పటికైనా మోక్షం కల్పించండి: ఉపాధ్యాయ సంఘాలు

- కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో తక్షణమే టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు షెడ్యూల్ ఇవ్వాలని, ఖాళీలను భర్తీ చేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి కోరారు.
- న్యాయస్థానం ఆదేశాలను స్వాగతిస్తున్నామని పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు తెలిపారు.
- ఏళ్ల తరబడి టీచర్లు బదిలీలు, పదోన్నతులకు నోచుకోవడం లేదని, ఇకనైనా ప్రభుత్వం షెడ్యూల్ ఇవ్వాలని పీఆర్‌టీయూ తెలంగాణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య కోరారు.
- ఉపాధ్యా సంఘాల నేతలు పది ప్రత్యేక పాయింట్లు కోల్పోవడం దురదృష్టకరమని, ఈ అంశాన్ని పరిశీలించాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సదానందం గౌడ్, పర్వత్‌రెడ్డి కోరారు.

సోదర, సోదరీమణుల బంధానికి ప్రతీక రక్షాబంధన్

గవర్నర్ తమిళిసై రాఖీ పండుగ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: సోదర, సోదరీమణుల మధ్య బంధానికి రక్షాబంధన్ పర్వదినం ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆమె రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన 'రాఖీ ఫర్ సోల్జర్స్'అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సైనికాధికారులకు విద్యార్థులతో రాఖీలు కట్టించడం ద్వారా దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ: కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తోడబుట్టిన అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య అనురాగ బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ బంధన్ (రాఖీ పౌర్ణమి) పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం కె.చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ బంధాలు, రక్త సంబంధాల్లోని ఔన్నత్యాన్ని, మానవ సంబంధాల్లోని పరమార్థాన్ని రాఖీ పండుగ తెలియజేస్తుందని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతికి, జీవనతాత్వికతకు వేదికగా నిలుస్తుందని తెలిపారు.

సోదరుడిగా అండగా ఉంటాను: వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: రాఖీ పౌర్ణమి సందర్భంగా సీఎం వైఎస్ జగన్ మహిళా లోకానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అక్కకు, ప్రతి చెల్లెమ్మకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు. వారు నాపై చూపుతున్న ప్రేమాభిమానాలకు సదా కృతజ్ఞుడిని అంటూ బుధవారం ట్వీట్ చేశారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా, వారి రక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తున్నందుకు సంతోషిస్తున్నానన్నారు. ఒక అన్నగా, ఒక తమ్ముడిగా ఎప్పుడూ అండగా ఉంటానని మాట ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

పంటలకు 'డ్రైస్పెల్' దెబ్బ!

నెల రోజులుగా చినుకుజాడ లేక ఆరు తడి పంటలపై తీవ్ర ప్రభావం

- మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి.. వ్యవసాయశాఖ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: నెల రోజులుగా చినుకు జాడ లేక, ఎండలు పెరిగిపోయి రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయి. తొలుత రుతుపవనాల ఆలస్యం, తర్వాత జూలై భారీ వర్షాలు, మళ్లీ ఆగస్టులో డ్రైస్పెల్‌తో పంటల పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టులో 63శాతం వరకు లోటు వర్షపాతం నమోదైంది. పలుచోట్ల కరువు ఛాయలు కూడా నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి వానాకాలం పంటలు గట్టెక్కుతాయా అన్న సందేహాలు ముసురుకుంటున్నాయి. ముఖ్యంగా ఈసారి ఆరుతడి పంటలు ఆగమవుతాయన్న ఆందోళన రైతులు, వ్యవసాయ అధికారుల్లో కనిపిస్తోంది.



నల్లగొండ జిల్లా చందంపేటలో వాడిపోయిన పత్తి పంట

మొక్కజొన్న, పత్తికి నష్టం!

వానలు పడటంలో ఎక్కువ విరామం రావడం మొక్కజొన్నపై ప్రభావం చూపిస్తోంది. ఇప్పటికే పంట ఎండిపోతోంది. అధిక ఉష్ణోగ్రతలతో చీడపీడల దాడి పెరిగింది. అనేకచోట్ల మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడిచేస్తోందని వ్యవసాయశాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. పత్తిలో పేనుబంక, రసం పీల్చే పురుగుల దాడి పెరిగిందని.. వరిపై కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు, కాండం కుళ్లు తెగులు, ఆకు ముడత తెగుళ్లు వస్తున్నాయని హెచ్చరించింది. ఎండల కారణంగా సోయాబీన్ పంట ఎండిపోతోందని అధికారులు చెప్తున్నారు. వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే పత్తి, మొక్కజొన్న పంటలు చేతికి రావడం కష్టమేనని.. దిగుబడులు పడిపోతాయని అంటున్నారు.

వరి ఫుల్.. పప్పులు డల్

రాష్ట్రంలో ఈసారి వానాకాలం పంటల సాగు విస్తీర్ణం కోటి ఎకరాలు దాటింది. సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం ఆగస్టు చివరినాటికి 1.24 కోట్ల ఎకరాలుకాగా.. ఈసారి ఇప్పటివరకు 1.16 కోట్ల ఎకరాల్లో (93.61 శాతం) పంటలు సాగయ్యాయి. వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలైతే.. ఈసారి ఇప్పటివరకు 55.90 లక్షల ఎకరాల్లో (112.12 శాతం) నాట్లు పడ్డాయి. గత నెల భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో వరిసాగు జోష్ పెరిగింది. మరోవైపు రాష్ట్రంలో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 9.43 లక్షల ఎకరాలుకాగా.. ఇప్పటివరకు 5.32 లక్షల ఎకరాల్లో (56.39%) మాత్రమే సాగయ్యాయి. ఇక మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7.13 లక్షల ఎకరాలైతే.. ఇప్పటివరకు 5.21 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలుకాగా.. ఇప్పటివరకు 44.70 లక్షల ఎకరాల్లో (88.36 శాతం) వేశారు. వాస్తవంగా ఈ ఏడాది 70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయించాలని వ్యవసాయశాఖ భావించింది. ఈ మేరకు రైతులకు పిలుపునిచ్చింది. కానీ సకాలంలో రుతుపవనాలు రాకపోవడం, కీలకమైన జూన్ నెల, జూలై రెండో వారం వరకు వర్షాలు లేకపోవడంతో అదను దాటిపోయింది.

పంటలను కాపాడుకోవాలి: వ్యవసాయ వర్సిటీ

- జిల్లాల్లో నీటి వసతి గల రైతులు పత్తి, మొక్కజొన్న, కంది, సోయాచిక్కుడు వంటి పంటలకు నీటి తడులివ్వాలి. పూతదశలో ఉన్న మొక్కజొన్న పంటకు జీవసంరక్షక నీటి తడి ఇవ్వాలి.
- ప్రస్తుతం వరి పంట పిలక దశ నుంచి అంకురం దశలో ఉంది. కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు కలగచేసే కారకాలు కలుపు మొక్కలపై నివసించి వరి పంటను ఆశిస్తాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వరిలో ఆకు నల్లి ఆశించే అవకాశం ఉంది.
- పత్తి పంట పూత నుంచి కాయ అభివృద్ధి దశలో ఉంది. ఈ పంటలో పేనుబంక, రసం పీల్చే పురుగుల నివారణకు ఫ్లునికామిడ్ 0.4 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మొక్కజొన్న పంట మోకాలి ఎత్తు దశ నుంచి కంకి ఏర్పడే దశల్లో ఉంది. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశిస్తోంది. నివారణకు 0.4 మి.లీ.క్లోరంట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ. స్పైనటోరంను లీటరు నీటికి కలిపి ఆకు సుడుల లోపల పిచికారి చేయాలి.
- రాష్ట్రంలో సోయా పంట పూత నుంచి పిందె, కాయ అభివృద్ధి దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పంటలో పెంకు పురుగు, కాండం ఈగ ఆశించేందుకు కారణమవుతాయి. ముందు జాగ్రత్తగా పురుగులు ఆశించకుండా 0.4 మి.లీ. థయోమిథాక్సిం లాంగ్డా సైలోత్రిన్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

వానలు మిస్సింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతున్నాయని వాతావరణ నిపుణులు చెప్తున్నారు.

ఆగస్టులో 63.34శాతం లోటు వర్షపాతం

రాష్ట్రంలో ఈసారి నైరుతి సీజన్ తీరును పరిశీలిస్తే.. ఇప్పటివరకు గడిచిన మూడు నెలలకుగాను.. రెండు నెలల్లో అత్యంత లోటు వర్షపాతమే నమోదైంది. నైరుతి రుతుపవనాల రాక జాప్యం, వచ్చినా సరిగా వానలు పడక జూన్ నెలలో తక్కువగా వర్షపాతం నమోదైంది. జూలై నెల రెండో వారం నుంచి వానలు ఊపందుకుని, నెలాఖరులో కుండపోత వర్షాలు పడ్డాయి. ఆ నెలలో ఏకంగా రెండింతలు అధికంగా వర్షపాతం నమోదైంది. తర్వాత ఆగస్టు నెలకు వచ్చేసరికి వానలు జాడే లేకుండా పోయాయి. రుతు పవనాల్లో కదలిక మందగించడంతో నెలంతా పొడి వాతావరణమే ఏర్పడింది. సాధారణంగా ఆగస్టులో సగటున 21.74 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవాల్సి ఉండగా.. కేవలం 7.97 సెంటీమీటర్లే పడింది. అంటే ఏకంగా 63.34శాతం లోటు వర్షపాతం కావడం గమనార్హం. 1901 సంవత్సరం తర్వాత మళ్లీ ఈ ఏడాది ఆగస్టులో అత్యంత తక్కువగా వానలు పడినట్టు భారత వాతావరణ శాఖ కూడా ప్రకటించింది. పొడి వాతావరణం కారణంగా ఉష్ణోగ్రతలు కూడా పెరిగాయి. ఈ నెలలో గరిష్ఠంగా 34 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని.. రాష్ట్రవ్యాప్తంగా సగటున 30డిగ్రీల సెల్సియస్‌గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని ప్రణాళిక శాఖ గణాంకాలు చెప్తున్నాయి.

మండలాల వారీగా వర్షపాతం తీరు..

కేటగిరీ	మండలాలు
అత్యధికం (60% కంటే ఎక్కువ)	26
అధికం (20-59% ఎక్కువ)	236
సాధారణం (-19% నుంచి +19% వరకు)	293
లోటు (-20% నుంచి -59%)	57

నైరుతి సీజన్‌లో కురవాల్సిన, కురిసిన వర్షపాతం తీరు ఇదీ.. (సెం.మీ.లలో)

నెల	కురవాల్సింది	కురిసినది	శాతం
జూన్	12.94	7.26	56.15
జూలై	22.91	48.99	213.86
ఆగస్టు	21.74	7.97	36.66


సీజన్ సగటు మాత్రం అధికమే..

మొత్తంగా నైరుతి రుతపవనాల సీజన్ పరిస్థితిని పరిశీలిస్తే.. జూన్ ఒకటో తేదీ నుంచి ఆగస్టు 30 వరకు సాధారణంగా 56.69 సెంటీమీటర్ల వర్షం కురవాలి. ఈసారి అంతకన్నా 13శాతం ఎక్కువగా 64.22 సెంటీమీటర్లు కురిసింది. ఇందులో జూన్‌లో తీవ్ర లోటు ఉండగా.. జూలై చివరినాటికి ఏకంగా 57శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఈ నెలలో వానలు కురవకపోవడంతో అధిక వర్షపాతం 13 శాతానికి పడిపోయింది.

టీచర్ల బదిలీలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్

సానుకూల వాతావరణంలో ప్రక్రియ జరగాలి

- తుది ఉత్తర్వులకు లోబడే నియామకాలు
- స్టేను సవరిస్తూ ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ టీచర్ల బదిలీలకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఫిబ్రవరి 14, మార్చి 7న ఇచ్చిన స్టే ఉత్తర్వులను సవరించింది. ఉపాధ్యాయ దంపతులకు అదనంగా పాయింట్లు ఇవ్వడానికి అనుమతినిచ్చింది. భార్యాభర్తలు కలసి ఉండాలన్నదే తమ ఉద్దేశమని తేల్చిచెప్పింది. అయితే, ఉపాధ్యాయ సంఘాల నేతలకు అదనంగా 10 పాయింట్లు ఇవ్వడాన్ని మాత్రం తప్పుబట్టింది. వారికి అలా పాయింట్లు ఇవ్వడాన్ని సమర్థించలేమని, సంఘాల నేతలకు అదనపు పాయింట్లు ఇవ్వకుండా బదిలీలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. బదిలీలు తుది ఉత్తర్వులకు లోబడే ఉంటాయని, సానుకూల వాతావరణంలో ఈ ప్రక్రియ జరగాలని పేర్కొంది. ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ధోల్‌కట్టకు చెందిన సక్కుబాయితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అలాగే జీవో నంబర్ 5ను కూడా సవాల్ చేస్తూ మరో పిటిషన్ దాఖలైంది. జీవోలను కొట్టివేయాలని, బదిలీలకు సంబంధించి మార్చిన నిబంధనలు అసెంబ్లీ ఆమోదం కూడా పొందలేదని పిటిషన్లలో పేర్కొన్నారు.

ఆగస్టులోనే అసెంబ్లీ ముందుంచాం...

హైకోర్టులో ప్రభుత్వం తరఫున ఏఏజీ రామచందర్ రావు వాదనలు వినిపించారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 309లోని నిబంధన ప్రకారం తెలంగాణ విద్యాచట్టం–1982 నిబంధనలను సవరిస్తూ, తెలంగాణ టీచర్స్ రెగ్యులేషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్ రూల్స్–2023 ప్రకారమే జనవరి 25న జీవో 5 ద్వారా ప్రభుత్వం నిబంధనలు రూపొందించింది. దీని ప్రకారమే ఉపాధ్యాయ బదిలీలు చేపడుతుంది. దంపతులిద్దరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులైతే ఒకేచోట లేదా స్వల్ప దూరంలో పని చేసేలా నిబంధనల్లో మార్పులు చేశాం. బదిలీల సమయంలో వారికి ప్రత్యేక పాయింట్లు ఇస్తాం. చట్టంలో చేసిన మార్పులను శాసనసభ ముందుంచడం తప్పనిసరైన నేపథ్యంలో ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకుంది. ఆగస్టులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ఈ మార్పులను సభ దృష్టికి తీసుకెళ్లింది. ఈ వివరాలను కోర్టుకు కూడా అందజేశాం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయ బదిలీలపై గతంలో ఇచ్చిన స్టేను ఎత్తివేయండి. బదిలీలు వెంటనే చేపట్టే అవకాశం ఇవ్వండి. కొందరి కోసం దాదాపు 60 వేల మంది టీచర్లు ఎదురు చూస్తున్నారు'అని ఏఏజీ చెప్పారు. అయితే ఈ వాదనపై పిటిషనర్ల తరఫు న్యాయవాదులు అభ్యంతరం తెలిపారు. చట్టంలో చేసిన మార్పులను సభ ముందుంచినా.. దానిపై ఎలాంటి చర్చ జరగలేదని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. గతంలో ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను సవరిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రూల్ 6(10)కి అనుగుణంగా బదిలీలకు సానుకూలత వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు, కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలు, ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తున్న దంపతులకు అదనపు పాయింట్లు కేటాయించేందుకు సమ్మతించింది. స్టే ఎత్తివేత విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని మెరిట్ అంశాల జోలికి వెళ్లకుండా ఈ ఆదేశాలు ఇస్తున్నామని చెప్పింది.

నోటరీ 'క్రమబద్ధీకరణ'పై సర్కారుకు నోటీసులు

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నోటరీ ఆస్తుల క్రయవిక్రయాలను చట్టబద్ధం చేసి, క్రమబద్ధీకరించడంపై పూర్తి వివరాలు అందజేయాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ లేవనెత్తిన అభ్యంతరాలపై వివరణ ఇస్తూ కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్‌లను ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. రాష్ట్రంలోని నోటరీ ఆస్తుల క్రయవిక్రయాలను చట్టబద్ధం చేసి, క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. ప్రభుత్వ నిర్ణయం కారణంగా పలువురు వ్యక్తులు చట్టవిరుద్ధంగా ఇలాంటి భూములను క్రమబద్ధీకరణ చేయించుకునే అవకాశం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. కష్టపడి డబ్బు కూడబెట్టుకుని తక్కువ మొత్తంలో భూమి కొన్న పేదలకు ఇలాంటి చర్యలు తప్పుడు సంకేతాలనిస్తాయన్నారు. 125 చదరపు గజాలు అంతకంటే తక్కువ విస్తీర్ణంలో నిర్మించిన ఆస్తులకు స్టాంప్ డ్యూటీ, పెనాల్టీ నుంచి పూర్తి మినహాయింపు ఇస్తే రాష్ట్ర ఖజానా ఆదాయం కోల్పోతుందని చెప్పారు. నోటరీ భూ విక్రయ లావాదేవీలను క్రమబద్ధీకరించడానికి సంబంధించి జూలై 26న ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 84 కొట్టివేయాలని 'ది భాగ్యనగర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్'పిల్‌లో కోరింది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్పించిన ఈ సడలింపు అక్రమ మార్గాల్లో ఆస్తులు సంపాదించే వారికి మార్గం సుగమం చేస్తుందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు.

పొన్నం చైర్మన్‌గా బీసీ డిక్లరేషన్ కమిటీ

- ఏడుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన టీపీసీసీ



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీ ఏర్పాటైంది. సభ్యులుగా కాంగ్రెస్ బీసీ నేతలు నూతి శ్రీకాంత్‌గౌడ్, ఎర్ర శేఖర్, ఈరవత్రి అనిల్, జెర్పాటి జైపాల్, గాలి అనిల్‌కుమార్, వజ్రేశ్‌యాదవ్ (జంగయ్యయాదవ్)లను నియమిస్తూ టీపీసీసీ అధ్య క్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశా రు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీవర్గాలకు అమలు చేయాల్సిన పథకాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన సూచన లు, సిఫారసులను ఈ కమిటీ చేస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ చీఫ్ ప్యాట్రన్‌లుగా పార్టీ సీనియర్‌నేతలు వీహెచ్, పొన్నాల లక్ష్మయ్య, సలహాదారులుగా మధుయాష్కీగౌడ్, బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, ఎం.అంజన్ కుమార్‌యాదవ్, కొండా సురేఖ, సురేశ్‌షెట్కార్, కత్తి వెంకటస్వామి, సంగిశెట్టి జగదీశ్వరరావులను నియమించారు.

మైనార్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ కసరత్తు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో మైనార్టీ వర్గాలకు ఇవ్వాల్సిన హామీలను గుర్తించేందుకుగాను కాంగ్రెస్ పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది. మైనార్టీ డిక్లరేషన్ కోసం టీపీసీసీ ఏర్పాటు చేసిన మాజీమంత్రి షబ్బీర్‌అలీ నేతృత్వంలోని కమిటీ బుధవారం సమావేశమైంది. సమావేశంలో కమిటీసభ్యులు జాఫర్ జావెద్, అబ్దుల్లా సొహైల్, ఉజ్మా జకీర్, ఫహీం ఖురేషీ, ఎజికిల్, సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, దీపక్ జాన్, రషీద్ ఖాన్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ మైనార్టీ డిక్లరేషన్‌లో పొందుపర్చాల్సిన అంశాలపై చర్చించేందుకు సబ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సబ్ కమిటీలు భాగస్వామ్య పక్షాలు, మేధావులు, ఇతర ప్రజాసంఘాలతో సమావేశమై వారి సూచనలు, సలహాలు తీసుకుంటాయని అన్నారు. మైనార్టీలకు భవిష్యత్తుపై భరోసా కలిగించే విధంగా కాంగ్రెస్ హయాంలో అమలు చేయబోయే కార్యక్రమాలను డిక్లరేషన్‌లో పొందుపరుస్తామని షబ్బీర్‌అలీ వెల్లడించారు.

రాష్ట్రంపై ఆర్‌ఎస్‌వీ పంజా

- చిన్నారులు సహా పెద్దలపైనా శ్వాస సంబంధిత వైరస్ దాడి
- రాష్ట్రంలో పలు ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శ్వాసకోశ వైరల్ ఇన్ఫెక్షన్‌కు సంబంధించిన రెస్పిరేటరీ సింకీషియల్ వైరస్ (ఆర్‌ఎస్‌వీ) కేసులు పెరుగుతున్నాయి. చిన్నపిల్లల ఆసుపత్రులు, ఇతర సాధారణ ఆసుపత్రుల్లోనూ ఇలాంటి కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తుంది. ప్రస్తుతం నమోదవుతున్న శ్వాసకోశ వ్యాధుల్లో ఆర్‌ఎస్‌వీ ఒక ప్రధాన కారణంగా ఉంటోంది. చిన్న పిల్లల్లో ఎక్కువగా ఈ కేసులు నమోదవుతున్నాయి. మరీ ముఖ్యంగా రెండు వారాలుగా వైరల్ న్యుమోనియా కేసులు పెరుగుతున్నాయి. జలుబు కాస్తా న్యుమోనియాగా దారితీస్తుంది. దమ్ము కూడా వస్తుంది. 5 ఏళ్లలోపు... 60 ఏళ్లు పైబడిన లేదా దీర్ఘకాలిక జబ్బులున్న వారిపై దీని ప్రభావం ఎక్కువగా కనబడుతోంది. ఇతర వయసువారిపైనా ప్రతాపం చూపిస్తోంది. జ్వరం, జలుబు, కఫంతో కూడిన తీవ్రమైన దగ్గు, నిమ్ము, బలహీనత రెండు వారాల వరకు ఉంటుంది. చిన్న పిల్లల్లో ఐసీయూకు వెళ్లాల్సిన పరిస్థితి కూడా వస్తుంది. దగ్గు వచ్చిన మొదట్లోనే అప్రమత్తం కావాలని, చిన్నపిల్లలు మూడు నాలుగు రోజుల తర్వాత అది నిమ్ము దశకు చేరుకుంటుందని డాక్టర్లు చెబుతున్నారు. ఆర్‌ఎస్‌వీలో ఏ, బీ అనే రెండు రకాలున్నాయి. ఇప్పటివరకు ఇండియా 587 ఏ రకం వైరస్, 344 బీ రకం వైరస్‌లను ప్రపంచ ఆరోగ్య సంస్థ విశ్లేషించింది.

ఏడాదికి సగటున దేశంలో 3.31 కోట్ల చిన్నారులపై వైరస్ పంజా...

ప్రతీ ఏడాది భారత్‌లో సగటున 3.31 కోట్ల మంది చిన్నారులు ఆర్‌ఎస్‌వీ బారిన పడుతున్నారు. వారిలో 10 శాతం మంది ఆసుపత్రుల పాలవుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. ఏడాదికి ఈ వైరస్ వల్ల దేశంలో 59,600 మంది చనిపోతున్నారు. రెండేళ్లు నిండిన ప్రతి చిన్నారి ఒక్కసారైనా ఈ వైరస్ బారినపడతారు. ఈ సంవత్సరం దాని ప్రభావం మరింత పెరిగింది. ఐదు వారాల క్రితం వరకు ఈ వైరస్ పాజిటివిటీ రేటు 5 శాతం లోపుగా ఉంటే, ప్రస్తుతం 10 శాతంగా ఉందని కేంద్రం తెలిపింది. ఐసీఎంఆర్ డ్యాష్‌బోర్డ్ ప్రకారం వైరల్ కేసుల్లో 15 శాతం ఆర్‌ఎస్‌వీ కేసులే.

మెగా డీఎస్సీ కాదు... దగా డీఎస్సీ

- చేతి గుర్తు మా చిహ్నం... చేసి చూపించడం మా నైజం
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ట్వీట్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది మెగా డీఎస్సీ కాదని, నిరుద్యోగులను దగా చేసే డీఎస్సీ అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. విద్యా శాఖ గణాంకాల ప్రకారం 21 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సీఎం మాటల ప్రకారమే 13 వేల పోస్టులు భర్తీ చేయాలని, కానీ నోటిఫికేషన్లు ఇచ్చేది మాత్రం 5 వేల పోస్టులకేనా అని ట్విట్టర్ వేదికగా ఆయన బుధవారం ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదని, ఎన్నికల కోసం కేసీఆర్ దగా డీఎస్సీ అని ట్వీట్ చేసిన రేవంత్.. మెగా డీఎస్సీ కోసం నిరుద్యోగులు చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు.

'కారు' కూతలు రావు

తమ చిహ్నం చేతి గుర్తు అని, చేసి చూపించడమే తమ నైజమని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రధాన హామీల్లో ఒకటైన గృహలక్ష్మి పథకం ప్రారంభం సందర్భంగా ఆయన బుధవారం ట్వీట్ చేశారు. 'ఇచ్చిన మాట ప్రకారమే, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే, కర్ణాటక ప్రజలకిచ్చిన 5 హామీల్లో నాలుగింటిని నెరవేర్చి చరిత్ర సృష్టించాం. 'కారు'కూతలు రావు... 'జూటా'మాటలు లేవు, వస్తున్నాం తెలంగాణలోనూ .. అమలు చేస్తున్నాం ఇచ్చిన హామీలను.. మోసుకొస్తున్నాం చిరునవ్వులను'అని తన ట్విట్టర్ పోస్టులో పేర్కొన్నారు. వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ట్విట్టర్ వేదికగా రేవంత్‌రెడ్డి స్పందించారు. 'ఒక గజదొంగ దారిదోపిడీ చేసి సర్వం దోచుకున్న తర్వాత దారి ఖర్చుల కోసం రూ.200 ఉంచుకోవాలని ఇచ్చినట్టుగా కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉంది. ఇన్నాళ్లూ పేద, మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులపాలు చేసి తీరా ఇప్పుడు గ్యాస్ ధర తగ్గించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. కాగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

టికెట్ వస్తుందా.. కటీఫ్ చెప్పేద్దామా?

▶ మొదటి పేజీ తరువాయి

కార్యాచరణ ప్రకటిస్తామన్న అసంతృప్త నేతలు లోలోన తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఎన్నికల షెడ్యూలు వెలువడేందుకు మరో నెల రోజులకు పైగా వ్యవధి ఉండటంతో అభ్యర్థుల జాబితాలో మార్పులు చేర్పులు ఉంటాయని ఆశావహ దృక్పథంతో లెక్కలు వేసుకుంటున్నారు.

కేటీఆర్ రాక కోసం ఎదురుచూపులు

ఒకేసారి 115 మంది అభ్యర్థుల జాబితాను బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ విడుదల చేయగా, నేటికీ సుమారు డజనుకు పైగా నియోజకవర్గాల్లో అసమ్మతులు మెట్టు దిగడం లేదు. ప్రగతిభవన్ దిశా నిర్దేశం మేరకు బుజ్జగింపుల పర్వం కొనసాగుతున్నా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. కేటీఆర్ అమెరికా పర్యటనను నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఆయనతో భేటీ అయ్యేందుకు టికెట్ ఆశించి భంగపడిన నేతలు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, చిలుముల మదన్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు. జాబితా ప్రకటన తర్వాత బీఆర్‌ఎస్ అధినేత ఆదేశాల మేరకు పలు సర్వే సంస్థలు రంగంలోకి దిగి క్షేత్ర స్థాయిలో పరిస్థితిని మదింపు చేస్తున్నాయి. ఈ సర్వే ఫలితాల ఆధారంగా కొందరు అభ్యర్థులను మార్చక తప్పని సరి పరిస్థితి ఉంటుందని బీఆర్‌ఎస్ ఆశావహులు భావిస్తున్నారు.

ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఎవరో?

ఇక పార్టీ టికెట్ దక్కించుకున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర అభ్యర్థులు తమపై పోటీ చేసే ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులపై ఆరా తీస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి ఎవరికి టికెట్ దక్కుతుందనే ఉత్కంఠ మెజారిటీ బీఆర్‌ఎస్ అభ్యర్థులను వెంటాడుతోంది. విపక్ష పార్టీ అభ్యర్థుల బలాబలాలకు అనుగుణంగా తమ వ్యూహాన్ని అమలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మరోవైపు సొంత పార్టీలో అసమ్మతి సుమారు 40కి పైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో తీవ్ర స్థాయిలో ఉన్నట్లు బీఆర్‌ఎస్ గుర్తిస్తోంది. పార్టీ అభ్యర్థులకు చాలా చోట్ల సొంత పార్టీ నేతల నుంచే సహాయ నిరాకరణ ఎదురవుతుండటంతో వారిని బుజ్జగించేందుకు తంటాలు పడుతున్నారు. మరో వారం రోజుల్లో పార్టీ పరంగా కూడా పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలకు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించేందుకు కసరత్తు జరుగుతోంది.

నియోజకవర్గాలకు ప్రచార సామగ్రి

అభ్యర్థుల జాబితా విడుదల చేసిన బీఆర్‌ఎస్ ప్రస్తుతం ప్రచార సామగ్రిని తరలించే పనిలో ఉంది. నియోజకవర్గాల వారీగా వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన ఓటర్లు, గ్రామాలు, పథకాల వారీగా వారి వివరాలను పార్టీ అభ్యర్థులకు అందజేస్తున్నారు. తమ నియోజకవర్గంలో ప్రచారాన్ని ప్రారంభించాల్సిందిగా మంత్రి హరీశ్‌రావు, కవితపై పార్టీ అభ్యర్థులు ఒత్తిడి తెస్తున్నారు. ఓవైపు అక్టోబర్ 16న వరంగల్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఆలోగా ప్రచారాన్ని తీవ్రస్థాయికి తీసుకెళ్లేలా కేసీఆర్‌తో పాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ప్రచార షెడ్యూలుపైనా కసరత్తు జరుగుతోంది.

మేం మాట నిలబెట్టుకున్నాం

- కర్ణాటకలో ఐదు హామీలిస్తే నాలుగు అమల్లోకి తెచ్చాం: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: అటు కేంద్రంలో..ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని, అదే కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రజలకు అందుబాటులో తెచ్చి చరిత్ర సృష్టిస్తోందని నల్లగొండ ఎంపీ కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కర్ణాటకలో బుధవారం గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించిన సందర్భంగా గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీనేతలు మహేశ్‌కుమార్‌గౌడ్, బొల్లు కిషన్, నగేశ్‌ముదిరాజ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ 99 హామీలిచ్చి ఇప్పటివరకు 9 మాత్రమే నెరవేర్చింది. రుణమాఫీ నుంచి నిరుద్యోగ భృతి వరకు ఏ హామీని అమలు చేయలేకపోయింది. ఇక, బీజేపీ ఇచ్చిన హామీలకు దిక్కూదివానం లేకుండా పోయింది. కర్ణాటక ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఐదు హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండు నెలలు తిరగకముందే నాలుగింటిని అమలుపరచింది.'అని చెప్పారు. తెలంగాణలోనూ ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని చెప్పారు.

అహంకారమే గద్దె దించుతుంది

అహంకారమే బీఆర్‌ఎస్‌కు ప్రధాన శత్రువని, ఆ అహంకారమే వారిని గద్దె దించబోతుందని ఉత్తమ్ చెప్పారు. సిట్టింగ్‌లకు టికెట్లు ఇవ్వడాన్ని బట్టి కేసీఆర్ తన ఎమ్మెల్యేల అవినీతికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు ఉందన్నారు. తాను హుజూర్‌నగర్‌లో, తన భార్య పద్మ కోదాడలో పోటీ చేస్తారని, ఏదైనా ఏఐసీసీ నిబంధనలు, ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌కు అనుగుణంగానే తమ పోటీ ఉంటుందని చెప్పారు. ఇద్దరికీ 50 వేల మెజారిటీ కంటే తక్కువ వస్తే.. రాజకీయాలను వదిలేస్తానని ఆయన పునరుద్ఘాటించారు.

టీచర్ పోస్టులను భర్తీ చేయకుంటే ప్రగతిభవన్ ముట్టడిస్తాం

కేసీఆర్‌కు కోమటిరెడ్డి బహిరంగ లేఖ




సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అసెంబ్లీ సాక్షిగా చెప్పిన 13,500 టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయకపోతే ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం సీఎం కేసీఆర్‌కు కోమటిరెడ్డి బహిరంగలేఖ రాశారు. ఉద్యోగాల్లేక లక్షలాదిమంది నిరుద్యోగులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఆకాంక్షలు ఎక్కడ నెరవేరాయో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరగలేదని, ప్రస్తుతం ప్రకటించిన డీఎస్సీలో మాత్రం 5వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం ఏమిటని నిలదీశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి నిరుద్యోగుల బాధలను గుర్తించాలని అన్నారు.

ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తా: గుమ్మడి అనురాధ



ఇల్లెందు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె, ఉస్మానియా లా కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ఖమ్మం జిల్లా సింగరేణి మండలం టేకులగూడెంకు చెందిన ఆమె తండ్రి నర్సయ్య ఐదు దఫా లు ఇల్లెందు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె ఇల్లెందులో మాట్లాడుతూ పదిహేనేళ్లుగా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందన్నారు. ఖూనీలు, కబ్జాకోరు రాజకీయాలకు తెరదించాలని నిర్ణయించుకున్నట్లు అనురాధ తెలిపారు. తన తండ్రి నర్సయ్య ఆదర్శాలతో ముందుకు సాగుతానని చెప్పారు.

తెలంగాణపై అవగాహన లేని వ్యక్తి రేవంత్: దాసోజు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పట్ల సమగ్రమైన ఆలోచన, అవగాహన లేని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ప్రజలను మభ్యపెట్టేందుకు చిల్లర డిక్లరేషన్లు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కూడా మభ్య పెట్టి ఆయనతోనూ డొల్ల డిక్లరేషన్లు చదివిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల కాంగ్రెస్ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై మల్లికార్జున ఖర్గేకు రాసిన బహిరంగ లేఖను బుధవారం దాసోజు శ్రవణ్ విడుదల చేశారు. తెలంగాణ ఏర్పాటు నుంచి ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల జాబితాను ఆ లేఖలో పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో రూ.1.81లక్షల కోట్లను వెనుకబడిన వర్గాల కోసం కేసీఆర్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు.

బీజేపీలో కృష్ణయాదవ్ చేరికకు బ్రేక్!

- కొందరు నగర నేతల వ్యతిరేకతే కారణం?
- తాజా పరిణామాలపై ఈటల అసంతృప్తి!



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ బీజేపీలో చేరికకు బ్రేక్ పడింది. బుధవారం బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరాల్సి ఉండగా, ఆ కార్యక్రమం వాయిదా పడింది. ఆయనపై ఉన్న స్టాంప్‌ల కుంభకో ణం కేసు, ఇతరత్రా కారణాలతో కొందరు నగర పార్టీ నేత లు కృష్ణయాదవ్ బీజేపీలోకి రావడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. గతంలో టీడీపీ, బీఆర్‌ఎస్‌లో ఉన్న కృష్ణయాదవ్‌ను చేర్చుకునే విషయంలో కోర్ కమిటీ ఇంకా తుది నిర్ణయం తీసుకోకముందే ఆయన చేరిక ముహూర్తం ఖరారు చేసుకోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. మొత్తం మీద చేరిక కార్యక్రమం వాయిదా పడటంతో ఆయన అనుచరులు నిరాశకు గురయ్యారు.

కృష్ణయాదవ్, తుల ఉమ వ్యవహారంలో ఈటల కినుక!


కృష్ణయాదవ్‌ను పార్టీలో చేర్పించే విషయంలో కొంతకాలంగా సంప్రదింపులు జరిపి, పార్టీ నేతలతోనూ మాట్లాడిన రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ కూడా ఈ పరిణామంతో అసంతృప్తికి గురైనట్టు తెలుస్తోంది. మరోవైపు అధికార బీఆర్‌ఎస్‌ను వదిలి తనతో పాటు బీజేపీలోకి వచ్చిన మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ ఆశిస్తున్న వేములవాడ అసెంబ్లీ స్థానం విషయంలో హామీ లభించకపోవడంపైనా ఈటల కినుక వహించినట్టు చెబుతున్నారు. మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగరరావు కుమారుడు డాక్టర్ వికాస్‌రావును పార్టీలో చేర్చుకోవడంపై కూడా ఆయన అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది.

త్వరలోనే బీజేపీలో చేరుతా: కృష్ణయాదవ్

నాంపల్లి (హైదరాబాద్): 'బీఆర్‌ఎస్ పార్టీ కోసం ఏడేళ్లు పనిచేశాను. కానీ బీఆర్‌ఎస్ నన్ను గుర్తించలేదు. నా సేవలను వినియోగించుకోలేదు. మరో రెండు, మూడ్రోజుల్లో బీజేపీలో చేరి బడుగు బలహీన వర్గాలకు సేవ చేస్తా'అని మాజీ మంత్రి కృష్ణయాదవ్ అన్నారు. ఈ మేరకు బుధవారం నాంపల్లిలోని రెడ్‌రోజ్ ఫంక్షన్ హాలులో పార్టీ కార్యకర్తలు, నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ టికెట్ ఇస్తానని చెప్పి రెండు పర్యాయాలు మోసం చేసిందన్నారు.

నిశ్చితార్థం దశలో పొత్తు చర్చలు

- కాంగ్రెస్, లెఫ్ట్ కలసి పోటీ చేస్తే బీఆర్‌ఎస్ ఓటమి తథ్యం: నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కాంగ్రెస్ పార్టీతో కలసి పోటీ చేసే దిశగా కమ్యూనిస్టు పార్టీలు చర్చలు జరుపుతున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చెప్పారు. ప్రస్తుతం అవి నిశ్చితార్థం స్టేజ్‌లో ఉన్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలసి పోటీచేస్తే బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు వచ్చే పరిస్థితి కూడా లేదని, ఓటమి తథ్యమని అన్నారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కలసి పని చేస్తే ఓట్లు తమకే బదిలీ అవుతాయని నారాయణ చెప్పారు. తెలంగాణలో బండి సంజయ్ మార్పుతో బీజేపీ పని అయిపోయిందన్నారు.

గవర్నర్‌కు బానిసలా కేసీఆర్..: గతంలో ప్రధాని మోదీ, కేసీఆర్‌లు ఉప్పు నిప్పు అన్నట్టుగా ఎన్నో మాటలు మాట్లాడారని, గవర్నర్‌ను కేసీఆర్ అటెండర్ మాదిరిగా చూశారని నారాయణ చెప్పారు. ఢిల్లీ నుంచి మొట్టికాయలు పడగానే గవర్నర్‌కి బానిస మాదిరిగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత విషయంలోనే కేసీఆర్ బీజేపీకి లొంగిపోయారని ఆరోపించారు.

గులాబీ కండువా కప్పుకున్నోళ్లకే పథకాలు

చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ''బల్లగుద్ది చెబుతున్నా..గులాబీ కండువా కప్పుకున్నోళ్లకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇస్తాం. వందశాతం మా వాళ్లకే ఇచ్చుకుంటాం. ఎవరు ఏం అనుకున్నా బాధలేదు. పేపర్‌వాళ్లు ఏం రాసుకున్నా నాకు అభ్యంతరం లేదు''అని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండలం కొమరబండలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి శంకుస్థాపన సందర్భంగా ఎంపీ చేసిన ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పార్టీ కండువా కప్పుకున్నోళ్లకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇస్తామని స్వయంగా ఎంపీనే చెప్పడం హాస్యాస్పదమని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ అన్నారు.

ఇతర పార్టీలకు ఓటేస్తే.. పాపం తగులుతుంది

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



జడ్చర్ల: అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్‌ఎస్‌కు కాకుండా ఇతర పార్టీలకు ఓట్లు వేస్తే.. వారికి పాపం తగులుతుందని జడ్చర్ల ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం జడ్చర్ల, రాజాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తండాలకు బీటీ రోడ్లు, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, సీసీరోడ్లు, డ్రైయినేజీలను ఏర్పాటు చేశామని చెప్పారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనన్నారు. పాలమూరు ప్రాజెక్ట్ ద్వారా రైతులకు సాగు నీరు అందిస్తామని, ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తయితే భూములు సస్యశ్యామలం అవుతాయన్నారు.

బీఆర్‌ఎస్‌లో అసంతృప్తి 'పురాణం'

తనను పట్టించుకోకపోవడంపై కినుక



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బీఆర్‌ఎస్‌లో అసంతృప్త నేతలు ఒక్కొక్కరుగా బయటపడుతున్నారు. తాజాగా సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు అనుచరులు చెబుతున్నారు. చెన్నూరు నియోజకవర్గం కోటపల్లికి చెందిన ఆయన మంచిర్యాలలో సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తనకు అవకాశమివ్వాలని అడిగినా అధినేత పట్టించుకోలేదు. అంతకుముందు మరోమారు ఎమ్మెల్సీగా చాన్స్ ఇస్తారనుకున్నా దక్కలేదు. కొంతకాలంగా ఆయనను పార్టీలో పక్కకు బెట్టడం, సముచిత స్థానం ఇవ్వకపోవడంపై అనుచరులు నిరాశలో ఉన్నారు. ఈ క్రమంలో పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోలేదని చెబుతున్నారు.

'కొడవలి'తో కుదిరేనా?

▶ మొదటి పేజీ తరువాయి

కారణంగా రాష్ట్ర స్థాయిలోనూ దోస్తీ కొనసాగించాలని రెండు పక్షాల హైకమాండ్‌లు భావిస్తున్నాయి. రాష్ట్రంలోని ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కూడా కాంగ్రెస్‌తో కలిసి పనిచేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నాయి. కానీ మెజార్టీ కాంగ్రెస్ నేతలు మాత్రం గతంలోలా ఓట్ల బదిలీ జరిగే అవకాశం లేదని అందువల్ల ఒంటరి పోటీయే మంచిదనే అభిప్రాయంతో ఉన్నారు.

జాతీయ స్థాయిలోనే ప్రతిపాదనలు

లెఫ్ట్, కాంగ్రెస్‌ల మధ్య పొత్తు వ్యవహారం ఇంకా కింది స్థాయికి రాలేదని, ఇప్పటిరకు ఏఐసీసీ, లెఫ్ట్ పార్టీల జాతీయ నాయకత్వం స్థాయిలోనే ఈ ప్రతిపాదన ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఇరు కమ్యూనిస్టు పార్టీల రాష్ట్ర నేతలతో ఫోన్‌లో మాట్లాడారని వివరిస్తున్నాయి. 'వారు మాట్లాడుకున్న తర్వాత వ్యవహారం రాష్ట్ర పార్టీల వరకు వస్తుంది. అప్పుడు ఏం జరుగుతుందో చూద్దాం.' అని టీపీసీసీకి చెందిన ముఖ్య నేత ఒకరు వ్యాఖ్యానించారు. మరోవైపు రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఈసారి ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలు ఎన్ని స్థానాల్లో ప్రభావితం చూపుతాయన్న దానిపై కూడా కాంగ్రెస్ నేతలు అంచనాలు వేస్తున్నారు. రాష్ట్రంలో లెఫ్ట్ పార్టీల ప్రభావం బాగా తగ్గిపోయిందని, 10–15 చోట్ల అంతో ఇంతో ఓటుబ్యాంకు ఉందని, నాలుగైదు చోట్ల మాత్రం గెలుపోటములను ప్రభావితం చేయవచ్చని భావిస్తున్నారు.

ఆ ఆరూ.. అసాధ్యమే

ఇతర పార్టీలతో పొత్తు కుదిరితే ఏయే అసెంబ్లీ స్థానాలు అడగాలన్న దానిపై సీపీఎం, సీపీఐ నేతలు ఇప్పటికే ఓ అభిప్రాయానికి వచ్చారు. పార్టీ రాష్ట్ర కమిటీల్లో చర్చించిన అనంతరం ఈ సీట్లపై ఏకాభిప్రాయం కూడా వచ్చినట్టు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు, భద్రాచలం, మధిర, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, మిర్యాలగూడతో పాటు రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వచ్చే ఇబ్రహీంపట్నం స్థానాల్లో పోటీ చేయాలనే ఆలోచనతో సీపీఎం ఉంది. అయితే ఈ ఆరు స్థానాల్లో ఒక్క స్థానం వదులుకోవడం కూడా సాధ్యం కాదనే అభిప్రాయం కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. మధిర, భద్రాచలంలో సిట్టింగ్ ఎమ్మెల్యేలుండగా, పాలేరులో గతంలో కాంగ్రెస్ గెలిచింది. ఇక ఇబ్రహీంపట్నంలో మల్‌రెడ్డి రంగారెడ్డి, మిర్యాలగూడలో బత్తుల లక్ష్మారెడ్డి, కె.రఘువీర్‌రెడ్డి లాంటి బలమైన నేతలున్నారు. నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం పోటీ చేస్తారనే ప్రచారం ఉంది. దీంతో సీపీఎం అడిగే ఈ ఆరుస్థానాల విషయంలోనూ చిక్కుముడికి అవకాశం ఉందని అంటున్నారు.

అతికష్టంగా ఆ ఒక్కచోట..!

సీపీఐ ఐదు సీట్లలో పోటీ చేయాలని భావిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, వైరా, నల్లగొండ జిల్లా మునుగోడు, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ స్థానాలపై ఆ పార్టీ దృష్టి ఉంది. కాంగ్రెస్‌తో చర్చల్లో ఈ స్థానాలను అడిగే అవకాశాలున్నాయి. అయితే కొత్తగూడెం స్థానాన్ని సీపీఐకి కాంగ్రెస్ ఇచ్చే అవకాశం లేదు. వైరాలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరోక్ష మద్దతుతో గెలిచిన ఎమ్మెల్యే రాములు నాయక్ బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో అక్కడ పోటీకి రాందాస్ నాయక్‌తో పాటు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వర్గానికి చెందిన విజయాబాయి పోటీ పడుతున్నారు. కాబట్టి ఈ స్థానాన్ని సీపీఐకి ఇవ్వడం కుదరదని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి. బెల్లంపల్లిలో మాజీ మంత్రి గడ్డం వినోద్, హుస్నాబాద్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌లు బరిలో ఉండే అవకాశం ఉంది కాబట్టి ఆ రెండు స్థానాలను వదులుకోవడం కూడా కాంగ్రెస్‌కు కష్టమే. ఇక మిగిలిన మునుగోడులోనే సీపీఐని సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. మునుగోడులో 2018 ఎన్నికల్లో గెలిచినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. ఈసారి ఈ స్థానాన్ని పాల్వాయి స్రవంతి, పున్నా కైలాశ్‌నేత, చల్లమల్ల కృష్ణారెడ్డి ఆశిస్తున్నారు. దీంతో ఒకవేళ ఇస్తే మునుగోడునే సీపీఐకి ఇవ్వాల్సి వస్తుందని మెజారిటీ కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే వామపక్షాలతో చర్చలకు వెళ్లి పొత్తు కుదుర్చుకోవాల్సి వస్తే మాత్రం కనీసం చెరో రెండు సీట్లను వదులుకోవాల్సి ఉంటుందని, దానివల్ల పార్టీకి నష్టమే జరుగుతుంది తప్ప ఎలాంటి లాభం ఉండదనేది కొందరి అభిప్రాయంగా ఉంది.

ఆ రెండు సీట్లు అసలు కుదరవు?

ఉభయ కమ్యూనిస్టు పార్టీల సారథులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావులు పోటీ చేయాలని భావిస్తున్న పాలేరు, కొత్తగూడెం స్థానాలపై పీటముడి పడే అవకాశం ఉందని, ఆ రెండు సీట్లు వదులుకోవడం కాంగ్రెస్ పార్టీకి సాధ్యం కాదనే అభిప్రాయం వినిపిస్తోంది. పాలేరు, కొత్తగూడెంలలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, స్థానిక ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లోకి వెళ్లినా ఆ రెండు చోట్లా 2018లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించిందని, అలాంటప్పుడు ఆ సీట్లను ఎలా వదులుకుంటామని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. 'పొత్తులపై చర్చలు జరిగితే సీపీఐ, సీపీఎంలు ఆ రెండు సీట్లపైనే పట్టుపట్టడం ఖాయం. కానీ మేం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రెండు స్థానాలు ఇవ్వలేం. అందువల్ల చర్చలకు వెళ్లకపోవడమే మంచిదేమో..' అని కాంగ్రెస్ కీలక నేత ఒకరు వ్యాఖ్యానించారు. 'ఈసారి ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల నుంచే మేం మెజార్టీ సీట్లు గెలుస్తామని అనుకుంటున్నాం. అక్కడ నాయకత్వం బాగా కష్టపడి పార్టీని నిలబెట్టింది. అలాంటి చోట్ల సీట్లు కమ్యూనిస్టులకు ఇస్తామంటే స్థానిక నాయకత్వం ఎలా స్పందిస్తుందో తెలియదు. కాబట్టి ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్నాం.' అని మరో ముఖ్యనేత చెప్పారు.



ధనాన్ని కోల్పోతే చాలా కోల్పోయినట్టు;
స్నేహితుడిని కోల్పోతే చాలా ఎక్కువ కోల్పోయినట్టు;
కానీ ధైర్యాన్ని కోల్పోతే సర్వం కోల్పోయినట్టు!
– మిగెల్ సెర్వాంటీజ్

సాక్షి
గురువారం, 31 ఆగస్టు 2023

ఆత్మహత్యలు కాదు... హత్యలే!

ఒకరూ, ఇద్దరూ కాదు... ఈ ఏడాది ఇప్పటి వరకు 24 మంది. అదీ మొన్న ఆదివారం ఒక్కరోజే నాలుగు గంటల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు. దేశంలోని అగ్రశ్రేణి ఇంజనీరింగ్, మెడికల్ విద్యాసంస్థల్లో ప్రవేశపరీక్షలకు కోచింగ్ ఇచ్చే కర్మాగారంగా పేరొందిన రాజస్థాన్‌లోని కోటాలో ఆత్మహత్యల మరణమృదంగం ఆగకుండా మోగుతోంది. గత ఏడాది ఇదే పట్నంలో 15 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకుంటే, ఈ ఏడాది ఇప్పటికి ఎనిమిది నెలల్లోనే అంతకు మించి అమాయకులు బలవన్మరణానికి దిగారు. గత ఎనిమిదేళ్ళలో అత్యధిక ఆత్మహత్యల సంఖ్య ఇదే. సంక్షోభ తీవ్రతను ఇది ప్రతిబింబిస్తోంది. రెండు నెలల పాటు ఈ కోచింగ్ కేంద్రాల్లో పరీక్షలను నిలిపివేస్తూ స్థానిక పాలనా యంత్రాంగం ఆదేశాలు జారీ చేయాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఉన్నత చదువులు చదివి, జీవితంలో ఉజ్జ్వలంగా ఎదగాల్సిన భావి పౌరులు పరీక్షల అతి ఒత్తిడితో ఆయువు తీసుకుంటున్న విషాదం మరోసారి అందరినీ ఆత్మపరిశీలనకు పురిగొల్పుతోంది.

కోటాలో ఆత్మహత్యలు ఇవాళ కొత్త కావు. కోచింగ్‌లతో పాటు ఒత్తిడి తట్టుకోలేని విద్యార్థుల బలవన్మరణాలకూ ఈ పట్నం కొన్నేళ్ళుగా పేరుబడింది. అక్కడన్నీ వారాంతపు సెలవైనా లేకుండా రోజుకు 14 నుంచి 18 గంటల పాటు పిండి రుబ్బినట్టు పాఠాలు రుబ్బించే విద్యార్థి కర్మాగారాలే! వాటిలో పిల్లలు అనుభవించే మానసిక చిత్రవధ వర్ణనాతీతం. కఠినమైన పాఠ్యప్రణాళికను పూర్తి చేయాలనే ఒత్తిడి, నిద్ర లేని రాత్రులు, నిరంతరం అంచనా పరీక్షలు, ఎక్కడ లేని పోటీ, వైఫల్య భయం, వీటన్నిటికీ తోడు తల్లితండ్రులకూ – ఇంటికీ దూరంగా ఒంటరి జీవితం... ఇవన్నీ పసి మనసుల్ని ప్రాణాలు తీసుకొనేంతగా ప్రేరేపిస్తున్నాయి. పిల్లలపై మానసిక ఒత్తిడి, విద్యావిధానంలోని లోపాల గురించి దశాబ్దాలుగా చర్చ జరుగుతూనే ఉంది. కోటా మాత్రం అవేవీ పట్టకుండా ఏటేటా ఫలితాలందిస్తూనే ఉంది. వెరసి, ఇవాళ్టికీ ఈ కోచింగ్ కర్మాగారానికి తమ పిల్లలతో తల్లితండ్రులు పోటెత్తుతున్నారు. ఏటా 2.5 లక్షల మంది విద్యార్థులు వస్తుంటారు. అగ్రశ్రేణి టీచర్‌కు సంవత్సరానికి కోటి రూపాయల జీతమిచ్చే అక్కడ కోచింగ్ రూ. 5 వేల కోట్ల వార్షిక వ్యాపారం.

సమాజంలో యువతరం ఆకాంక్షలు నిరంతరం పెరుగుతున్నాయి. ఆర్థికవ్యవస్థలో అవకాశాలేమో అంతకంతకూ తగ్గుతున్నాయి. అదే ఇవాళ పెను ప్రజారోగ్య సమస్యగా తయారైంది. కోటాలోని పరిణామాలు అందుకు ప్రతీక. వికాసాన్ని కల్పించాల్సిన విద్యను వ్యాపారంగా మార్చడంతో తలెత్తిన సంక్షోభానికి పరాకాష్ఠ. ర్యాంకులే ధ్యేయంగా ప్రైవేట్ విద్యా వ్యాపారులు సృష్టించిన ఈ తరహా సంక్షోభం తెలుగు రాష్ట్రాల్లోనూ గతంలో మనం చూసినదే. దీనికి ఏ ఒక్కరో కాదు...అందరం బాధ్యులమే. సృజనాత్మక కళల పట్ల ఆసక్తి ఉంది మొర్రో అంటున్నా శాస్త్ర సాంకేతిక విద్య వైపు పిల్లల్ని నెట్టడం, తాము కాలేకపోయిన ఇంజనీరో – డాక్టరో తమ పిల్లలు కావాలనుకోవడం, తోటి వారితో పోలికల మూర్ఖత్వం... ఇవన్నీ మన తప్పిదాలే! కోటాలోనే కాదు, దేశవ్యాప్తంగా అన్నిచోట్లా పరిస్థితిదే! నేషనల్ క్రైమ్‌రికార్డ్స్ బ్యూరో 2021 నివేదిక ప్రకారం దేశంలో విద్యార్థుల ఆత్మ హత్యలు 4.5 శాతం పెరిగాయి. ఆ దుష్కీర్తిలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు ముందున్నాయి. అయిదేళ్ళుగా ఇవి పెరుగుతున్నాయనీ నివేదిక స్పష్టం చేసింది. ఇది తాజా ప్రమాద ఘంటిక.

కోటాలో ఎక్కువమంది విద్యార్థులు డిప్రెషన్‌తో బాధపడుతున్నారని 2018లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నివేదిక వెల్లడించింది. తాజా సర్వే ప్రకారం అక్కడ ప్రతి 10 మందిలో నలుగురు మానసిక ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నవారే. కోచింగ్ సంస్థల్ని నియంత్రిస్తూ రాష్ట్ర సర్కార్ ఓ బిల్లును ప్రతిపాదించినా, ఇంకా అమలులోకి రాలేదు. వారానికో రోజు ఒక పూట చదువు, మరోపూట వినోదమనే పద్ధతి పాటించాలనీ, పక్షానికోసారి పిల్లల మానసిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలనీ రాజస్థాన్ ప్రభుత్వ తాజా ప్రతిపాదన. గదుల్లో సీలింగ్ ఫ్యాన్ల బదులు గోడలకు బిగించే ఫ్యాన్లు పెట్టాలని 2021లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ వారు చెప్పారట! ఈసారేమో స్ప్రింగులు, సెన్సార్‌తో కూడిన సీలింగ్ ఫ్యాన్లు పెడితే ఆత్మహత్యా యత్నం చేసినా సరే ఉరి బిగుసుకోదంటూ స్థానిక పాలనా యంత్రాంగం వింత ఆలోచన చేసింది. మేడపై నుంచి కిందకు దూకకుండా వలలు, జాలీలు కట్టడం లాంటి తెలివితేటలూ హాస్టళ్ళు చూపుతున్నాయి. ఇవేవీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావు. పైగా తమపై నిత్యం నిఘా ఉందంటూ పిల్లల మనసుపై అదనపు ఒత్తిడి. నిజానికి సామాజిక, ఆర్థిక వాస్తవాలకు తగ్గట్టు పిల్లల్ని సిద్ధం చేస్తూ, అండగా నిలిచే విద్యా వ్యవస్థ అవసరం. అసలు సమస్యను వదిలేసి తాత్కాలిక ఉపశమనాల్ని ఆశ్రయిస్తే ఉపయోగం లేదు.

పరీక్షల్లో తక్కువ మార్కులొచ్చాయనీ, నలుగురిలో తలెత్తుకోలేమనీ, ఇంట్లో బాధపడతారనీ... ఆయువు తీసుకోవాలనుకోవడం పిల్లల్లో మనం నూరిపోస్తున్న తప్పుడు విలువలకు తార్కాణం. పిల్లలు అన్నిటా అద్భుతంగా రాణించాలనే విజేత స్వభావపు వ్యసనం నుంచి మనం బయటపడాలి. పిల్లలు, తల్లితండ్రులు, అధ్యాపకులు, విద్యాసంస్థలు, విధాన నిర్ణేతలు – అందరూ కలసి ఇకనైనా సంక్షోభ పరిష్కారానికి అత్యవసర చర్యలు చేపట్టాలి. పసిపిల్లల ప్రాణాలు తీస్తున్న ఈ అగ్రశ్రేణి ప్రవేశపరీక్షల విధానంపై సమగ్ర దృష్టి సారించాలి. ఇరుకిరుకు గదుల్లో పిల్లల్ని కుక్కి, కోళ్ళఫారమ్‌లలో కోడిపిల్లల్లాగా పిల్లల్ని చదివించడం, పెంచడం ఏ సమాజానికీ ఆరోగ్యం కాదు. అందుకే ఇవి ఆత్మహత్యలు కాదు... సమాజం సామూహికంగా చేస్తున్న హత్యలు. ఈ జాతీయ సంక్షోభంపై ఇప్పటికైనా పాలకులు కళ్ళు తెరవకుంటే, ఆ పసిహృదయాల ఉసురు తగులుతుంది.

అమెరికా తీరుపై చైనా గుర్రు

విశ్లేషణ



దొంతి నరసింహారెడ్డి

ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనల నేపథ్యంలో అమెరికా తీరుపై చైనా ఆగస్ట్ 18న ఒక నివేదిక విడుదల చేసింది. బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను బలహీనపరిచే అమెరికా చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థ వల్ల లబ్ధి పొందిన అమెరికా, తన దేశీయ సమస్యలకు (వాణిజ్య లోటు, నిరుద్యోగానికి) ప్రపంచ వాణిజ్యం కారణమంటూ, 2017 నుంచి కొత్త అప్పిలేట్ బాడీ సభ్యుల నియామకాలను నిలిపివేసింది. అయితే, అమెరికాను వేలెత్తి చూపుతున్న చైనా ఇతర దేశాల పట్ల తన చర్యల గురించి సమీక్షించలేదు. ఏమైనా, ప్రపంచ వాణిజ్య సంస్థ, దాని చుట్టూ ముసురుకుంటున్న సమస్యల మీద ఇటువంటి నివేదికను భారత ప్రభుత్వం కూడా రూపొందించి ప్రజలకు నివేదిస్తే బాగుంటుంది.


1990 నుంచి భారత ప్రభుత్వాలు ఆర్థిక సరళీకరణ దిశగా అడుగులు వేస్తున్నాయి. 1995లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పాటుతో పాటు రెండు ఒప్పందాల మీద దేశాలు సంతకాలు చేశాయి. అందులో వ్యవసాయం మీద చేసిన ఒప్పందం కీలకమైనది. ఆనాటి నుంచి కూడా భారతదేశం అనేక రంగాలను అంతర్జాతీయ వాణిజ్యంతో ముడిపెడుతూ వస్తున్నది. దానికి అనుగుణంగా అనేక రంగాలలో విధానాలు మార్పు చేశారు. ఈ మార్పుల వెనుక అమెరికా ఒత్తిడి ఉన్నది. అయితే, ఇటీవలి కాలంలో అనూహ్యంగా, ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రాభవం తగ్గుతూ వస్తున్నది. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలకు, చర్చలకు ప్రాధాన్యత వచ్చింది. ఎందుకంటే, ప్రపంచ వాణిజ్య సంస్థ తన ప్రయోజనాలకు అనువుగా లేదని అమెరికా భావించింది.

ఈ నేపథ్యంలో ప్రపంచ వాణిజ్య సంస్థ (వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ – డబ్ల్యూటీవో) నిబంధనల ప్రకారం అమెరికా తన బాధ్యతలను నెరవేరుస్తున్న తీరు పైన చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మొన్న ఆగస్ట్ 18 నాడు ఒక నివేదికను విడుదల చేసింది. ఈ 65 పేజీల నివేదికలో దాదాపు 210 డాక్యుమెంట్లను ఉటంకిస్తూ, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థను బలహీనపరిచే అమెరికా విధాన చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా ఏకపక్ష వాణిజ్య బెదిరింపులను, పారిశ్రామిక విధానాలలో ద్వంద్వ ప్రమాణాలను, ప్రపంచ పారిశ్రామిక, సరఫరా గొలుసులకు విఘాతం కలిగించే అంశాలను ప్రస్తావించింది.

వివాద పరిష్కార సంస్థ తీర్పులు, సిఫార్సులను ఇష్టానుసారం అమలు చేయడం ద్వార డబ్ల్యూటీవో వివాద పరిష్కార యంత్రాంగాన్ని అమెరికా బలహీనపరిచిందని ఈ నివేదిక ఎత్తిచూపింది. 157 వాణిజ్య వివాదాలలో అమెరికా ప్రతివాదిగా ఉందనీ, మొత్తం వాణిజ్య వివాదాలలో ఇది సుమారు 20 శాతం అనీ నివేదిక తెలిపింది. సంస్థాగత సమస్యల కారణంగా 2017 నుంచి కొత్త అప్పిలేట్ బాడీ సభ్యుల నియామకాలను అమెరికా నిలిపివేసిందనీ, ఈ చర్య వల్ల అప్పిలేట్ బాడీ 'నిరర్థక' పరిస్థితికి చేరుకున్నదనీ పేర్కొంది.

పారిశ్రామిక విధానాలకు సంబంధించి అమెరికా ఇతర సభ్యదేశాల మధ్య వేర్వేరు ప్రమాణాలను వర్తింపజేసిందని నివేదిక తెలిపింది. అధిక సుంకాలు విధించడం లేదా వాణిజ్య-నియంత్రణ చర్యలు తీసుకోవడం, దేశీయ పరిశ్రమలకు మద్దతు ఇవ్వడానికి భారీ సబ్సిడీలను అందించడం, పారిశ్రామిక మరియు సరఫరా గొలుసులను విచ్ఛిన్నం చేయడం వంటి వివిధ రక్షణాత్మక పద్ధతులను అమెరికా అవలంబించిందని ఆరోపించింది.

డబ్ల్యూటీవో నిర్దేశిస్తున్న వాణిజ్యం వల్ల ప్రధానంగా అమెరికా లబ్ధి పొందింది. అయితే పటిష్ఠమైన అంతర్గత ప్రయోజన పంపిణీ వ్యవస్థ లేకపోవడం వలన, దేశ ఆదాయం, ఉపాధిని సక్రమంగా నిర్వహించడంలో వైఫల్యం వల్ల అమెరికాలో వివిధ వర్గాల మధ్య



అసమానతలు పెరిగిపోయాయని చైనా నివేదిక అంటున్నది. ఒక దేశంగా తక్కువ పొదుపు, అధిక వినియోగం, అధిక రుణం ఉన్న పరిస్థితులలో, అమెరికాలో పొదుపు నిలువలు లేకపోవడం వలన ఆర్థికాభివృద్ధికి కరెంట్ ఖాతా లోటులు, వాణిజ్య లోటులపై ఆధారపడవలసి వస్తున్నది. అమెరికా ప్రభుత్వం తన దేశీయ సామాజిక సమస్యలను (వాణిజ్య లోటు, నిరుద్యోగానికి) ప్రపంచ వాణిజ్యం కారణమంటున్నది. దేశీయ విధాన వైఫల్యాలకు ప్రపంచీకరణను, ప్రపంచ వాణిజ్య సంస్థను కారణాలుగా చూపెడుతున్నది. అమెరికా ద్వంద్వ వైఖరిని చైనా నివేదిక ఎత్తి చూపెడుతున్నది. ఒకప్పుడు ఆ దేశానికి ప్రయోజనకారిగా ఉన్న కారణాలు ఈ రోజు కంటగింపుగా మారినాయి. ఇంకొకవైపు, భారత్, మెక్సికో తది తర దేశాల మీద తన ఉత్పత్తులను రుద్దే ప్రయత్నం చేస్తున్నది. దీనికి ద్వైపాక్షిక, బహుళ పక్ష ఒప్పందాలను ఆయుధంగా వాడుతున్నది.

ప్రపంచ వాణిజ్య సంస్థలో వివాద పరిష్కార వేదిక, ఈ వేదిక పనికి ఆమోదించిన పద్ధతి కీలకం. దీని సిఫార్సులు, తీర్పులు వాణిజ్యం సమతుల్యంగా, వివాదరహితంగా కొనసాగడానికి ఉపయోగపడుతున్నాయి. అన్ని తీర్పులు ఆమోదయోగ్యం కాకపోయినా, ఒక ప్రజాస్వామ్య బద్ధ వేదిక ఉండడం ముదావహం. అయితే, 2017 నుంచి అప్పిలేట్ బాడీ నిబంధనల ప్రకారం, సభ్యుల గడువు ముగిసింది. ఖాళీలు ఏర్పడ్డాయి. అనూహ్యంగా, సంస్థాగత సమస్యలను ప్రస్తావిస్తూ అమెరికా కొత్త సభ్యుల నియామకాల ప్రక్రియను నిలిపివేసింది. ప్రపంచ వాణిజ్య సంస్థలో నిర్ణయాలు ఏకాభిప్రాయం ద్వారానే ఉంటాయి. అమెరికా మొండి వైఖరితో కొత్త అప్పిలేట్ బాడీ ఏర్పడక వివాద పరిష్కార యంత్రాంగం పని చేయలేని పరిస్థితికి చేరుకున్నది. కొత్త సభ్యులతో వివాద పరిష్కార సంస్థ (డిస్ప్యూట్ సెటిల్‌మెంట్ బాడీ) ఏర్పాటుకు ఇతర దేశాల నుంచి వచ్చిన ప్రతిపాదనలను డిసెంబర్ 2022 నాటికి అమెరికా దాదాపు 60 సార్లు తిరస్కరించింది. డబ్ల్యూటీవో సభ్యదేశాలలో భారత్ సహా అత్యధికం దీనిని త్వరగా పునఃప్రారంభించడాన్ని సమర్థిస్తున్నాయి.

ప్రపంచ వాణిజ్య సంస్థ తన సభ్యులు, ఇతరులపై అనుమతి లేని ఏకపక్ష చర్యలు తీసుకోవడాన్ని నిషేధిస్తుంది. కానీ, అమెరికాకు జాతీయ భద్రత, మానవ హక్కులు, బలవంతపు సాంకేతిక బదిలీ పేరుతో ఇతర సభ్యులపై ఏకపక్ష చర్యలు ప్రకటించిన సుదీర్ఘ చరిత్ర దానికి ఉంది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో, సాంకేతిక పరిజ్ఞానంలో తనకున్న ఆధిపత్య జ్ఞానాన్ని ఉపయోగించి, తన దౌత్య విధానాలు మరియు చట్టవిరుద్ధమైన డిమాండ్లను ఇతర దేశాలు, ప్రాంతీయ వాణిజ్య సమూహాలు, సంస్థల మీద కూడా రుద్దింది. ఈ పద్ధతులు అంతర్జాతీయ వాణిజ్యంపై దుష్ప్రభావాన్ని చూపెడుతున్నాయి.

ఈ నివేదికలో చైనా 4 చోట్ల భారత్ ప్రస్తావన తీసుకువచ్చింది. 1997లో అమెరికాలో ఒక వ్యవసాయ సంస్థ బాస్మతి బియ్యాన్ని అమెరికన్ లాంగ్ ఇండికా బియ్యంతో సంకరించిన తరువాత 20 పేటెంట్ల కోసం మేధా హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నది. ఇది భారతదేశం నుండి బాస్మతి బియ్యం ఎగుమతిని తీవ్రంగా పరిమితం చేసిందని వ్యాఖ్యానించింది. ఫిబ్రవరిలో 2019లో చైనా, భారత్, దక్షిణాఫ్రికా, వెనిజులా, లావోస్ పీడీఆర్, బొలీవియా, కెన్యా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, పాకిస్తాన్, క్యూబా సంయుక్తంగా ప్రపంచ వాణిజ్య సంస్థకు ఒక విశ్లేషణాత్మక పత్రం సమర్పించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల పట్ల ఉండే వివక్షను ఎండగడుతూ, ఆయా దేశాలకు ఉన్న ప్రత్యేక పరిస్థితుల పరిరక్షణకు హక్కులను కల్పించాల్సిన అవసరాన్ని ఈ పత్రం ద్వారా కోరాయి. అదే సంవత్సరం (2019) అక్టోబర్ నెలలో, 53 సభ్యదేశాలు (చైనా, భారత్, పాకిస్తాన్, ఆఫ్రికన్ గ్రూప్ సహా) సంయుక్తంగా ఒక పత్రం సమర్పించాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రత్యేక, భిన్నమైన వాణిజ్య నిబంధనలను రూపొందించడం తమ హక్కుగా ఈ పత్రంలో వర్ణించారు.

ఈ నివేదిక ద్వారా డబ్ల్యూటీవో సభ్యత్వ దేశాలతో కలిసి పని చేస్తామని చైనా హామీ ఇచ్చింది. చైనా ఇస్తున్న ఈ హామీలు ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకృత విధానాలను వ్యతిరేకించేవారికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కమ్యూనిస్ట్ దేశంగా ముద్ర పడిన చైనా సరళీకృత ఆర్థిక విధానాలకు, ప్రపంచీకరణకు, ప్రైవేటీకరణకు ఆలవాలమైన ప్రపంచ వాణిజ్య సంస్థ కొనసాగింపునకు ఈ విధంగా ఊతం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించకమానదు. అయితే, అమెరికాను వేలెత్తి చూపుతున్న చైనా ఇతర దేశాల పట్ల తన చర్యల గురించి సమీక్షించలేదు. కనీసం ప్రస్తావించలేదు. ఏది ఏమైనా, ప్రపంచ వాణిజ్య సంస్థ, దాని చుట్టూ ముసురుకుంటున్న సమస్యల మీద ఇటువంటి సవివరమైన నివేదికను భారత ప్రభుత్వం కూడా తయారు చేసి, ప్రత్యేకంగా అమెరికా, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్ళ గురించి ప్రజలకు, పార్లమెంటుకు నివేదిస్తే బాగుంటుంది.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు । 90102 05742

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఒక ఆశ



ఇప్పుడే నూహ్ నుంచి తిరిగివచ్చాను. కౌమార బాలురు సహా వందలకొద్దీ ముస్లిం యువకులను పోలీసులు రౌండప్ చేస్తుండటంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. మరో పక్క మూడు మూకదాడుల ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అదే సమయంలో ఆశ కూడా కలుగుతోంది. ముస్లింలకు హిందువులు బాసటగా ఉండడమే కాకుండా, చాలా పంచాయతీలు ద్వేషాన్ని వ్యతిరేకిస్తూ, సౌభ్రాతృత్వానికి పిలుపునిస్తున్నాయి.

– హర్ష్ మందర్, యాక్టివిస్ట్

శుభాకాంక్షలు



ప్రియమైన భారత స్నేహితులకు, రక్షా బంధన్ శుభాకాంక్షలు. అలాగే హ్యాపీ ఓనమ్!

– నవూఫ్ అల్మార్వాయి, సౌదీ యోగాచార్య

మంచి యువకుడు



నీరజ్ చోప్రా (జావెలిన్ త్రో ఛాంపియన్) గురించి ఎంత చదువుతుంటే, అంత ఎక్కువగా ఈ అద్భుతమైన యువకుడి మీద గౌరవం పెరుగుతోంది.

– రీతూపర్ణా ఛటర్జీ, సంపాదకురాలు

అంతేనా?



ఒకవేళ ఎల్పీజీ సిలిండర్ ధరలు తగ్గించడం బహుమతి అయితే, ధర పెంచడం బలవంతంగా దోచుకోవడం అనేకదా!

– సంజయ్ ఝా, రచయిత

మంగోలియా ప్రయాణం



మంగోలియాలోని మన సోదరులు, సోదరీమణులను కలిసేందుకు నేను రేపు మధ్యాహ్నం ఆసియా ఖండానికి బయలుదేరుతాను. మీ ప్రార్థనలతో నా యాత్రను అనుసరించమని మిమ్మల్ని కోరుతున్నాను.

– పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మత గురువు

అతడు ఉద్యమాల జెండా

నైతిక విలువలకూ, తాను నమ్మిన సిద్ధాంతానికీ, నిబద్ధతకూ పెట్టింది పేరు చెన్నమనేని రాజేశ్వరరావు జీవితం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభకు 13 సార్లు పోటీ చేసి ఆరుసార్లు శాసనసభ్యునిగా ఎన్నికైన రాజనీతిజ్ఞుడు. సిరిసిల్లకు ఐదు సార్లు, మెట్‌పల్లికి ఒకసారీ ఆయన ప్రాతినిధ్యం వహించారు. నాలుగు సార్లు ఆయన సీపీఐ శాసన సభాపక్ష నాయకుడిగా శాసనసభలో వ్యవహరించారు. ఆయన శాసనసభలో లేచి మాట్లాడితే ప్రతిపక్షాలే కాదు, అధికార పక్షం సభ్యులు సైతం చెవి ఒగ్గి వినేవారు.



చెన్నమనేని రాజేశ్వరరావు

రాజన్న సిరిసిల్ల జిల్లా 'మానువాడ' గ్రామం మాతామహుల ఇంట్లో 1923 ఆగస్టు 31న ఆయన జన్మించారు. వీరి సొంత ఊరు 'నాగారం'. నాటి ప్రజానాయకుడు బద్దం ఎల్లారెడ్డి స్ఫూర్తితో ఆయన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. ఏకకాలంలో ఒక చేత తుపాకి, మరో చేత నాగలి పట్టిన అచ్చమైన రైతు నాయకుడు.

ఎప్పుడూ తన కార్యక్షేత్రమైన సిరిసిల్ల పట్టణం చుట్టుపక్కల గ్రామాలలో రోజుకు ఒక కార్మిక, కర్షక హక్కుల సాధన ఊరేగింపు, లేదా సన్నాహ సమావేశాలు, చర్చలు జరిపేవారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో మెట్ట ప్రాంతమైన సిరిసిల్లలో ఒంటి చేత్తో తన రాజకీయ చాతుర్యంతో 1970లో 'సహకార విద్యుత్ సరఫరా సంఘా'న్ని(సెస్) స్థాపింప చేశారు. దీంతో ఈ ప్రాంతంలోని రైతాంగం జీవితాలలో, పవర్‌లూమ్ పరిశ్రమలో వెలుగులు నిండాయి. చెన్నారెడ్డి సీఎంగా ఉన్న కాలంలో సిరిసిల్లలో పాలిటెక్నిక్ కాలేజీని అనేక రాజకీయ అడ్డంకులను అధిగమించి వచ్చేలా చేశారు. అలాగే అగ్రహారంలో డిగ్రీ కాలేజీ ఆయన చొరవతో వచ్చిందే. 1980 ప్రాంతంలో 'రాయి చెరువు' కింది ఆయకట్టులో 300 ఎకరాలను ఉమ్మడి జిల్లా అధికారుల సహకారంతో ప్రభుత్వ భూమిగా ప్రకటింపచేసి వేలాది కార్మిక కుటుంబాలకు నివాస స్థలాలు ఇప్పించారు. సిరిసిల్లలోని 'బద్దం ఎల్లారెడ్డి నగర్', 'సుందరయ్య నగర్'లు అలా ఏర్పడినవే!

తన స్వప్నం అయిన నాటి 'పోచంపాడు' (నేటి శ్రీరాంసాగర్) వరద కాలువ నిర్మాణానికి అనేకమంది ముఖ్యమంత్రులతో దఫ దఫాలుగా మంత్రాంగం జరిపి సాధించారు. నేడు కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత ప్రాముఖ్యం కలిగినదిగా ఈ వరద కాలువ పరిణమించింది. ఎందుకంటే గత ఆరు సంవత్సరాలుగా వరద కాలువ ద్వారా వచ్చే నీటితోనే 'మిడ్‌మానేరు' జలాశయం నిండి అటు మెదక్ జిల్లాకూ, ఇటు హుస్నా బాద్ ప్రాంతానికీ తాగునీరూ సాగునీరూ అందుతోంది. చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు ఎత్తిపోతల పథక రచన చేసి, వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాలంలో 'ఎల్లంపల్లి', 'శ్రీపాద' ప్రాజెక్టులను సాకారం చేయించిన సాధకులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చెన్నమనేని శాశ్వతంగా నిలిచిపోయారు.

చెన్నమనేని తన 77 ఏళ్ల వయసులో నాటి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాతో పొసగక 1999లో ఆ పార్టీకి రాజీనామా చేశారు. నాటి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ తర్వాత మలిదశ తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్‌లో చేరి తన వంతు కృషి చేశారు.

– జూకంటి జగన్నాథం, కవి – రచయిత

(నేడు చెన్నమనేని రాజేశ్వరరావు శత జయంతి)

మాది కిరాన దుక్నం గాదు!

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద సుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ట్రాఫిక్ తోని తొవ్వలు మెస్ల రాకుంటున్నయి. జెనంతోని సిన్మ తేటర్లు చీమల పుట్టలెక్కున్నయి. ఇంటికి పోబుద్ధిగాని సర్కార్ జీతగాల్లు హోటల్ల గూసోని ముచ్చట బెడుతున్నరు. గుడికాడ బిచ్చపోల్లు బిచ్చమడుక్కుంటున్నరు. ఒక్కపారే సిటీ బస్సులు సోల్పుత బోతున్నయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''గ్యాస్ బండ దరల రొండు నూర్లు తక్వ జేసింద్రు'' అని యాద్గిరి అన్నడు.

''సంటర్ జెనంకు ఇచ్చిన రాకి పండ్గ ఇనాం అంటున్నరు'' అని సత్నారి అన్నడు.

''ఇనామా? పాడా? ఐదు రాస్ట్రాలల్ల అసెంబ్లి ఎలచ్చన్లు వొస్తున్నయి. గందుకే సంటర్ గ్యాస్ బండ దరను తక్వ జేసింది. గిది గూడ ఒక తక్వ జేసుడేనా? ఫక్తు యాపారం.''

''గదెట్ల?''

''నాల్గొందలు దర ఉన్న గ్యాస్ బండ దరను పదకొండు నూర్లకు బెంచి గా దాంట్ల రొండు నూర్లు తక్వ జేసుడు తక్వ జేసుడేనా? ఏదన్న కొనెతందుకు ఏ దుక్నం కన్న బోతె నూరు రూపాయలు దర వుంటె దుక్నపోడు రొండు నూర్లు జెప్తడు. మీ కోసం తక్వ జేస్తున్న అనుకుంట ఇర్వై రూపాయలు తక్వ జేస్తడు. సంటర్ సంగతి గా తీర్గనే ఉన్నది.''

''ఎమ్మెల్యే టికిట్ రాని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంగతేంది?''

''టికిట్ రాని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలల్ల కొందరు కోపంతోని ఉన్నరు. కొందరు గుల్గుతున్నరు. గీ పారి ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డికి టికిట్ ఇయ్యలేదు. లక్ష్మారెడ్డికి టికిట్ ఇచ్చింద్రు. ఎవలకు టికిట్ ఎందుకియ్యలేదో కేసీఆర్ జెప్పిండు. గాయిన జెప్పినంక గూడ రౌడీలకు, గుండాలకు టికిట్లు ఇచ్చింద్రని సుభాష్ రెడ్డి అన్నడు. నేను ముత్యమసుంటోన్ని అని జెప్పిండు. ఎప్పటిసందో పార్టిలనే ఉన్నానని అన్నడు. నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి. గాయినకు టికిట్ ఇచ్చుడును పెండింగ్ల బెట్టింద్రు. సునీతా లక్ష్మారెడ్డికి నర్సాపూర్ టికిట్ ఇస్తరని అనుకుంటున్నరు. టికిట్ ఇచ్చినా, ఇయ్యకున్నా పోటి జేస్తనని మదన్ రెడ్డి అంటున్నడు. పార్టి కార్యకర్తలతోని మీటింగ్ బెడుతున్నడు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే టికిట్



రాజయ్యకు ఇయ్యలేదు. టికిట్ రానందుకు రాజయ్య పల్లపల్ల ఏడ్సిండు. గని మదద్ ఇచ్చె టోల్లతోని గాయిన మీటింగ్లు బెడుతున్నడు. జన్గాం టికిట్‌ను గుడ్కపెండింగ్ల బెట్టింద్రు. జన్గాం ఎమ్మెల్యే యాద్గిరి రెడ్డి టికిట్ కోసం ఒక్క తీర్గ కోషిస్ జేస్తున్నడు. మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావుకు టికిట్ ఇచ్చింద్రు. గని మెదక్ ఎమ్మెల్యే టికిట్ తన కొడ్కుకు ఇయ్యాలనుకుంట పార్టి కార్యకర్తలతోని మీటింగ్లు బెడుతున్నడు.''

''కాంగ్రెస్ ఏం జేస్తున్నది?''

''ఎమ్మెల్యే టికిట్ల కోసం దర్కాస్తులు జెయ్యమని జెప్పింది. వెయ్యి దర్కాస్తులు వొచ్చినయి. ఇల్లెందు నియోజక వర్గంకు ముప్పై ఎన్మిది దర్కాస్తులు వొచ్చి నయి. సీనియర్లు గూడ దర్కాస్తు జెయ్యాల్నా? అని కొంతమంది గుల్గింద్రు. 'బీఆర్ఎస్ నూటా పదిహేను మందికి ఎమ్మెల్యే టికిట్లు ఇచ్చింది. మీది ఎందుకింత లేటు?' అని అడిగితె 'మాది కిరాన దుక్నం గాదు, హోల్‌సేల్ దుక్నం. కమిటీలు ఉంటయి. గా కమిటీలల్ల ఒకె అయినంక, హై కమాండ్ ఒకె జేసినంకనే టికిట్లు ఇస్తరు' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నడు. తెలంగాన కాంగ్రెస్ ప్రదేస్ ఎలచ్చన్ కమిటి మీటింగ్ అయ్యింది. ఎప్పటి తీర్గనే కాంగ్రెస్ లీడర్లు తలా ఒక మాటన్నరు. బీసిలకు ఎన్ని టికిట్లు ఇస్తరో జెప్పాల్నని హన్మంతరావు అన్నడు. ఆడోల్లకు ఎన్ని టికిట్లు ఇస్తరో జెప్పాల్నని రేనుకా చౌదరి అన్నది. నాకే గాకుంట నా కొడ్కుకు గూడ ఎమ్మెల్యే టికిట్ ఇయ్యాలని బల్రాం నాయక్ అన్నడు. ఒక కుటుంబంల ఒక్కలకే టికిట్ ఇయ్యాల్నని రేవంత్ రెడ్డి అన్నడు. గీ దాని మీద గాయిన ఉత్తమ్ కుమార్ రెడ్డి నడ్మ బైస్ అయ్యింది. ఎప్పటి లెక్కనే కాంగ్రెసోల్లు ఒక్క మాట మీద నిలబడలేదు. కమిటి మీటింగ్ వాయిద బడ్డది.''

''సింహాచలంల దేవుని హుండిల ఒకడు పదివేల కోట్ల చెక్ ఏసిండు. గా చెక్‌ను బేంకుకు పంపింద్రు. గని ఖాతల పదిహేడు రూపాయలే ఉన్నయి. లీడర్లు చేసేటియి, చెప్పేటియి గిట్లే ఉంటయి.''

గిట్ల మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99591 50491

అపురూప రక్ష

శ్రావణ పూర్ణిమ అందాల బంధాల పండగ. ఆడపడుచులు శ్రావణ పౌర్ణమినాడు పుట్టింటికి వెళ్ళి, సోదరుల చేతులకు రక్షా బంధనాలు కట్టే ఆనవాయితీని ఏర్పరచిన మహనీయులు కృతజ్ఞతకు ఎంతగానో పాత్రులు. సోదరి... సోదరుడికి రక్షాబంధనం కట్టడం ద్వారా గుర్తు చేసే సందేశం ఇది: 'సోదరా! నేనిక్కడున్నా, మరో ఇంటి ఇల్లాలిగా ఉన్నా, మనకు జన్మసిద్ధంగా ఉన్న మహత్తరమైన బంధాన్ని నేను మరవలేను. నువ్వూ మరవవద్దు. ఎక్కడున్నా నేను నీ సర్వతోముఖమైన సంక్షేమాన్ని కాంక్షిస్తూనే ఉంటాను.



నాకు ఏ క్లిష్ట పరిస్థితి ఎదురైనా నీ ఆశీస్సులూ అండదండలూ ఉంటాయని ఆశిస్తూనే ఉంటాను' అని.

ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు, మెట్టినిల్లు బాధ్యతలూ, సాంఘిక సంప్రదాయాలూ, కట్టుబాట్లూ, చట్టాలూ – అన్నీ మారిపోయాయి, ఇక ఈ కాలంలో ఇలాంటి సందర్భాలు అవసరమా అని ప్రశ్న వస్తే, మునుపటికంటే ఎక్కువ అవసరం అనే జవాబు చెప్పాలి.

కుటుంబాల పరిమాణాలు కుంచించుకు పోతున్న కాలం ఇది. మాటవరస బంధుమిత్రులు తప్ప, 'నా వారు' అనదగ్గ ఆత్మీయులు తగ్గిపోతున్న తరుణం ఇది.

జన్మగతమైన రక్త సంబంధాలు పొమ్మంటే పోతాయేమో గాని, రమ్మంటే వచ్చేవి మాత్రం కావు. భగవంతుడు తను అన్ని చోట్లా ఉండలేడు కనక అమ్మను సృష్టించాడంటారు. అలాగే అందరికీ కర్ణుడికిలా సహజ కవచ కుండలాలు ఇవ్వలేక, ఎందరో భాగ్యశాలులకు అనురాగమయమైన సోదర – సోదరీ బంధాలనే సాంఘిక రక్షా కవచాలను ఏర్పరిచి, కష్ట సుఖాలను పంచుకొమ్మన్నాడు. అవి సహజ సంబంధాలు కనక ఆరోగ్యకరమైనవి, బలమైనవి. అయితే అయాచితంగా లభించినవి కనక, ప్రమత్తతకూ ఉపేక్షకూ గురయ్యే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది. 'ఊ' అంటే మనో భావాలు దెబ్బతిని, 'ఆ' అంటే అమూల్యమైన బంధాలు ఛిద్రమౌతున్న ఆధునిక కాలంలో రాఖీ పండగ లాంటి సంప్రదాయాలను ఎంత శ్రద్ధగా ఆచరించి రక్షించుకొంటే అంత మంచిది.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** పౌర్ణమి ఉ.8.04 వరకు, తదుపరి బహుళ పాడ్యమి తె.5.38 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** శతభిషం రా.8.23 వరకు, తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** రా.2.22 నుండి 3.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.55 నుండి 10.44 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.45 వరకు, **అమృతఘడియలు:** ప.1.41 నుండి 3.10 వరకు, శ్రావణ పౌర్ణమి, రాఖీ పండగ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.14.

దేశంలోనే తొలి పట్టణ వ్యవసాయ కేంద్రం

• సీడీఎంఏ భవనంపైన ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే మొట్టమొదటి పట్టణ వ్యవసాయ కేంద్రాన్ని హైదరాబాద్‌లోని మున్సిపల్ శాఖ డైరెక్టర్ పరిపాలన (సీడీఎంఏ) కార్యాలయంపైన ఏర్పాటు చేశారు. సీడీఎంఏ స్టాఫ్ కాలేజీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ అర్బన్ ఫార్మింగ్ సెంటర్‌ను లివింగ్ గ్రీన్స్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రతీక్ తివారీ ప్రారంభించారు. మట్టిని ఉపయోగించకుండా తాజా సేంద్రియ కూరగాయలు, ఔషధ మొక్కలు, సుగంధ మూలికలను పండించడానికి వినూత్న పద్ధతులను అవలంభిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. పోర్టబుల్ ఫార్మింగ్ సిస్టమ్స్ ద్వారా ఇంటి పైకప్పులపై సేంద్రియ ఉత్పత్తులను ఎలా పండించవచ్చో నగర వాసులకు తెలియజేసేందుకు ప్రయోగాత్మకంగా సీడీఎంఏలో దీనికి రూపకల్పన చేసినట్లు ప్రతీక్ తివారీ తెలిపారు. సంప్రదాయ నేలఆధారిత సాగు పద్ధతుల అవసరం లేకుండా, పరిమిత ప్రదేశాలలో నాణ్యతతో సేంద్రియ పంటలను ఉత్పత్తి చేసే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నట్లు వెల్లడించారు.

వ్యాపారానికి అద్వితీయం.. జాబితాలో ద్వితీయం..

దేశంలోని హైస్ట్రీట్‌లలో సోమాజిగూడకు రెండోస్థానం • నరెడ్కో-నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఫుడ్‌కోర్టులు, షాపింగ్‌మాల్స్, గేమింగ్ జోన్స్, రిటైల్ షాపులు, మల్టీప్లెక్స్‌లు ఇలా అన్నీ గుదిగుచ్చి ఓ వ్యాపారకూడలిగా మారే ప్రాంతాలను హైస్ట్రీట్స్‌గా పిలుస్తున్నారు. కాస్మోపాలిటన్ సిటీలకు ఈ హైస్ట్రీట్స్ ఆకర్షణ. పగలు అందమైన ఆకాశహర్మ్యాలు, రాత్రిళ్లు నియాన్‌లైట్ల వెలుగుజిలుగులతో మెరిసిపోయే ఈ హైస్ట్రీట్స్‌కు వెళ్తే ''ఎంతహాయి ఈ నగరమోయి..ఎంత అందమోయి ఈ నగరమోయి''అని పాడుకోవాల్సిందే మరి. నగరంలో ఎక్కడ్నుంచైనా ఈ హైస్ట్రీట్స్‌కు రవాణా సౌకర్యం, ఆధునిక వసతులు, పార్కింగ్, వినోద, విహార సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ఈ హైస్ట్రీట్‌లలో ప్రతి చదరపు అడుగుల ఆదాయం షాపింగ్ మాల్స్‌లో కంటే ఎక్కువగా ఉంటుంది. హైస్ట్రీట్‌లో చదరపు అడుగుల ఆదాయం ఏడాదికి సుమారు రూ.36.42 లక్షలు కాగా..షాపింగ్ మాల్స్‌లో రూ.11.31 లక్షలుగా ఉంటుంది.



ఖరీదైన ప్రాంతంగా జూబ్లీహిల్స్

నగరంలోని ఐదు ప్రాంతాలలో రిటైల్ అద్దెల పరంగా అతి ఖరీదైన ప్రాంతం మాత్రం జూబ్లీహిల్సే. ఇక్కడ చదరపు అడుగు రిటైల్ స్పేస్ నగటు అద్దె నెలకు రూ.200–225 కాగా, దాని తర్వాత బంజారాహిల్స్ (రూ.190–230), సోమాజిగూడ (రూ.150–175), అమీర్‌పేట (రూ.110–130), గచ్చిబౌలి ప్రాంతాలు రూ.140గా ఉన్నాయి.

హైస్ట్రీట్స్ జాబితాలో రెండోస్థానంగా సోమాజిగూడ...

కాస్మోపాలిటన్ సిటీల్లోని హైస్ట్రీట్‌లపై 'ఇండియా రియల్ ఎస్టేట్ విజన్-2047'పేరుతో నరెడ్కో-నైట్‌ఫ్రాంక్ ఇండియా నిర్వహించిన ఓ అధ్యయన నివేదికలో హైదరాబాద్‌లోని సోమాజిగూడ హైస్ట్రీట్ రెండో స్థానంలో నిలిచినట్లు వెల్లడించింది. ఇక ఈ నివేదికలో బెంగళూరులోని ఎంజీ రోడ్ తొలిస్థానంలో నిలిచింది. దేశంలోని టాప్ 20 హైస్ట్రీట్స్ జాబితాలో హైదరాబాద్ నుంచి సోమాజిగూడతోపాటు ఐదు ప్రాంతాలున్నాయి. ఇందులో గచ్చిబౌలి 16వ స్థానం, అమీర్‌పేట్ 17, బంజారాహిల్స్ 18, జూబ్లీహిల్స్ 19వ స్థానంలో నిలిచాయి.

ఆధునిక రిటైల్ హైస్ట్రీట్స్ లో ఎన్‌సీఆర్‌దే అగ్రస్థానం

దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 30 హైస్ట్రీట్స్ ఉండగా...ఈ హైస్ట్రీట్స్ 1.32 కోట్ల చదరపు అడుగుల రిటైల్ స్థలంలో విస్తరించి ఉన్నాయి. ఇందులో 52 లక్షల చదరపు అడుగుల స్థలంతో ఢిల్లీ, గుర్గావ్ ప్రాంతంలోని ఎన్‌సీఆర్ తొలిస్థానంలో ఉండగా..18 లక్షల చదరపు అడుగులతో హైదరాబాద్ మలిస్థానంలో నిలిచింది. ఇక అహ్మదాబాద్, బెంగళూరు ఒక్కో నగరంలో 15 లక్షల చదరపు అడుగుల స్థలం అందుబాటులో ఉంది. ఆధునిక రిటైల్ స్పేస్ పరంగా చూస్తే...ఎనిమిది ప్రధాన నగరాలలో 57 లక్షల చదరపు అడుగుల వాటా ఉండగా..14 లక్షల చదరపు అడుగులతో ఎన్‌సీఆర్ అగ్రస్థానంలో, 11 లక్షల చదరపు అడుగులతో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచాయి.

వ్యవసాయం పరిశ్రమగా వర్ధిల్లాలి

- మన రైతాంగం యంత్ర శక్తిని విరివిగా వినియోగించాలి
- ఆ మేరకు అవసరమయ్యే ప్రణాళికలతో ముందుకు సాగుతాం
- అమెరికా పర్యటనలో మంత్రి నిరంజన్‌రెడ్డి



యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయం ఒక పరిశ్రమగా వర్ధిల్లాలని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆకాంక్షించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన అయోవా రాష్ట్రంలోని లాంగ్ వ్యూ ఫార్మ్ అనే భారీ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. నూతన టెక్నాలజీ వినియోగంలో లాంగ్ వ్యూ ఫార్మ్ వ్యవసాయ క్షేత్రం ఎంతో పురోగతి సాధించింది. జీపీఎస్ ద్వారా ఒక్క సెంటీమీటర్ తేడా లేకుండా విత్తడం, భారీ యంత్రాల సాయంతో దున్నడం నుంచి పంట నూర్పిళ్ల వరకూ పనులు చేయడం, హెలికాప్టర్లు, డ్రోన్ల ద్వారా క్రిమి సంహారక మందుల స్ప్రేయింగ్, మొక్క ఎదుగుదలను ప్రతి దశలో డేటా సేకరించి మానిటర్ చేయడం వంటి వాటిని మంత్రి నేతృత్వంలోని బృందం పరిశీలించింది. లాంగ్ వ్యూ ఫార్మ్ సందర్శించిన బృందానికి సీఈఓ స్టీవ్ హెన్రీ అన్ని వివరాలతో కూడిన ప్రెజెంటేషన్ చేశారు. తమ వ్యవసాయ క్షేత్రంలో ప్రధానంగా మొక్కజొన్న (కార్న్), సోయాబీన్ పండిస్తామని తెలిపారు. మేలురకమైన విత్తనాలను కూడా ఉత్పత్తి చేస్తామని, ఆహార ధాన్యాలతో పోలిస్తే విత్తన ఉత్పత్తి వల్ల లాభాలు మూడు రెట్లు ఎక్కువగా వస్తున్నాయని వివరించారు.

ప్రపంచస్థాయికి తెలంగాణ వ్యవసాయం: తెలంగాణ వ్యవసాయాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని నిరంజన్‌రెడ్డి చెప్పారు. భవిష్యత్ తరాలు వ్యవసాయాన్ని వృత్తిగా స్వీకరించే పరిస్థితులు రావాలన్నారు. అమెరికాలో వ్యవసాయ పరిస్థితులు భారతదేశ వ్యవసాయంతో పోలిస్తే కొంత భిన్నమన్నారు. ఇక్కడ భారీ కమతాలు, మానవ వనరుల కొరత వలన పెద్ద ఎత్తున యాంత్రీకరణ అనివార్యమయిందన్నారు. తెలంగాణలో చిన్న కమతాలు ఎక్కువ కాబట్టి భారీ యంత్రాల వినియోగం వ్యక్తిగత స్థాయిలో సాధ్యపడదని అందుకే రైతులు సహకార సమాఖ్యలుగా సంఘటితమై యాంత్రీకరణ ఫలాలు అందుకోవాలని మంత్రి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రైతాంగం కూడా యంత్ర శక్తిని విరివిగా వినియోగించుకోవడానికి అవసరమయ్యే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామన్నారు. అనంతరం ఇల్లినాయిస్ రాష్ట్రం డికెటర్ నగరంలోని అతిపెద్ద ఫార్మ్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు, డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ ఉన్నారు.

ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు

ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట గురుకుల విద్యార్థినుల నిరసన



కలెక్టరేట్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

సాక్షి, ఆసిఫాబాద్: ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని గురుకుల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు బుధవారం రోడ్డెక్కారు. రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేసి, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించారు. అనంతరం సమీకృత కలెక్టరేట్ సముదాయం వద్ద ధర్నాకు దిగారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ప్రిన్సిపాల్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఉదయం అల్పాహారం తినకుండానే పాఠశాల నుంచి బయటకొచ్చారు. ఉదయం 7.30 గంటలకు అంబేడ్కర్ చౌక్ వద్ద రహదారిపై ధర్నా చేశారు. ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి తమను వేధిస్తోందని, సమయానికి భోజనం, వైద్యం అందించడం లేదని, నరకయాతన అనుభవిస్తున్నామని కన్నీళ్లు పెట్టుకున్నారు. కొందరు కాపలాదారులు మద్యం సేవించి విధులకు వచ్చి తమపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌కు చెప్పి నా పట్టించుకోకపోవడంతో రోడ్డెక్కినట్లు విద్యార్థినులు వెల్లడించారు. విద్యార్థినుల తల్లిదండ్రులు పలువురు కలెక్టరేట్ వద్దకు వచ్చి వారికి మద్దతుగా నిలిచారు. ఆరు గంటలపైగా ఎండలోనే బైఠాయించడంతో కొందరు విద్యార్థినులు సొమ్మసిల్లిపడిపోయారు. టీచర్ల విజ్ఞప్తికి స్పందించి పాఠశాలకు వెళ్లి అక్కడే చెట్ల కింద నిరసన కొనసాగించారు. చివరికి పోలీసులు సర్దిచెప్పడంతో విద్యార్థినులు భోజనాలకు వెళ్లడంతో పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

కాళేశ్వరం ప్యాకేజీ-9కి చెన్నమనేని పేరు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ రాజకీయవేత్త, దివంగత చెన్నమనేని రాజేశ్వర్‌రావు శత జయంతి(ఆగస్టు 31) సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-9కి ఆయన పేరును పెడుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్యాకేజీ-9 ద్వారా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందుతోంది. ప్యాకేజీ-9 పరిధిలో భాగంగా మిడ్ మానేరు నుంచి అప్పర్ మానేరుకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం మల్కపేట రిజర్వాయర్‌తోపాటు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. 'స్వాతంత్ర్య సమరయోధుడు, నిరంతరం ప్రజల కోసం పోరాడిన గొప్పనేత చెన్నమనేని రాజేశ్వర్‌రావు. ఆ కాలంలోనే వరదకాల్వ, ఎత్తిపోతల పథకాల కోసం పోరాడిన చరిత్ర ఆయనది. సిరిసిల్ల వేములవాడ ప్రాంతాల్లో అత్యంత ప్రజాదరణ కలిగిన నేత ఆయన. పలుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల సాగునీరు కష్టాలను తీర్చడానికి ఎత్తిపోతల పథకం కోసం ఎన్నో పోరాటాలు చేశారు. రాజేశ్వర్‌రావు ప్రజాప్రతినిధిగా పని చేసిన ప్రాంత ప్రజలకు కాళేశ్వరం ప్యాకేజీ-9 ద్వారా సాగునీరు అందుతున్నది'అని సీఎం పేర్కొన్నారు. సీఎం ఆదేశాల మేరకు ప్యాకేజీ-9కి రాజేశ్వర్‌రావు పేరు పెడుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మాట వినడం లేదని.. పనితీరు బాగోలేదని

• ముగ్గురు సీఈలకు బలవంతంగా వీఆర్ఎస్!

సాక్షి, హైదరాబాద్: పనితీరు బాగాలేదని, చెప్పిన మాట వినడం లేదని పేర్కొంటూ ముగ్గురు చీఫ్ ఇంజనీర్లతో రాష్ట్ర నీటిపారుదల శాఖ బలవంతంగా స్వచ్ఛంద పదవీ విరమణ చేయించినట్టుగా తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. సీఈలు జి.రమేశ్, ఐ.మధుసూదన్, కన్నూరి రమేశ్‌లు స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) చేసినట్టు ప్రకటిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత స్థాయి అధికారుల ఒత్తిడితో ఇద్దరు సీఈలు స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేయగా, మరో సీఈ దరఖాస్తుకు నిరాకరించారనే చర్చ జరుగుతోంది. దరఖాస్తు చేసుకున్న ఇద్దరు సీఈలను తెలంగాణ రివైజ్డ్ పెన్షన్ రూల్స్-1980లోని రూల్-43 కింద వీఆర్ఎస్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక దరఖాస్తు చేయని మరో సీఈని కూడా అదే చట్టంలోని రూల్- 44(1)బీ కింద వీ ఆర్ ఎస్‌కి పంపిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. పనితీరు బాగాలేదని, చెప్పిన మాట వినడం లేదనే ఆరోపణలపై ఈ ముగ్గురు సీఈలు, మరో ఇద్దరు సూపరింటెండింగ్ ఇంజనీర్లపై చాలా కాలం కిందే శాఖాపరమైన విచారణ ప్రారంభించారు. ముగ్గురు సీఈలతో పాటు ఒక ఎస్ఈని చాలా కాలం నుంచి అప్రధాన పోస్టుల్లో కొనసాగిస్తున్నారు. శాఖాపరమైన విచారణ ముగిసిన తర్వాత వీరిని డిస్మిస్ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ క్రమంలోనే వీ ఆర్ ఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలని, లేకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని వారిని ఉన్నతాధికారులు హెచ్చరించినట్టు తెలిసింది. ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తే పెన్షన్, ఇతర ప్రయోజనాలు రావనే ఆందోళనతో ఇద్దరు సీఈలు దరఖాస్తు చేసుకోగా, మరో సీఈ ససేమిరా అన్నట్టు సమాచారం. ఇలావుండగా ఉత్తర తెలంగాణ జిల్లాకు చెందిన ఓ మంత్రి ఆగ్రహానికి గురైన మరో సీఈని బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. కాగా, ఇద్దరు ఎస్ఈలను సైతం స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఉన్నతాధికారులు కోరగా, వారు నిరాకరించినట్టు తెలిసింది.

క్లుప్తంగా...

కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామికి అస్వస్థత



బెంగళూరు: కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి(63) బుధవారం ఆస్పత్రిలో చేరారు. నీరసం, అసౌకర్యానికి గురైన ఆయన్ను కుటుంబసభ్యులు వెంటనే బెంగళూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆయన్ను పరీక్షించిన వైద్యులు, వెంటనే చికిత్స ప్రారంభించారు. 'కుమారస్వామి ఆరోగ్యం నిలకడగా ఉంది. చికిత్సకు స్పందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు క్షుణ్నంగా పరిశీలిస్తున్నాం' అంటూ అపోలో ఆస్పత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. కుమారస్వామి మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవెగౌడ కొడుకు.

ట్రక్కును ఢీకొన్న ఎస్‌యూవీ

ఒకే కుటుంబంలోని ఏడుగురు మృతి

ససరాం(బిహార్): బిహార్‌లోని రోహతస్ జిల్లా ససరాం వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు చనిపోయారు. ససరాం పట్టణంలోని శివసాగర్ వద్ద రెండో నంబర్ జాతీయ రహదారిపై బుధవారం వేకువజామున 4 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. కైమూర్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం ఎస్‌యూవీలో జార్ఖండ్‌లోని రాజ్‌రప్ప ఆలయానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో ఆ వాహనం నిలిపి ఉన్న ట్రక్కును వేగంగా ఢీకొంది. ఘటనలో రాజ్‌మాతాదేవి(55)తోపాటు ఆమె కూతురు, అల్లుడు, మనవడు(8), మనవరాలు(9)తోపాటు ఒక బాలిక (15), మహిళ(22) చనిపోయారు.

విష వాయువు పీల్చి.. అయిదుగురు కార్మికులు మృతి

మొరెనా: ఫ్యాక్టరీలోని ట్యాంక్ నుంచి వెలువడిన విష వాయువు పీల్చిన ముగ్గురు సోదరులు సహా మొత్తం అయిదుగురు ప్రాణాలు కోల్పోయారు. మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలో బుధవారం ఈ విషాదం చోటుచేసుకుంది. ధనేలలో ఉన్న సాక్షి ఫుడ్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీలోని ట్యాంకు నుంచి ఉదయం 11 గంటల సమయంలో విష వాయువు లీకేజీ మొదలయింది. ట్యాంకు లీకేజీని పరిశీలిస్తుండగా మొదట ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. ఆ తర్వాత మరో ముగ్గురు అస్వస్థత పాలయ్యారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆ అయిదుగురూ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మృతులంతా అక్కడికి సమీపంలోని టిక్టోలి గ్రామస్తులని చెప్పారు. ఘటన అనంతరం ఫ్యాక్టరీ నుంచి కార్మికులందరినీ ఇళ్లకు పంపించివేశారు.

అంత ఈజీ కాదు..!

- 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే వర్సెస్ ఇండియా
- 2014, 2019లో విపక్షాల అనైక్యతతో లాభపడిన ఎన్డీయే
- ఈసారి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా చేతులు కలిపిన విపక్షాలు
- కాంగ్రెస్ సొంతంగా ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఎన్డీయేకు కష్టాలే





ఎస్.రాజమహేంద్రారెడ్డి

వచ్చే ఏడాది నుంచి దేశాన్ని ఓ ఐదేళ్లపాటు ఎవరు పరిపాలించబోతున్నారు? ఇప్పటికిప్పుడైతే 'ఎన్డీయేనే.. ఇంకెవరు?' అనే సమాధానమే వస్తుంది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే లేదా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ వరుసగా మూడోదఫా అధికార పీఠాన్ని దక్కించుకోవడం ఖాయమనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. ప్రతిపక్షాలన్నీ ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో జరిగిన 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ఆడుతూ పాడుతూ అందలం ఎక్కింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇదే పునరావృతం అవుతుందా? అంటే అంత నమ్మకంగా చెప్పడానికి లేదు. బీజేపీని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలన్నీ కాంగ్రెస్ సారథ్యంలో 'ఇండియా' కూటమిగా జతకట్టడంతో రసవత్తరమైన పోరుకు తెరలేచింది. గట్టి పోటీనిచ్చి ఎన్డీయేకు, ముఖ్యంగా బీజేపీకి చుక్కలు చూపించాలని 'ఇండియా' కూటమిలోని పార్టీలన్నీ ఉవ్విళ్లూరుతున్నాయి. మొత్తం మీద ఎన్డీయేకు ఈసారి సునాయాసంగా నెగ్గడం సులభం కాకపోవచ్చు!

2014 నుంచి మోదీ యుగం ఆరంభం

ఇండియా కూటమిలోని పార్టీలన్నీ ముంబైలో గురువారం నుంచి సమావేశమై తమ కార్యాచరణ ఖరారు చేసుకోనున్నాయి. రెండు రోజులపాటు జరిగే ఈ కీలక సమావేశంలో ప్రధానమంత్రి అభ్యర్థి ఎవరనేది చూచాయగా తెలిసే అవకాశం ఉంది. భేషజాలకు పోకుండా కలిసికట్టుగా పోరాడితే తమ అవకాశాలు ఎలా ఉంటాయో కూడా కూటమిలోని పార్టీలన్నీ బేరీజు వేసుకోనున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో(2014, 2019) కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు వచ్చిన మొత్తం ఓట్ల శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఎన్డీయే కూటమికి వచ్చిన ఓట్ల శాతానికి కొంచెం దగ్గర్లోనే ఉన్నట్టు కనిపిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే(38 పార్టీల కూటమి)కి 45 శాతం ఓట్లు వస్తే, ఇండియా కూటమి(26 పార్టీలు)కి 38 శాతం ఓట్లు లభించాయి. రెండు కూటముల మధ్య వ్యత్యాసం 7 శాతంగా కనిపిస్తోంది. రెండు కూటముల్లోని పార్టీలకు గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ నిర్ధారణకు రావొచ్చు. ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడి వచ్చే ఎన్నికల్లో పోటీ పడతాయి కాబట్టి ఓట్ల శాతంలో గణనీయమైన పెరుగుదల ఉంటుందనేది పరిశీలకుల అంచనా. ఎన్డీయే 2019 ఎన్నికల్లో 45 శాతం ఓట్లతో 341 సీట్లు గెల్చుకుంది. అంతకుముందు 2014లో ఎన్డీయే 39 శాతం ఓట్లతో 353 సీట్లు సాధించింది. 2014లో ఓట్ల శాతం తక్కువైనా ఎక్కువ సీట్లు గెల్చుకోవడం గమనార్హం. 1984 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఒక కూటమి ఇన్ని సీట్లు సాధించడం కూడా ఇదే మొదటిసారి. సరిగ్గా ఇక్కడే మోదీ యుగం ఆరంభమైంది. మోదీ యుగం ఆరంభం కాకముందు 2009లో ఎన్డీయే 27 శాతం ఓట్లతో కేవలం 148 సీట్లు గెల్చుకోగలిగింది. ప్రస్తుతం ఇండియా కూటమిగా ఏర్పడ్డ పార్టీలకు 2009 ఎన్నికలు ఒక రకంగా స్వర్ణయుగమని చెప్పొచ్చు. ఈ పార్టీలకు 2009లో 40 శాతం ఓట్లు రాగా, 347 సీట్లు దక్కాయి. అయితే, 2014 ఎన్నికల్లో ఈ కూటమి పార్టీల ఓట్ల శాతం 42 శాతానికి పెరిగినా 161 సీట్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 2019 ఎన్నికలు వచ్చేసరికి ఇండియా కూటమి ఓట్ల శాతం(38 శాతం), సీట్ల సంఖ్య(158) గణనీయంగా పడిపోయాయి.

గత ఎన్నికల్లో రెండు కూటముల మధ్య ఓట్ల వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకుంటే పోటాపోటీగానే కనిపిస్తున్నప్పటికీ, గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో(2014, 2019) బీజేపీ ఆధిక్యం ప్రస్ఫుటంగా వెల్లడవుతుంది. ఎన్డీయేలోని మిగతా భాగస్వామ్య పక్షాలపై బీజేపీ లేదా నరేంద్ర మోదీ ఆధిపత్యాన్ని రుజువు చేస్తుంది. గత ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 37 శాతం ఓట్లు సాధించింది. ఇదే ఎన్నికల్లో ఇండియా కూటమి సాధించిన ఓట్ల శాతాన్ని బీజేపీ ఒక్కటే సాధించడం విశేషం.

కాంగ్రెస్ నష్టం బీజేపీకి లాభం

రెండు కూటముల్లో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల రాజకీయ ప్రయాణాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టమవుతుంది. రానురాను కాంగ్రెస్ పరిస్థితి దిగజారుతుండగా, బీజేపీ ఆ మేరకు పుంజుకుంటోంది. ముక్కుసూటిగా చెప్పాలంటే కాంగ్రెస్ నష్టం బీజేపీకి లాభంగా మారుతోంది. గణాంకాలు పరిశీలిస్తే 1991 లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ సొంతంగా ఏనాడూ 30 శాతం ఓట్ల మార్కును అందుకోలేకపోయింది. బీజేపీకి 1991 ఎన్నికల్లో 20 శాతం ఓట్లు రావడం గమనార్హం. 1991, 2019 ఎన్నికల ఫలితాలను చూస్తే బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓ సారూప్యత ఉంది. 1991లో కాంగ్రెస్‌కు 36 శాతం ఓట్లు, బీజేపీకి 20 శాతం ఓట్లు వచ్చాయి. 2019లో ఇది తిరగబడింది. 2019లో కాంగ్రెస్‌కు 20 శాతం, బీజేపీకి 37 శాతం ఓట్లు వచ్చాయి. ఇక్కడ ఆసక్తికరమైన అంశం ఏమిటంటే కాంగ్రెస్ కోల్పోయిన ఓట్లు బీజేపీ ఖాతాలో చేరడం. 2014 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌లు 189 స్థానాల్లో ముఖాముఖి పోటీపడ్డాయి. ఇందులో బీజేపీ ఏకంగా 166 సీట్లు గెల్చుకుంది. అంటే నేరుగా కాంగ్రెస్‌తో తలపడ్డ స్థానాల్లో బీజేపీ 88 శాతం సీట్లు గెల్చుకుందన్నమాట. అయితే, కాంగ్రెసేతర పార్టీలతో నేరుగా తలపడ్డ స్థానాల్లో బీజేపీ 47 శాతం సీట్లు మాత్రమే గెల్చుకోగలిగింది. ఐదేళ్ల తర్వాత 2019లో బీజేపీ కాంగ్రెస్‌పైనా, కాంగ్రెసేతర పార్టీలపైనా తన గెలుపు శాతాన్ని పెంచుకుంది. బీజేపీతో నేరుగా తలపడిన ప్రతిసారీ కాంగ్రెస్ చతికిలపడుతోందని ఈ గణాంకాలు చెబుతున్నాయి. ఇండియా కూటమిలోని ఇతర పార్టీల మాదిరి కాంగ్రెస్ ఉనికి దేశవ్యాప్తంగా ఉంది. అయినప్పటికీ గత ఎన్నికల్లో కాంగ్రెస్ 20 శాతం ఓట్లతో 52 సీట్లు మాత్రమే గెల్చుకుంది. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిని విజయపథాన నడిపించాలంటే కాంగ్రెస్ సొంతంగా తన ఓట్ల శాతాన్ని భారీగా పెంచుకోవాలి. అదే గనుక జరిగితే బీజేపీతో నేరుగా తలపడి దాదాపు 200 స్థానాల్లో తన ప్రభావాన్ని చూపించగలుగుతుంది. ఇది బీజేపీకి తీవ్ర నష్టం కలిగించవచ్చు.

కొసమెరుపు

ప్రస్తుతం ఎన్డీయే పరిస్థితి బ్రహ్మాండంగా ఎదురులేని విధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ఏమాత్రం పుంజుకున్నా, కూటమిలోని ప్రాంతీయ పార్టీలు తమ తమ రాష్ట్రాల్లో పట్టు బిగించినా స్వల్ప ఓట్ల శాతం తేడా కూడా బీజేపీని నిలువరించే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ఆకర్షణ శక్తి ఎన్డీయేకు బలమైతే, ఐకమత్యంతో పోరాడడమే ఇండియా కూటమికి లాభిస్తుంది. గెలుపోటములు దైవాధీనం కాదు.. ఓటరాధీనం!

నేటి నుంచే... 'ఇండియా' మూడో భేటీ

ముంబైలో రెండు రోజులు కీలక సమావేశం

- సమన్వయ కమిటీ, లోగో వెల్లడి!
- కనీస ఉమ్మడి కార్యక్రమం రూపకల్పనకు కమిటీలు
- కూటమిలోకి మరిన్ని పార్టీలు!
- సమన్వయకర్త, చైర్‌పర్సన్ ఎంపికపైనా చర్చ



ముంబై: జాతీయ స్థాయిలో అధికార బీజేపీకి ప్రత్యామ్నాయంగా పురుడు పోసుకున్న విపక్ష 'ఇండియా' కూటమి రెండు రోజుల కీలక సమావేశం మహారాష్ట్ర రాజధాని ముంబైలో గురువారం ప్రారంభం కానుంది. గ్రాండ్ హయత్ హోటల్‌లో జరిగే ఈ సమావేశానికి కాంగ్రెస్‌తో పాటు 27 పార్టీలకు పైగా హాజరు కానున్నట్టు చెబుతున్నారు. కూటమి లోగోను, సమన్వయ కమిటీని ప్రకటించనున్నారు. కూటమి పక్షాలు అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడంతోపాటు రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమిని ఓడించడమే లక్ష్యంగా ఉమ్మడి ప్రచార వ్యూహానికి తుది రూపు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అలాగే కనీస ఉమ్మడి కార్యక్రమం ముసాయిదా తయారీకి కొన్ని కమిటీలను ప్రకటించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన ఉమ్మడి కార్యక్రమాలు, సీట్ల పంపకం కోసం కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించనున్నారు. భాగస్వామ్యపక్షాల మధ్య సమన్వయం కోసం దేశ రాజధాని ఢిల్లీలో ఒక సెక్రటేరియట్‌ను ఏర్పాటు చేసుకోనున్నారు. దీనిపై ముంబై భేటీలో ప్రకటన చేసే అవకాశం ఉంది. కూటమి సమన్వయకర్త, లేదా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవడం గురించి కూడా చర్చ జరగనుంది. తిరోగమన విధానాలు అమలు చేస్తున్న అధికార ఎన్డీయేకు ప్రగతిశీల ప్రత్యామ్నాయాన్ని తెరపైకి తీసుకొస్తూ స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ముంబై భేటీలో ఖరారు చేయనున్నట్లు ఆర్జేడీ నేత మనోజ్ ఝా చెప్పారు.

'బీజేపీ వెళ్లిపో' నినాదం

ఇండియా కూటమిలో ప్రస్తుతం 26 పార్టీలు భాగస్వామిగా ఉన్నాయి. ముంబై భేటీ సందర్భంగా మరిన్ని ప్రాంతీయ పార్టీలు వచ్చి చేరనున్నట్లు కూటమి నాయకులు చెబుతున్నారు. ఇండియా తొలి రెండు సమావేశాలు పట్నా, బెంగళూరుల్లో జరిగిన విషయం తెలిసిందే. ముంబైలో గురువారం నుంచి జరుగనున్న మూడో భేటీకి హాజరయ్యేందుకు ఇప్పటికే వివిధ పార్టీల నాయకులు నగరానికి చేరుకున్నారు. ఈ భేటీ వేదిక నుంచి 'బీజేపీ చలే జావ్' (బీజేపీ వెళ్లిపో) అనే నినాదం ఇవ్వబోతున్నట్లు మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే చెప్పారు. ప్రధానమంత్రికి పదవికి అర్హులైన నాయకులు తమ కూటమిలో చాలామంది ఉన్నారని తెలిపారు. వారిలో శక్తి సామర్థ్యాలకు కొదవ లేదని అన్నారు. ఇండియా పక్షాల నడుమ 'కెమిస్ట్రీ' మెరుగుపడుతోందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మిలింద్ దేవ్‌రా వ్యాఖ్యానించారు. తమ కూటమిలో సీట్ల పంపకం రాష్ట్రాల స్థాయిలోనే జరుగుతుందని వివరించారు.

కన్వీనర్‌గా నితీశ్!

ఇండియా కూటమికి ఎవరు సారథ్యం వహిస్తారన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇండియా కన్వీనర్‌గా బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) నాయకుడు నితీశ్ కుమార్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కూటమి ఏర్పాటు వెనుక తనకు వ్యక్తిగత అజెండా గానీ, ఆకాంక్షలు గానీ లేవని, కన్వీనర్ పోస్టుపై తనకు ఆసక్తి లేదని ఆయన ప్రకటించినప్పటికీ ఊహాగానాలు ఆగడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీని ఢీకొట్టే నేత నితీశ్‌కుమార్ మాత్రమేనని అని చాలామంది అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ పేరును మరికొందరు ప్రతిపాదిస్తున్నారు. ఆ పదవి పట్ల ఆమె విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. కన్వీనర్‌గా ఎవరుండాలో గురువారమే ఒక నిర్ణయానికి వచ్చే అవకాశముందని ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ తెలిపారు.

ఏ కూటమిలోనూ మేం చేరం

లక్నో: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)తో పొత్తు పెట్టుకోవాలని అన్ని పార్టీలు కోరుకుంటున్నాయని ఆ పార్టీ అధినేత్రి మాయావతి చెప్పారు. అయితే, అధికార బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ లేదా ప్రతిపక్ష పార్టీల ఇండియా కూటమిలో గానీ బీఎస్పీ చేరే ప్రశ్నే లేదని ఆమె స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతుందన్నారు. ఇండియా కూటమి నేతలు ముంబైలో సమావేశమవుతున్న వేళ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మాయావతి బుధవారం ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. అధికార ఎన్‌డీఏ, ప్రతిపక్ష ఇండియా కూటముల్లోని చాలా వరకు పార్టీలు పేదల వ్యతిరేక, కుల, మత పక్షపాత, ధనవంతులకు అనుకూల, పెట్టుబడిదారీ విధానాలను అనుసరించేవేనని ఆమె విమర్శించారు.

'ఇండియా' ప్రధానమంత్రి అభ్యర్థిగా కేజ్రీవాల్: ఆప్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమి తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎంపిక చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ఆధ్వర్యంలోని అమలు చేస్తున్న అభివృద్ధి మోడల్ మొత్తం దేశానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఆప్ ముఖ్య జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ బుధవారం మీడియాతో మాట్లాడారు. విపక్ష కూటమి నుంచి ప్రధాని అభ్యర్థిగా కేజ్రీవాల్‌ను ఎంపిక చేయాలని అన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేజ్రీవాల్ తరచుగా లేవనెత్తుతున్నారని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయన సీఎంగా ఉన్న ఢిల్లీలో అతి తక్కువ ద్రవ్యోల్బణం నమోదైందని గుర్తుచేశారు. ఢిల్లీలో కేజ్రీవాల్ నిర్దేశించిన అభివృద్ధి మోడల్‌తో ప్రజలు ఎంతగానో లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి అభ్యర్థి ఎంపికపై ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి, ఆప్ ఢిల్లీ కన్వీనర్ గోపాల్ రాయ్ స్పందించారు. కేజ్రీవాల్ ప్రధాని కావాలని తమ పార్టీలోని ప్రతి సభ్యుడూ కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అయితే, ఈ అంశంపై ఇండియా కూటమి నేతలదే తుది నిర్ణయమని పేర్కొన్నారు. కూటమి నిర్ణయాన్ని తాము శిరసావహిస్తామని వెల్లడించారు. ఇండియా కూటమిలో కేజ్రీవాల్ కూడా సభ్యుడేనని, ప్రధానమంత్రి కావడానికి ఆయనకు అర్హతలు ఉన్నాయని చెప్పారు.



రక్షాబంధన్‌ను పురస్కరించుకుని బుధవారం తన నివాసానికి వచ్చిన పాఠశాల చిన్నారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. ప్రధానికి చిన్నారులు రాఖీలు కట్టారు. పాటలు పాడారు. చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 వంటి వాటిపై ప్రధానితో మాట్లాడేందుకు వారు ఆసక్తి కనబరిచారు.

వచ్చే ఎన్నికల్లో 'ఇండియా' బీజేపీని ఓడిస్తుంది: అఖిలేశ్

లక్నో: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల కూటమి 'ఇండియా' అధికార బీజేపీని ఓడిస్తుందని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్ చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు తమ పార్టీతోపాటు మిత్ర పక్షాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 'దేశం మార్పును కోరుకుంటోంది. 2024లో బీజేపీని ఇండియా ఓడించనుంది. సమాజ్‌వాదీ పార్టీ, మిత్రపక్షాలు ఎన్నికలు ముందొచ్చినా, తర్వాత వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయి' అని మీడియాతో అన్నారు.

ఎంపీ అధిర్ సస్పెన్షన్ రద్దు

లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్

న్యూఢిల్లీ: లోక్‌సభ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్ రద్దయింది. ఆయన సస్పెన్షన్‌ను రద్దు చేయాలని సూచిస్తూ లోక్‌సభ సభా హక్కుల సంఘం బుధవారం ఏకగ్రీవంగా చేసిన తీర్మానం అందిన వెంటనే లోక్‌సభ సెక్రటేరియట్ ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 8వ తేదీ నుంచి సభా హక్కుల సంఘం నివేదిక పంపిన ఆగస్టు 30వ తేదీ వరకు అధిర్ సస్పెన్షన్ వర్తిస్తుందని వివరించింది. బీజేపీ ఎంపీ సునీల్‌కుమార్ సింగ్ నేతృత్వంలోని సభా హక్కుల సంఘం ఎదుట బుధవారం అధిర్ రంజన్ చౌదరి హాజరయ్యారు. లోక్‌సభలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తంచేశారు. ఇతరుల మనోభావాలను గాయపర్చాలన్న ఉద్దేశం తనకు ఎంతమాత్రం లేదని చెప్పారు. ఆయన వివరణ పట్ల సభా హక్కుల సంఘం సంతృప్తి చెందింది. అధిర్ సస్పెన్షన్ రద్దు కోరుతూ తమ తీర్మానాన్ని స్పీకర్‌కు పంపించింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రధాని మోదీపై చేసిన వ్యాఖ్యలకు అధిర్ సస్పెండైన విషయం తెలిసిందే.

బైడెన్‌కు మతి తప్పింది: ట్రంప్

అమెరికాను మూడో ప్రపంచ యుద్ధంలోకి లాగుతున్నారని విమర్శలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌కు మతి భ్రమించిందని మాజీ అధ్యక్షుడు ట్రంప్ ఆరోపించారు. బైడెన్ తన అసమర్థ విధానాలతో దేశాన్ని మూడో ప్రపంచ యుద్ధంలోకి లాగుతున్నారని మండిపడ్డారు. బైడెన్‌ను ఆయన మందమతి, పిచ్చివాడు, అసమర్థుడంటూ తిట్టిపోశారు. సరిహద్దుల విషయంలో బైడెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. న్యాయశాఖ (డీవోజే), ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(ఎఫ్‌బీఐ)తోపాటు ఆయుధాలను సమకూర్చుకునే విషయంలోనూ బైడెన్ చర్యలు దేశ భవిష్యత్తుకు ప్రమాదకరంగా మారాయి. మూడో ప్రపంచయుద్ధం వస్తే అందుకు ఆయన తప్ప మారే కారణమూ ఉండదు' అని పేర్కొన్నారు. ఈమేరకు ట్రంప్ ఒక వీడియో విడుదల చేశారు.

కర్ణాటక మోడల్...ఇక దేశమంతటా!

మైసూరు సభలో రాహుల్



మైసూరు: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల వేళ కర్ణాటక ప్రజలకిచ్చిన కీలక ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఇప్పుడిక దేశమంతటా కర్ణాటక మోడల్‌నే అమలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని 1.1 కోట్ల మహిళలకు నెలకు రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం అందించే ఎన్నికల వాగ్దానమైన గృహ లక్ష్మి పథకం అమలుకు సిద్ధరామయ్య సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేతుల మీదుగా బుధవారం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా మైసూరులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. తామెప్పుడూ తప్పుడు వాగ్దానాలు చేయబోమని చెప్పారు. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వం చేసిన, చేస్తున్న మంచి పనులను దేశమంతటా విస్తరించి చూపిస్తామన్నారు. ప్రభుత్వాలు పేదల కోసమే పాటుపడాలన్నది కాంగ్రెస్ విధానమని చెప్పారు. 'వేర్లు గట్టిగా ఉంటేనే చెట్టు దృఢంగా ఉంటుంది. కన్నడ మహిళలు వేర్ల వంటివారు. ఢిల్లీలో ఉన్న బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం మహిళలను నిర్లక్ష్యం చేస్తూ అపర కుబేరులను మాత్రమే నెత్తిన పెట్టుకుంటోంది' అని అన్నారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సభలో పాల్గొన్నారు. గత మే లో హోరాహోరీగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీని ఓడించి కాంగ్రెస్ అధికారంలోకి రావడం తెలిసిందే. అందుకు దోహద పడ్డ ఐదు ప్రధాన వాగ్దానాల్లో గృహ లక్ష్మి పథకం ఒకటి.

చైనా మ్యాప్ తీవ్రమైన అంశం

న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్‌ను తమ అంతర్భాగంగా చూపుతూ చైనా తయారుచేసిన మ్యాప్ చాలా తీవ్రమైన అంశమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ తక్షణం స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. 'నేను ఇప్పుడే లద్దాఖ్ నుంచి తిరిగి వచ్చాను. అక్కడ అంగుళం నేల కూడా అన్యాక్రాంతం కాలేదన్న మోదీ మాటలు పచ్చి అబద్ధాలు. చైనా మన భూమిని ఆక్రమించిందని లద్దాఖ్‌లో ప్రతి ఒక్కరికీ తెలుసు' అన్నారు.

సూర్యుడి గుట్టు విప్పే ఆదిత్య-ఎల్1

2న 11.50 గంటలకు పీఎస్ఎల్‌వీ సీ57 ద్వారా ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సౌరగోళంలో సౌరగాలులు, జ్వాలలు, రేణువుల తీరుతెన్నులపై పరిశోధనలే లక్ష్యంగా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహ ప్రయోగాన్ని సెప్టెంబర్ 2న ప్రయోగించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు. పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఉదయం 11.50 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. షార్ కేంద్రంలోని రెండో ప్రయోగవేదికకు చెందిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేసి ప్రయోగవేదికపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఆదిత్య-ఎల్1 ప్రయోగం ద్వారా సూర్యునిపై దాగి వున్న రహస్యాలను శోధించనున్నారు. సౌర తుపాన్ సమయంలో వెలువడే రేణువుల వల్ల భూమిపై సమాచార వ్యవస్థకు అవరోధాలు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తల అంచనా.

సౌర వాతావరణం ఎందుకు వేడిగా ఉంటుంది?

- ఆదిత్య-ఎల్1లోని ఏడు పేలోడ్లలో 170 కేజీల బరువుండే విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ (వెల్సి) అనే పేలోడ్‌తో సౌర వాతావరణం ఎందుకు వేడిగా ఉంటుంది? సూర్యుడిలో మార్పులు, అంతరిక్ష వాతావరణం, భూ వాతావరణాన్ని ఎలా ప్రభావితం చేస్తుందనే విషయాలపై ఇది పరిశోధనలు చేస్తుంది.
- సౌర అతినీలలోహిత ఇమేజింగ్ టెలిస్కోప్ (సూట్) అనే పేలోడ్ 35 కేజీల బరువు వుంటుంది. 200-400 ఎన్ఎం తరంగదైర్ఘ్యం పరిధి మధ్య సూర్యుడిని గమనిస్తుంది. ఇందులో 11 ఫిల్టర్లను ఉపయోగించడం ద్వారా సౌర వాతావరణంలో వివిధ పొరల పూర్తి డిస్క్ చిత్రాలను అందిస్తుంది.
- ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పెరిమెంట్ (యాస్‌పెక్స్) అనే పేలోడ్ సౌర గాలి వైవిధ్యం, లక్షణాలపై సమాచారాన్ని గ్రహించడంతోపాటు దాని వర్ణ పటం లక్షణాలను అధ్యయనం చేస్తుంది.
- ఆదిత్య ప్లాస్మా ఎనలైజర్ ప్యాకేజీ (పాపా) సౌరగాలి కూర్పు, దాని శక్తి పంపిణీని అర్థం చేసుకోవడానికి పరిశోధనలు చేస్తుంది.
- సోలార్ ఎనర్జీ ఎక్స్-రే స్పెక్ట్రోమీటరు (సోలెక్స్) సోలార్ కరోనా సమస్యాత్మకమైన కరోనల్ హీటింగ్ మెకానిజంను అధ్యయనం చేయడానికి, ఎక్స్-రే మంటలను పర్యవేక్షించడానికి పరిశోధనలు చేస్తుంది.
- హై ఎనర్జీ ఎల్1 ఆర్బిటింగ్ ఎక్స్-రే స్పెక్ట్రోమీటర్ (హెలియోస్) సౌర కరోనాలో డైనమిక్ ఈవెంట్‌లను గమనించడానికి, విస్ఫోటనం సంఘటనల సమయంలో సౌరశక్తి కణాలను వేగవంతం చేయడానికి ఉపయోగించే శక్తిని అంచనా వేస్తుంది.
- మ్యాగ్ అనే ఈ పేలోడ్‌ను ఉపగ్రహానికి ఆన్‌బోర్డు ఉపకరణంగా అమర్చి పంపుతున్నారు. ఉపగ్రహానికి సంబంధించి సమాచారాన్ని అందించనుంది.

ఆదిత్య-ఎల్1లో పేలోడ్స్ ఇవే..

సుమారుగా 1,475 కేజీలు బరువున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహంలో ఏడు పేలోడ్స్ బరువు 244 కేజీలు. మిగతా 1,231 కేజీలు ద్రవ ఇంధనంతో నింపుతారు. ఉపగ్రహాన్ని భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తరువాత ఈ ఉపగ్రహాన్ని భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని లాంగ్రేజియన్ బిందువు-1 (ఎల్-1)లోకి చేరవేయడానికి 177 రోజులు పడుతుంది. ఆదిత్య ఎల్-1 ఉపగ్రహంలో సూర్యుడిపై అధ్యయనం చేయడానికి యాస్‌పెక్స్, సూట్, వెల్సి, హెలియోస్, పాపా, సోలెక్స్, మాగ్ అనే ఏడు ఉపకరణాలు (పేలోడ్స్) ఉంటాయి.

ప్రజాసేవలో నిమగ్నమవుదాం

సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక కార్యక్రమాలు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 'సేవా పఖ్వారా' పేరుతో దేశవ్యాప్తంగా 15 రోజుల పాటు ప్రజాసేవా కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ కేంద్ర నాయకత్వం నిర్ణయించింది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ దాకా ప్రజాసేవా కార్యాక్రమాలు చేపట్టాలని అన్ని రాష్ట్రాల పార్టీల శాఖలను ఆదేశించింది. ఈ మేరకు బుధవారం పార్టీ ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన భేటీలో అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్ణయం తీసుకున్నారని బీజేపీ వర్గాలు వెల్లడించాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా పార్టీ ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, నేతలు రక్తదాన శిబిరాలు, స్వచ్ఛతా డ్రైవ్‌లు నిర్వహించాలని జేపీ నడ్డా బీజేపీ శ్రేణులను ఆదేశించారు. ఆయుష్మాన్ కార్డులు లేని వారికి వాటిని అందించడంలో సహకరించాలని చెప్పారు. ముఖ్యంగా ఈ ఏడాది ఎన్నికలు జరుగున్న తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల్లో మోదీ జన్మదిన వేడుకలకు నిర్వహించాలని చెప్పారు. ప్రధానిగా తొమ్మిదేళ్ల వ్యవధిలో సాధించిన విజయాలు, ప్రజాహిత కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు

వచ్చే 13 వరకు జైల్లోనే ఇమ్రాన్



ఇస్లామాబాద్: అధికార రహస్య పత్రాల లీకేజీ కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు సెప్టెంబర్ 13వ తేదీ వరకు ప్రత్యేక కోర్టు రిమాండ్ విధించింది. తోషఖానా కేసులో ఇమ్రాన్‌కు దిగువ కోర్టు విధించిన మూడేళ్ల జైలుశిక్షను కొట్టివేస్తూ మంగళవారం ఇస్లామాబాద్ హైకోర్టు తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. అయితే, రహస్య పత్రాల లీకేజీ కేసు విచారణలో ఉన్నందున ఆయనకు ఒక రోజు రిమాండ్ విధిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి ఆదేశాలిచ్చారు. భద్రతా కారణాల రీత్యా ఇమ్రాన్ విచారణను పంజాబ్ ప్రావిన్స్‌లోని అటోక్ జైలులోనే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జడ్జి అబువల్ హస్నత్ జుల్‌కర్‌నయిన్ బుధవారం జైలుకు చేరుకున్నారు. జైలు లోపలే కేసును విచారించి, ఇమ్రాన్ రిమాండ్‌ను వచ్చే 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారని జియో న్యూస్ తెలిపింది. దీంతో, ఆగస్టు 5 నుంచి ఉంటున్న అటోక్ జైలు నుంచి వెంటనే విడుదల కావాలన్న ఇమ్రాన్ ప్రయత్నాలపై నీళ్లు చల్లినట్లయిందని జియో న్యూస్ పేర్కొంది. విచారణ సమయంలో ఇమ్రాన్ తరఫు లాయర్ల బృందంలోని ముగ్గురికి మాత్రమే లోపలికి వెళ్లేందుకు అవకాశం కల్పించారని తెలిపింది. గత ఏడాది మార్చిలో పార్లమెంట్‌లో ఆయన ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కొద్ది రోజులు ముందు జరిగిన ర్యాలీలో ఇమ్రాన్ ఖాన్.. తనను గద్దె దించేందుకు విదేశీ శక్తి కుట్ర పన్నిందనేందుకు ఇదే సాక్ష్యమంటూ ఓ డాక్యుమెంట్‌ను తీసి బహిరంగంగా చూపించారు. అమెరికా విదేశాంగశాఖ అధికారులు అక్కడి పాక్ రాయబారితో భేటీ అయ్యారని, దానికి సంబంధించిన వివరాలున్న డాక్యుమెంట్లను చట్ట విరుద్ధంగా పొందిన ఇమ్రాన్ వాటిని బహిరంగ పరిచారని పాక్ అధికారులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఆయనపై అధికార రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేశారు.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 31 । ఆగస్టు । 2023



వార్డు కార్యాలయాలతో వసతులు

జీహెచ్‌ఎంసీలోని అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వార్డు కార్యాలయాలు దోహదపడతాయని మంత్రి తలసాని అన్నారు. -8లో



..అంతలోనే మృత్యు ఒడికి

అప్పటి దాకా పెళ్లి వేడుకలో ఆడీపాడిన ఓ చిన్నారి అంతలోనే మృత్యు ఒడికి చేరాడు. ఈ విషాద ఘటన బుధవారం రాత్రి శంషాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. -8లో

నేడు జర్నలిజం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: హైదరాబాద్, వరంగల్ కేంద్రాలలో గురువారం ఎంఏ జర్నలిజం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సీపీజీఈటీ-2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 12.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే కంప్యూటర్ (సీబీటీ) పరీక్షకు 11 గంటలకు హాల్‌లోకి ప్రవేశానికి అనుమతించనున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

4 నియోజక వర్గాలు.. 2 వేల డబుల్ బెడ్రూం ఇళ్లు

- లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయింపు

సాక్షి, సిటీబ్యూరో: నాలుగు నియోజకవర్గాలు.. రెండు వేల డబుల్ బెడ్రూం ఇళ్లు.. లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయించే ప్రక్రియ ప్రారంభమైంది. డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 93,899 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 12,479 మంది అర్హులుగా గుర్తించారు. మొదటి విడతలో ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం నియోజకవర్గాల్లో రెండు వేలమంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరీష్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సహా ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్‌రెడ్డిలు హాజరయ్యారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గ పరిధిలో 500 మంది చొప్పున రెండు వేల మందిని ఎంపిక చేశారు. ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొ.నాగేశ్వర్ ఉద్యోగ విరమణ నేడు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ జర్నలిజం విభాగం అధ్యాపకులు ప్రొ.నాగేశ్వర్ గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం 'జర్నలిజం నాడు, నేడు, రేపు' అంశంపై జరిగిన సదస్సుకు ప్రొ.స్టీవెన్‌సన్ అధ్యక్షత వహించారు. సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి, డాక్టర్ మాడభూషి శ్రీధర్, టీ శాట్ సీఈఓ శైలేష్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. సాంకేతికంగా ఎంత అభివృద్ధి సాధించినా ప్రింట్, ఎలక్ట్రానిక్స్, సోషల్ మీడియా జర్నలిజంలో నైతిక విలువలను విస్మరించరాదని సూచించారు.

నేడు నిమ్స్ ఆయుష్ సెంటర్ ప్రారంభం

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ(నిమ్స్)లో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్ అందుబాటులోకి రానుంది. గురువారం దీనిని మంత్రి హరీష్‌రావు ప్రారంభించనున్నారు. తెలంగాణ ఆయుష్ మిషన్ కింద నామ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్ ద్వారా వ్యాధి భారం, పాకెట్ ఖర్చులను తగ్గించడానికి, అవసరమైన ప్రజలకు సమాచార ఎంపికలను అందించడానికి సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ నమూనాను అందించనున్నారు. ఈ తరహా సెంటర్ రాష్ట్రంలోనే మొదటిది కావడం గమనార్హం. ప్రజలకు విస్తృత స్థాయిలో చికిత్స ఎంపికలు, ఔషధంలోని వివిధ విభాగాల నిపుణులను అందించనున్నారు.

13 వార్డు కార్యాలయాలు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ నియోజక వర్గాల్లో 13 వార్డు కార్యాలయాలను బుధవారం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వీటిలో రాంనగర్, భోలక్‌పూర్, నల్లకుంట, రామ్‌గోపాల్‌పేట, మెహదీపట్నం, ఆసిఫ్‌నగర్, విజయనగర్‌కాలనీ, అహ్మద్‌నగర్, మల్లేపల్లి, రెడ్‌హిల్స్, గోషామహల్, మంగళ్‌హాట్, దత్తాత్రేయనగర్ ఉన్నాయి. మొత్తం 150 వార్డు కార్యాలయాలకు గాను ఇప్పటివరకు 149 వార్డు కార్యాలయాలు ప్రారంభమయ్యాయి.

మన బస్తీ- మన బడి పనులు వచ్చే నెల 15 లోగా పూర్తి చేయండి

సాక్షి, సిటీబ్యూరో: మన బస్తీ- మన బడి పనులను వచ్చే నెల 15లోగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మన బస్తీ-మన బడి పనులపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 80 శాతం పనులు పూర్తయిన పాఠశాలల్లో మిగిలిన పనులను పూర్తి చేయాలని సూచించారు. సివిల్ పనులు పూర్తయిన పాఠశాలలకు రంగులు వేసే కార్యక్రమాన్ని త్వరగా చేపట్టాలన్నారు. పనులకు నిధుల కొరత లేదన్నారు. పాఠశాలల్లో పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటి విద్యార్థులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికోసం ర్యాంపులు నిర్మించాలని, పాఠశాల రెయిలింగ్‌ను స్టెయిన్‌లెస్ స్టీల్‌తో ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఈఓ రోహిణి తదితరులు పాల్గొన్నారు.



దిల్‌సుఖ్‌నగర్‌లో బుధవారం రాత్రి రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

వృక్షాలకు రక్షా బంధన్

జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం విద్యార్థులు బుధవారం రాఖీ పండగ వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. మానవాళికి ఆక్సిజన్‌తో పాటు నీడను, ప్రకృతిని, పర్యావరణాన్ని ప్రసాదిస్తున్న మొక్కలు సోదరుల్లాంటివేనని పేర్కొంటూ విద్యార్థులంతా ఇక్కడున్న చెట్లకు రాఖీలు కట్టి పర్యావరణంపై తమకున్న ఆప్యాయతను చాటారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు. – బంజారాహిల్స్





విద్యార్థులే.. రాఖీలా..

కీసర మండలంలోని నాగారం సెరినిటీ పాఠశాలలో బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. విద్యార్థులు రాఖీ రూపంలో.. మానవహారంగా ఏర్పడి పండగ విశిష్టతను కళ్లకు కట్టారు. పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ రాఖీ పండగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఇలా విలక్షణ రీతిలో కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. – కీసర

వ్యూహాల పల్లకిలో..

ప్రచారంలో గులాబీదళం..

- కసరత్తులో కమలం
- కాంగ్రెస్‌లో దరఖాస్తుల జోష్..
- నగరంలో ప్రధాన పార్టీల తీరిదీ..
- అసెంబ్లీ ఎన్నికల వాతావరణం

సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలూ సన్నద్ధమవుతున్నప్పటికీ బీఆర్‌ఎస్ ముందంజలో దూసుకుపోతోంది. మిగతా పార్టీలు ఇంకా అభ్యర్థులనే ఎంపిక చేయలేదు. కాంగ్రెస్‌లో దరఖాస్తులు పరిశీలనలో ఉండగా, బీజేపీలో ఆ కసరత్తే మొదలు కాలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ఎంపిక చేసి వారు ప్రజాక్షేత్రంలోకి వెళ్లేలోపునే బీఆర్‌ఎస్ అభ్యర్థులు మూడు నాలుగు రౌండ్ల ప్రచారాన్ని పూర్తిచేసే యోచనలో ఉన్నారు. అందులో భాగంగా ఇప్పటికే అభ్యర్థులుగా ప్రకటించిన వారు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు. గ్రేటర్ పరిధిలో ఇద్దరు మినహా సిట్టింగ్ ఎమ్మెల్యేలే అభ్యర్థులు కావడంతో రాబోయే ఎన్నికల్లో మళ్లీ తమనే గెలిపించి ఆశీర్వదించాల్సిందిగా ప్రజల వద్దకు వెళ్తున్నారు. వివిధ కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు. పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిందిగా అధికారులను పరుగులు తీయిస్తున్నారు. ప్రభుత్వం వివిధ వర్గాల వారికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వివరిస్తున్నారు. కొత్తవాటికి శ్రీకారం చుడుతున్నారు. ఈనెల నెలాఖరులోపే వివిధ కార్యక్రమాలు పూర్తిచేసే యోచనలో ఉన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్ల పంపిణీని తమకు అనుకూలంగా మల్చుకోనున్నారు.

కాంగ్రెస్‌లో ఆశావహుల ఎదురుచూపులు..

కాంగ్రెస్‌లో టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులు ఎదురు చూస్తున్నారు. టికెట్ తమకేననే ధీమాలో ఉన్నవారు ఎన్నికల సరంజామా సిద్ధం చేసుకుంటున్నారు. పదిరోజుల్లో మొదటి జాబితా వెలువడుతుందని భావిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల నుంచి దరఖాస్తు చేసుకున్న అంజన్‌కుమార్ యాదవ్, అనిల్‌కుమార్ యాదవ్, మధుయాష్కి గౌడ్, దర్పల్లి రాజశేఖరరెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నందికంటి శ్రీధర్, గౌట్టిముక్కల పద్మారావు, రాగిడి లక్ష్మారెడ్డి, పి.విజయారెడ్డి, జువ్వాడి ఇందిరారావు, పి. విష్ణువర్ధన్‌రెడ్డి, మర్రి ఆదిత్యరెడ్డి, కోట నీలిమ, ఎం.డి ఫిరోజ్‌ఖాన్, ఆదం సంతోష్‌కుమార్, నోముల ప్రకాశ్‌గౌడ్, తదితరుల్లో ఎవరెవరికి టికెట్లు వస్తాయోననే ఉత్కంఠ నెలకొంది. అభ్యర్థుల్ని ఎప్పుడు ప్రకటించినా వెంటనే రంగంలోకి దిగేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

బీజేపీలో సందిగ్ధత..

బీజేపీ ఇప్పటి వరకు టికెట్లకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సందిగ్ధత నెలకొంది. ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్లను ఆశిస్తున్నవారు ఇప్పటికే తమవంతు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఎలాగైనా గెలవాలనే తలంపుతో బీజేపీ నుంచి హేమాహేమీలు రంగంలో దిగనున్నట్లు చెబుతున్నారు. కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ నాయకుడు డా.కె.లక్ష్మణ్‌లు సైతం అసెంబ్లీకి పోటీ చేస్తారంటున్నారు. వారుకాక ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తారనే భావిస్తున్న వారిలో మర్రి శశిధర్ రెడ్డి, ఎం.రామచంద్రరావు తదితరులున్నారు. టిక్కెట్లు ఆశిస్తున్న వారిలో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి, బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి, శ్యామ్‌సుందర్‌గౌడ్, ఆకుల విజయ, మేకల సారంగపాణి, లంకల దీపక్‌రెడ్డి, ఆకుల రాజేందర్, వెంకటరెడ్డి, గౌతంరావు, రజనీరెడ్డి తదితరులున్నారు. టికెట్లు ఎప్పుడు ఇచ్చినా మిగతా పార్టీల కంటే ప్రచారంలో వెనకబడకుండా ఉండేందుకు ఇప్పటినుంచే ఇంటింటి ప్రచారాలు చేయాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు తరచూ హాజరు కావాల్సి వస్తుండటంతో ఉన్న సమయంలోనే ఫంక్షన్లు, ఆయా కార్యక్రమాల పేరిట స్థానికులను కలుస్తూ మచ్చిక చేసుకునే పనిలో పడ్డట్లు సమాచారం. ఓవైపు టికెట్లు ప్రకటించని పార్టీల ఆశావహులు తమకు దక్కుతాయో లేదోననే టెన్షన్‌లో ఉండగా, ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థులు మాత్రం ఇప్పటి నుంచే వ్యయ ప్రయాసలకు మానసికంగా సిద్ధమవుతున్నారు.

క్లోరినేషన్ ఎక్కడ?

అధికారుల పర్యవేక్షణ కరువు

- లాగ్‌బుక్‌లో నమోదు అంతంతే
- ఔట్‌లెట్ టాప్ వద్ద క్లోరిన్ నిల్
- ప్రాణ సంకటంగా కుళాయి నీరు
- ఇదీ జలమండలి తీరు



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి సురక్షిత తాగు నీటి సరఫరాలో జలమండలి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. నీటి క్లోరినేషన్ నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లోపం ప్రజలకు ప్రాణ సంకటంగా పరిణమిస్తోంది. ప్రభుత్వం నీటి శుద్ధి చేసేందుకు క్లోరిన్ గ్యాస్‌పై రూ.కోట్లు వెచ్చిస్తున్నా.. ఆచరణ అమలు మేడిపండు చందంగా మారింది. మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి చివరి సర్వీస్ రిజర్వాయర్ వరకు క్లోరినేషన్ నిర్వహణ అంతంత మాత్రంగానే మారింది. ఫలితంగా నీటిలో తగిన మోతాదులో క్లోరిన్ మెయింటెన్ కాకుండానే సరఫరా కావడంతో ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నది నుంచి నీరు రిజర్వాయర్‌కు చేరే క్రమంలో మట్టి, ఇతరత్రా వ్యర్థాలు కలిసి వస్తుండటంతో ప్రతి పాయింట్‌కు నీటి శుద్ధి అవసరం ఉంటుంది. క్లోరినేషన్ సరిగా జరగకపోవడంతో రిజర్వాయర్ అడుగు భాగంలో పేరుకుపోయిన మట్టి బ్యాక్టీరియా, ఇకొలి వైరస్‌కు కారణమవుతున్నాయి. మరోవైపు రిజర్వాయర్లలో చేరిన మట్టి క్లోరిన్‌ను తినేస్తోంది. క్లోరినేషన్ చేయకుండా నీరు సరఫరా కావడంతో జనం వాంతులు, విరేచనాలు, కడుపు ఉబ్బరం వంటి సమస్యలకు గురికాక తప్పదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

మూడంచెల క్లోరినేషన్ నామమాత్రమేనా?

కృష్ణా, గోదావరి, మంజీరా, సింగూరు నదుల నుంచి తరలిస్తున్న జలాలపై మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ అంతంతగా తయారైంది. నదుల నుంచి మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల మీదుగా సర్వీస్ రిజర్వాయర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు సరఫరా అవుతోంది. మొదటి విడతగా వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ) వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల (ఎంబీఆర్) వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంది. కానీ సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేమితో క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

కానరాని మెయింటెనెన్స్..

- నీటి సరఫరా క్లోరిన్ మెయింటెనెన్స్ ప్రశ్నార్థకంగా తయారైంది. రిజర్వాయర్ వద్ద కోర్లిన్ రెండు పీపీఎం (పార్ట్ పర్ మిలియన్) మెయింటెన్ జరగాలి. నల్లా ద్వారా వినియోగదారుడికి నీరు చేరే సమయంలో కచ్చితంగా అందులో 0.5 పీపీఎం క్లోరిన్ మెయింటెన్ కావాల్సి ఉండగా ఆచరణలో లేకుండా పోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నీటి సరఫరా సమయంలో కోర్లిన్ శాతంపై ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. సూక్ష్మక్రిములు వృద్ధి చెందే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.
- రిజర్వాయర్‌లో నీటిలో క్లోరిన్ ప్రభావం తగ్గగానే తిరిగి కలిపితేనే ఆ నీటి నాణ్యత మెరుగుపడుతుంది. క్లోరిన్ శాతం నిర్దేశించిన దానికంటే తక్కువ ఉంటే ఆ నీరు సురక్షితం కానట్లే. క్లోరిన్ ప్రభావం లేని కారణంగా సూక్ష్మ క్రిములు వృద్ధి చెంది నీరు ప్రజా ఆరోగ్యానికి హానికరంగా మారే ప్రమాదం లేకపోలేదు. నీటి శాంపిల్ సర్వేలో మాత్రం పలు రిజర్వాయర్ పరిధిలో క్లోరిన్ మెయింటెన్ కావడంలేదని బహిర్గతం కావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్నిసార్లు ఔట్‌లెట్ టాప్ వద్ద సైతం క్లోరిన్ నిల్‌గా ఉండటం నిర్వహణ తీరుకు అద్దం పడుతోంది.

లాగ్‌బుక్ నిర్వహణేదీ?

సర్వీస్ రిజర్వాయర్లలో లాగ్‌బుక్ నిర్వహణ మొక్కుబడిగా తయారైంది. కేవలం ప్రధాన పాయింట్ మినహా మిగతా పాయింట్లల్లో ఎప్పటికప్పుడు లాగ్‌బుక్‌లో నమోదు లేదు. వారానికోసారి నమోదు చేస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. నిబంధనల ప్రకారం ఎగువ నుంచి రిజర్వాయర్‌లోకి వచ్చి చేరే నీటి ప్రవాహంలో క్లోరిన్ శాతంతో పాటు దిగువ నీటిని విడుదల చేసే సమయంలో క్లోరిన్ శాతాన్ని లాగ్‌బుక్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వీస్ రిజర్వాయర్ నుంచి లైన్‌లకు నీటిని సరఫరా జరిగే సమయంలో సైతం క్లోరిన్ శాతాన్ని లాగ్ బుక్‌లో నమోదు చేయాలి. గంట గంటకూ నమోదు చేయాల్సి ఉండగా ఆచరణలో మాత్రం అమలు కావడంలేదని తెలుస్తోంది.

30 నిమిషాల ముందే..

సర్వీస్ రిజర్వాయర్ నుంచి లైన్‌కు సరఫరా చేసే అర్ధ గంట ముందు క్లోరిన్ గ్యాస్‌ను నీటిలో విడుదల చేయాల్సి ఉండగా ఇందుకు భిన్నంగా తయారైంది పరిస్థితి. ప్రతి లైన్‌కు క్లోరిన్ శాతం పరిశీలించి సరఫరా చేయాల్సి ఉండగా.. నీటి ప్రవాహంలోనే క్లోరిన్ గ్యాస్ కలిసేటట్లు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో క్లోరిన్ శాతం హెచ్చు తగ్గులై ప్రభావం చూపే ప్రమాదం లేకపోలేదన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

సమయస్ఫూర్తితో స్పందించి..

సీపీఆర్‌తో ప్రాణాన్ని కాపాడిన ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్

- బేగంపేట హెచ్‌పీఎస్ వద్ద గుండెపోటుతో కుప్పకూలిన మేస్త్రీ
- వెంటనే సీపీఆర్‌తో కదలిక.. ఆస్పత్రికి తరలింపు..



రాములుకు సీపీఆర్ చేస్తున్న మధుసూదన్‌రెడ్డి

సనత్‌నగర్: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి కుప్పకూలిపోగా అక్కడే ఉన్న నార్త్‌జోన్ ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి వెంటనే అతనికి సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడారు. బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) వద్ద జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కందిసా ప్రాంతానికి చెందిన గుజ్జల రాములు బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి బేగంపేట బ్రాహ్మణవాడీ వడ్డెరబస్తీ లేన్‌నెంబర్-4లో నివాసం ఉంటున్నాడు. మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటాడు.

బుధవారం మధ్యాహ్నం 11.15 గంటల సమయంలో హెచ్‌పీఎస్ ప్రధాన రహదారిలో నడుచుకుంటూ వెళ్తున్నా డు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్ప కూలి కిందపడిపోయాడు. అదే సమయంలో అక్క డే ముఖ్యమంత్రి మూవ్‌మెంట్ బందోబస్తు విధుల్లో ఉన్న నార్త్‌జోన్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి రాములును గమనించాడు. వెంటనే అక్కడే విధుల్లో ఉన్న బేగంపేట ట్రాఫిక్ సీఐ పాపయ్య, హోంగార్డు బాలయోగిల సహకారంతో రాములుకు పీసీఆర్ ప్రక్రియ చేపట్టారు. కొద్దిసేపు సీపీఆర్ చేసిన అనంతరం రాములులో కదలిక రావడంతో వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఇటీవల కాలంలో పోలీసు శాఖలో సీపీఆర్‌పై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు డెమో ద్వారా తెలియజేయడం ద్వారా తాను అప్రమత్తమై సీపీఆర్ చేశానని.. రాములుకు స్పృహ రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించినట్లు ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సీపీఆర్ చేసి రాములు ప్రాణాలను కాపాడిన మధుసూదన్‌రెడ్డిని ఉన్నతాధికారులు ప్రశంసించారు.

శత్రు దేశాలకు వణుకు పుట్టేలా..

- అత్యంత భేషుగ్గా భారత్ మిస్సైళ్ల పరిజ్ఞానం
- రక్షణ శాఖ ముఖ్య సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న డాక్టర్ సతీష్‌రెడ్డి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ శారదా ధామంలోని శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ (ఎస్‌వీఐఎస్)లో ఇన్‌స్పైర్ ఇండియా ఈవెంట్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా దేశ రక్షణ శాఖ ముఖ్య సలహాదారు డాక్టర్ సతీష్‌రెడ్డి మాట్లాడారు. హైపో సోనిక్ విమానాలు చూపెట్టి అమెరికా ప్రపంచాన్ని భయపెట్టింది. చైనా మన మీదకు మాటిమాటికి కాలు దువ్వుతోంది. కానీ.. ఆ దేశాలకు చెమటలు పట్టించేలా.. నిమిషానికి 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఐపో సోనిక్ మిస్సైళ్లను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసి అగ్ర దేశాలకు సవాల్ విసిరే స్థాయికి భారతదేశం వచ్చిందన్నారు. శత్రు దేశాలు మన దేశం వైపు కన్నెత్తి చూడాలంటేనే వణుకు పుట్టేలా మన దేశ రక్షణ శాఖ తయారైందన్నారు. డాక్టర్ అబ్దుల్ కలాం తరచూ పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి పాఠశాలలదే ప్రధాన భూమిక అని చెప్పేవారు అని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర్నుంచి భారత దేశం సాధించిన విజయాలను విద్యార్థులతో ఆయన పంచుకున్నారు. దేశ అభివృద్ధిలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచ దేశాలు అన్నీ మన దేశంవైపు చూస్తున్నాయని సృజనాత్మకంగా ఆలోచిస్తూ నైపుణ్య భారత్‌ను నిర్మించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, విద్యాభారతి దక్షిణ మధ్య కోశాధికారి పసర్థి మల్లయ్య, ప్రిన్సిపాల్ గోకులం పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ యత్నం కేసులో ఒకరికి అయిదేళ్ల జైలు



రంగారెడ్డి కోర్టులు: హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన బాలిక కిడ్నాప్‌నకు యత్నించిన కేసులో నిందితుడు మండలి శ్రీకాంత్‌కు అయిదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ ఎల్బీనగర్‌లోని 9వ అదనపు జిల్లా కమ్ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి హరీశ తీర్పు వెలువరించారు. కోర్టు ఏపీపీ సునీత కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థిని నడుచుకుంటూ ఇంటికి వెళ్లుండగా.. మార్గంమధ్యలో నిందితులు బాలికను అపహరించే ఉద్దేశంతో కారులోకి ఎక్కించడానికి ప్రయత్నించారు. దీంతో బాలిక గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు ఇది గమనించారు. ఇదే క్రమంలో బాలికను కారులోకి తోసిన నిందితులు పరారయ్యేందుకు ప్రయత్నించారు. ఈ ఘటన చూసిన వాళ్లు కారుని వెంబడించి బాలికను కాపాడారు. ఇదే విషయంపై బాలిక మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన హయత్‌నగర్ పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని, రిమాండ్‌కు తరలించి చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో ఉండగా ప్రధాన నిందితుడు చనిపోయాడు. కేసులో మరో నిందితుడిపై కేసు విచారణ చేపట్టిన కోర్టు.. సాక్షులను విచారించి నిందితుడు శ్రీకాంత్‌కి అయిదేళ్ల జైలు శిక్ష తోపాటు రూ.20వేల జరిమానా విధిస్తూ, బాధితురాలికి రూ.2లక్షల పరిహారం మంజూరు చేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది.

నవ వధువుపై నకిలీ బాబా లైంగిక దాడి


బజార్ బాబా

చాంద్రాయణగుట్ట: వైద్యం కోసం వచ్చిన నవ వధువుపై ఓ నకిలీ బాబా లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హాస్సేనీఆలం ప్రాంతానికి చెందిన యువతికి మూడు నెలల క్రితం భవానీనగర్‌కు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఆమె ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో అత్తింటి వారు బండ్లగూడ ప్రాంతంలో ఉంటున్న బజార్ బాబా దగ్గరకు తీసుకెళ్లారు. వైద్యంలో భాగంగా ఆమె కళ్లకు గంతలు కట్టి సదరు బాబా లైంగిక దాడి చేశాడని బాధితురాలు కుటుంబ సభ్యులకు తెలిపింది. ఈ విషయం చెప్పినా అత్త, మామలు పట్టించుకోకుండా దయ్యం పట్టిందంటూ గదిలో బంధించారు. చివరకు బాధితురాలు తల్లిదండ్రులతో కలిసి జూలై 19న భవానీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు..ఘటన జరిగిన స్థలం బండ్లగూడ పరిధిలో ఉండడంతో బండ్లగూడకు కేసును బదిలీ చేశారు. బాబా పరారీలో ఉన్నాడు.

వార్డు కార్యాలయాలతో ప్రజలకు మెరుగైన వసతులు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- ఎన్నికల సమయంలో జై శ్రీరామ్ అంటే ఓట్లు రాలవ్
- కిషన్ రెడ్డి అంబర్‌పేట అభివృద్ధికి చేసిందేమీలేదు


తిలక్‌నగర్ వార్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నల్లకుంట: జీహెచ్‌ఎంసీలోని అన్ని శాఖల సమన్వయంతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు వార్డు కార్యాలయాలు దోహదపడతాయని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 81వ వార్డు కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని అన్ని శాఖలను ఒకే చోటుకు తీసుకు వచ్చి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు వార్డు కార్యాలయాలను రూపొందించడం జరిగిందని చెప్పారు. అంబర్‌పేట నియోజకవర్గంలో కాలేరు వెంకటేశ్ చేతిలో ఎమ్మెల్యేగా ఓడిపోయిన జి.కిషన్‌రెడ్డి అదృష్టం కొద్దీ ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయ్యారని అన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఇప్పటి వరకు అంబర్‌పేట నియోజక వర్గం పరిధిలో ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా చేపట్టకపోగా..మీడియా ముందుకు వచ్చి మాత్రం మా అంత గొప్పోళ్లు లేరని రాష్ట్ర ప్రభుత్వంపై ఎప్పుడూ విమర్శలు చేస్తూనే ఉన్నారని విమర్శించారు. ఇక ఎన్నికలు వచ్చేసరికి జై శ్రీరామ్ అనగానే ప్రజలంతా తమ వెంటే ఉంటారనే ఒక భ్రమలో బీజేపీ నాయకులు ఉన్నారని మంత్రి ఆరోపించారు. అభివృద్ధికే ప్రజలు పట్టం కడతారని, జై శ్రీరామ్ అంటే ఓట్లు రాలవన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన అంబర్‌పేట చేనంబర్ ఫ్లై ఓవర్ పనులు గత నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతోందన్నారు. అదే రాష్ట్ర ప్రభుత్వం నగరంలో చేపట్టిన ఫ్లైవర్లను కేవలం రెండు సంవత్సరాలలో పూర్తి చేసి చూపించామన్నారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రజల ముంగిట్లో పరిపాలన అందించాలనే లక్ష్యంతో మంత్రి కేటీఆర్ ఆలోచన మేరకు నగరంలో వార్డు కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. తిలక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాలలో 10 మంది మున్సిపల్ సిబ్బంది ఉంటారన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ, సర్కిల్ 16 డీఎంసీ మారుతీ దివాకర్, అడిషనల్ డీసీ ప్రదీప్ కుమార్, డీపీవో రజిత, వాటర్ వర్క్స్ ఈఏ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పటి దాకా ఆడి పాడి.. అంతలోనే మృత్యు ఒడికి

- శంషాబాద్ మే ఫేర్ ఫంక్షన్ హాలులో దారుణం
- సెప్టిక్ ట్యాంకులో పడి చిన్నారి మృతి


మృతదేహాన్ని బయటికి తీసిన పోలీసులు


అభిజిత్‌రెడ్డి (ఫైల్)


సంఘటనకు ముందు నృత్యం చేసిన బాలుడు

శంషాబాద్: అప్పటి దాకా పెళ్లి వేడుకలో ఆడి పాడిన ఓ చిన్నారి అంతలోనే మృత్యు ఒడికి చేరాడు. ఈ దారుణ సంఘటన బుధవారం రాత్రి శంషాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణంలోని మే ఫేర్ ఫంక్షన్ హాలులో జరిగిన పెళ్లి వేడుకలకు నందిగామ గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి, మౌనిక దంపతుల కుమారుడు అభిజిత్‌రెడ్డి (5) తల్లి సోదరితో కలిసి వచ్చాడు. పెళ్లిలో మ్యూజిక్‌కు అనుగుణంగా ఉత్సాహంగా నృత్యాలు కూడా చేశాడు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చిన్నారి కనిపించకపోవడంతో తల్లి మౌనికతో పాటు బంధువులు చుట్టుపక్కల వెతికారు. రాత్రి 6 గంటల వరకు కూడా కనిపించకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఫంక్షన్ హాలులో పరిశీలించడంతో వెనకాలే ఉన్న ఓ సంపు వద్ద బాలుడి చెప్పులు కనిపించాయి. సంపులోకి దిగి వెతకడంతో బాలుడి మృతదేహం బయటపడింది. అప్పటి వరకు అందరి మధ్యలో ఉత్సాహంగా ఆడిపాడిన చిన్నారి మృతదేహం బయటపడడంతో పెళ్లి వేడుకలో విషాదం నెలకొంది. ఫంక్షన్ హాలు యజమాన్యం నిర్లక్ష్యం కారణంగా చిన్నారి మృతిచెందాడని వారి కుటుంబసభ్యులు జాతీయ రహదారిపై ధర్నా చేశారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తమ ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ టికెట్ల కేటాయింపులో మాలలకు అన్యాయం

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య



పంజగుట్ట: బీఆర్‌ఎస్ టికెట్ల కేటాయింపులో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం చేశారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఆగ్రహంవ్యక్తం చేశారు. ముఖ్యంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అచ్చంపేట, ఆలంపూర్ స్థానాలు రెండింటినీ మాదిగలకే ఇవ్వడమే కాకుండా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కూడా మాదిగలకే ఇచ్చి మాలలను అవమానపరిచారని ఆగ్రహంవ్యక్తం చేశారు. సుమారు 50 వేల మాలల జనాభా ఉన్న ఆలంపూర్ అసెంబ్లీ స్థానాన్ని మాలలకు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..ఆలంపూర్ అసెంబ్లీ స్థానాన్ని మాలలకు ఇవ్వకపోతే బీఆర్‌ఎస్‌కు ఆ నియోజకవర్గంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నె శ్రీధర్, గ్రేటర్ అధ్యక్షులు బైర్ల శ్రీనివాస్, సిటీ వైస్ ప్రెసిడెంట్ గోకుల కళ్యాణ్ పాల్గొన్నారు.

బీసీల న్యాయం చేసింది కేసీఆరే..

- బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం
- వడ్డెరుల సామాజిక భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పల్: బీసీ, ఎంబీసీ, సంచార, అర్ధ సంచార సామాజిక వర్గాలు ఐక్యమత్యంతో తమ ఉనికిని చాటుకున్నప్పుడే సమాజంలో సముచిత గౌరవం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. తెలంగాణలో బలహీన వర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషి అమూల్యమైందని, అందులో భాగంగానే కోట్ల రూపాయల విలువ గల భూములను ఉచితంగా కుల సంఘాల భవనాలకు కేటాయించారని అన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ భగాయత్‌లో వడ్డెర, సంచార జాతులకు కేటాయించిన స్థలాల్లో సామాజిక భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. వడ్డెర సంఘానికి ఎకరం స్థలం, 36 సంచార జాతుల వారికి 10 ఎకరాల స్థలాన్ని సామాజిక భవనాలకు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీ వర్గాలలో అనైక్యత తెచ్చి చిచ్చుపెట్టే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేతల గైర్హాజరుతో ఆగ్రహం..

ఉప్పల్ భగాయత్ లేఔట్‌లో ఆత్మగౌరవ భవనాల శంకుస్థాపనకు బీసీ మంత్రి గంగుల కమలాకర్‌తో పాటు ఇతర మంత్రులు హాజరు కావాల్సి ఉండగా వారెవ్వరూ హాజరు కాలేదు. దీంతో కొందరు నేతలు, అక్కడికి వచ్చిన కుల సంఘాల ప్రతినిధులు వకుళాభరణం గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్, కేటీఆర్ డౌన్ డౌన్ అంటూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. పరిస్థితి చేయి దాటుతుండగా పోలీసులు రంగప్రవేశం చేసి వారిని సముదాయించి పంపేశారు.

ఇస్కాన్ నుంచి ఆధ్యాత్మిక యాప్

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థ ఇస్కాన్‌కు చెందిన భక్తి వేదాంత బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మానసిక వికాసం, ఆధ్యాత్మిక భావాలు పెంపొందించే 'ట్రాన్సెండ్' యాప్ రూపొందించారు. దీనిని బుధవారం నగరంలో విడుదల చేసిన సందర్భంగా రూపకర్తలు మాట్లాడుతూ ఆడియో, ఇ-బుక్స్ రెండింటినీ ఒకే చోట అందించే తొలి ఇ-లైబ్రరీ యాప్ ఇదని, తెలుగు సహా 11 భాషల్లో 20 వేల సంస్కృత శ్లోకాలు, 8 వేల గంటల ఆడియో బుక్స్, 600కు పైగా ఇ-బుక్స్ వంటివన్నీ ఇందులో ఉన్నాయని వివరించారు. ఈ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ప్లాట్‌ఫారమ్‌లలో, వెబ్ యాప్‌లో కూడా అందుబాటులో ఉందన్నారు.

కాశమ్మ హత్య కేసులో కీలక ఆధారాలు లభ్యం!

– సీసీ కెమెరా ఫుటేజీలో వ్యక్తి గుర్తింపు

గచ్చిబౌలి: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ నిర్మాణ సంస్థ సెల్లార్‌లో దారుణ హత్యకు గురైన కాశమ్మ కేసులో కీలక ఆధారాలు లభ్యమైనట్లు విశ్వసనీయ సమాచారం. కాశమ్మ కేసులో రాష్ట్ర మహిళా కమిషన్, గవర్నర్ తమిళిసై స్పందించడంతో గచ్చిబౌలి పోలీసులు కేసును ఛేదించేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. గుర్తు తెలియని వ్యక్తితో కలిసి కాశమ్మ లోపలి వెళుతున్నట్లు సీసీ కెమెరాల ఫుటేజీల్లో కనిపించినట్లు తెలిసింది. ఆ ఫుటేజీ ఆధారంగా లోపలికి వెళ్లిన వ్యక్తి వివరాల కోసం ప్రత్యేక బృందాలు ప్రయత్నిస్తున్నాయి. ఇదిలా ఉండగా కేశవ్‌నగర్‌లో కాశమ్మ అంత్యక్రియలకు భర్త సాంబయ్య పరోల్‌పై వచ్చి హాజరయ్యారు. పెద్ద భార్యను కిరోసిన్ పోసి నిప్పంటించి హత్య చేసిన కేసులో సాంబయ్యకు జీవిత ఖైదు విధించారు. పెద్ద భార్యకు కూతురు, చిన్న భార్య కాశమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లి హత్యకు గురికావడం, తండ్రి జైలులో ఉండటంతో పిల్లలకు పెద్ద దిక్కు లేకుండా పోయింది.

'అన్నా చనిపోతున్నా' అంటూ మెసేజ్ చేసి...


అదృశ్యమైన సునీల్

రాంగోపాల్‌పేట్: 'నన్ను క్షమించు అన్నా..నేను చనిపోతున్నా..నేను ఫెయిల్ అయ్యాను' అంటూ ఓ వ్యక్తి తన అన్నకు ఫోన్‌లో మెసేజ్ చేసి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పల్ మేడిపల్లికి చెందిన మాదారం సునీల్ (38)కు భార్య, కుమారుడు ఉన్నారు. ఈయన సూర్యటవర్స్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే సంస్థలో అతని అన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో సంస్థ ఎండీని కారులో సూర్యటవర్‌లోని కార్యాలయం వద్ద డ్రాప్ చేశాడు. అదే సమయంలో ఆయన అన్న భోజనం చేద్దామని ఆహ్వానించగా సమాధానం చెప్పకుండా కార్యాలయం నుంచి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం 2.24 గంటల సమయంలో వాట్సప్‌లో భార్య మొబైల్ ఫోన్ నుంచి వాయిస్ మెసేజ్ చేసి స్విచ్ ఆఫ్ చేశాడు. తెలిసిన వాళ్లు, బంధువుల వద్ద వాకబు చేసినా ఎక్కడ ఆచూకీ దొరక లేదు. దీంతో బుధవారం రాత్రి మహంకాళి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

తెలంగాణ సాహిత్యాన్ని భారతీయ భాషల్లోకి అనువదించాలి


సదస్సులో మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ సాహిత్యాన్ని భారతీయ భాషల్లోకి అనువదించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో 'జాతీయ ఉద్యమంలో తెలుగు సాహిత్యం పాత్ర' అంశంపై రెండు రోజులుగా రవీంద్రభారతిలో జరిగిన జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లపైన.. కన్నీళ్లపైన.. తెలంగాణ ప్రాంతం నుంచి వచ్చినంత సాహిత్యం మరే ఇతర భారతీయ భాషల్లో రాలేదన్నారు. వలసలు పోయిన తెలంగాణ నుంచి వలస కథలు ఎన్నో వచ్చాయని గుర్తు చేశారు. ఈ ప్రాంత కవులు, రచయితలు తమ కలాలతో అద్భుతమైన సాహిత్యాన్ని రచించారని కొనియాడారు. సమావేశంలో జాతీయ ఉద్యమంలో పౌరాణిక, సాంఘిక నాటకాలపై, అభ్యుదయ సాహిత్యంలో జాతీయ ఉద్యమం వంటి పలు అంశాలపై పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్, ఆచార్య కోట్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికురాలిని దూరం చేశాడన్న కక్షతో...

బంజారాహిల్స్: తాను ప్రేమించిన యువతి వేరొకరిని పెళ్లి చేసుకోవడంలో సహకరించాడన్న కక్షతో యువకుడిపై కత్తితో దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఒడిశాకు చెందిన సంజీవ్ అనే వ్యక్తి గతంలో రేఖారాణి అనే యువతితో స్నేహంగా ఉండేవాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలని చాలాకాలం ప్రయత్నించాడు. అయితే ఏడాది క్రితం రేఖారాణి వెంకటగిరి ప్రాంతంలో నివాసం ఉంటున్న కేశవ్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. కాగా కేశవ్‌కు బంధువైన జబాన్ రాహుల్ (24) కారణంగానే తన ప్రేమను రేఖారాణి తిరస్కరించిందని భావించిన సంజీవ్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. తనను కాదని కేశవ్‌తో దగ్గరుండి పెళ్లి చేయించిన రాహుల్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు వెంకటగిరి బడా మజీదు వద్ద నివసిస్తూ ఫిలింనగర్‌లోని ఓ బార్ అండ్ కిచెన్‌లో చెఫ్‌గా పని చేస్తున్న రాహుల్ మంగళవారం రాత్రి 11.55 గంటల సమయంలో పని ముగించుకొని చిరంజీవి బ్లడ్ బ్యాంకు మీదుగా వెళ్తుండగా దారికాచిన సంజీవ్‌తో పాటు మరో వ్యక్తి తమతో పాటు తెచ్చుకున్న కత్తితో పొడిచి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాల పాలైన రాహుల్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చేపట్టారు.

రుణాలు సేకరించి బ్యాంకుకు చెల్లించకుండా మోసం

పంజగుట్ట: బ్యాంకులో రుణాలు చెల్లించే వారి నుంచి నగదు సేకరించి బ్యాంకుకు చెల్లించకుండా మోసం చేసిన నిందితునిపై పంజగుట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీర్‌పేటలోని ఆర్‌బీఎల్ బ్యాంకులో మల్లికార్జున్ అనే వ్యక్తి 2017 నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. బ్యాంకులో రుణాలు తీసుకున్న వారు తిరిగి చెల్లించే క్రమంలో మల్లికార్జున్ డబ్బులు తీసుకుని బ్యాంకుకు చెల్లించకుండా వాడుకునే వాడు. అంతటితో ఆగకుండా రుణాలు పూర్తయిన వారికి రుణం తీరిపోయినట్లు బ్యాంకు ఎన్‌ఓసీ కూడా ఇచ్చేవాడు. ఒక కస్టమర్‌కు అనుమానం వచ్చి బ్యాంకు సిబ్బందికి ఫిర్యాదు చేయగా బ్యాంకు వారు ఆడిట్ చేయ్యడంతో రూ.57 లక్షల 78 వేలు మల్లికార్జున్ వాడుకున్నట్లు తేలింది. బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

ఫుట్‌పాత్‌పై వాహనాలు నడిపితే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో కొంత మంది ద్విచక్ర వాహనదారులు హద్దుల మీరి పాదచారుల కోసం నిర్మించిన ఫుటపాత్‌లపై వాహనాలతో దూసుకుపోతున్నారు. దీంతో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ స్పందించి బుధవారం ఇక్కడ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఫుట్‌పాత్‌పై వాహనాలతో వెళ్తున్న వారిని గుర్తించి వారికి జరిమానాలు విధించారు. పాదచారులకు ఇబ్బందులు కలిగించే విధంగా వాహనదారులు ప్రవర్తిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

ఘనంగా స్పోర్ట్స్ డే

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో బుధవారం స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులకు బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే, స్కేటింగ్, రెజ్లింగ్, జిమ్నాస్టిక్స్ తదితర పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టేడియం అడ్మినిస్ట్రేటర్ అలెగ్జాండర్ ఫ్రాన్సిస్ విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ క్రీడల కోచ్‌లు క్రాంతి, తారకరామ్, ఉత్తమ్‌కుమార్, సోహెయిల్, లోకేష్, ఖదీర్, శ్రీకాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ సోమాజిగూడ అధ్యక్షురాలిగా కన్యాకుమారి



నియామకపత్రాన్ని అందుకుంటున్న కన్యాకుమారి

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం సోమాజిగూడ డివిజన్ మహిళా కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా ఎల్లారెడ్డిగూడకు చెందిన ఒ.కన్యాకుమారి నియామకమయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆమెకు అందజేశారు. తనను నమ్మి ఇచ్చిన పదవిని న్యాయం చేకూరుస్తానని, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తానని కన్యాకుమారి తెలిపారు. కార్యక్రమంలో నేతలు అమరం మధుసూధన్‌రెడ్డి, సుధాకర్, నరికెళ్ల నరేష్, సతీష్‌దాస్, శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

ఉద్యమకారులను ఆదుకోవాలి

లిబర్టీ: తొలి దశ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలను పణంగా పెట్టి పోరు సాగించిన ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని జన సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె.వెంకటనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1969లో జరిగిన ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉద్యమకారులను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం లిబర్టీ వద్ద ఉన్న లిబర్టీ ప్లాజాలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 1969 ఉద్యమకారులు సాగించిన పోరాట స్ఫూర్తితోనే మలి దశ ఉద్యమం సాగించి రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. తొలి దశ ఉద్యమకారులకు ప్రతి నెలా పెన్షన్ ఇవ్వాలని, ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ప్రతికుటుంబానికి రూ. 10 లక్షలు ఇవ్వాలని విన్నవించారు.

నేత్రపర్వం.. 'చాండాలిక'నృత్యం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సౌత్ ఇండియన్ కల్చరల్ అసోసియేషన్ (ఎస్ఐసీఏ) వార్షిక నృత్యోత్సవాలలో భాగంగా నగరంలోని రవీంద్రభారతి లో 'చాండాలిక' నృత్య రూపక ప్రదర్శన నిర్వహించారు. ఈ నృత్య రూపకాన్ని హైదరాబాద్‌కు చెందిన 'క్రాంతి కూచిపూడి నాట్యాలయ' వారు సమర్పించారు. శ్రీశ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాలీలో రాసిన రూపక మూలాన్ని తీసుకొని, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న తెలుగులో రచన చేశారు. నృత్య రూపకంలో చాండాలిక పాత్రధారి క్రాంతి నారాయణ్, మాలి పాత్రధారి కేదారనాథ్ అద్భుతంగా తమ అభినయాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకులు మంత్ర ముగ్ధులై ఆసాంతం ఈ రూపకాన్ని ఆస్వాదించారు. మహీధర సీతారామ్ వ్యాఖ్యాతగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐసీఏ కార్యవర్గ సభ్యులు కళాకారులను ఘనంగా సత్కరించారు.

'ఉన్నతి'తో విద్యార్థులకు ప్రయోజనాలు

- 6-9 తరగతుల్లో అమలుకు శ్రీకారం
- ప్రారంభమైన శిక్షణ కార్యక్రమాలు
- నాలుగు విడతల్లో నిర్వహించనున్న శిక్షణ
- 9 వేల మంది విద్యార్థులకు ఉపయోగకరం



సర్కారు బడిలోని విద్యార్థులు

బంజారాహిల్స్: ఉన్నతి కార్యక్రమంలో ఈ నెల 29న ప్రారంభమైన శిక్షణ నాలుగు విడతల్లో జరగనుంది. ఒక్కో విడతలో మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తారు. వచ్చే నెల 1 తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ శిక్షణ మొదటి విడతలో పూర్తి చేయనున్నారు.

- అమీర్‌పేట్‌లోని ధరంకరం రోడ్డు ప్రభుత్వ పాఠశాలలో, అలియా ప్రభుత్వ పాఠశాలలో ఈ శిక్షణ కోసం విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 9 తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంపొందించేందుకు 2023-24వ విద్యా సంవత్సరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. 'ఉన్నతి' పేరుతో అమలు చేయనున్న ఈ కార్యక్రమంలో 6 నుంచి 9వ తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ ఇలా...

- విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఉన్న 17 ఉన్నత పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధన చేస్తున్న 116 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఈ నెల 29 నుంచి ఎంపిక చేసిన కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నారు. మొదటి విడత ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 1 వరకు రెండో విడత సెప్టెంబర్ 2 నుంచి 6 వరకు, మూడో విడత సెప్టెంబర్ 11 నుంచి 13 వరకు నాల్గో విడత 14 నుంచి 16 వరకు ఇవ్వనున్నారు.
- ఒక్కో విడతలో మూడు రోజుల పాటు తెలుగు, ఇంగ్లిష్, హిందీ, గణితం, జీవ, భౌతిక, సాంఘిక శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి డీఆర్‌జీల ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు.
- జోన్ పరిధిలో నాలుగు విడతల్లో ఉపాధ్యాయుల్లో శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.
- తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు వేర్వేరుగా, భౌతిక, జీవ శాస్త్రం సబ్జెక్టులకు అందరికీ కలిపి ఈ శిక్షణ ఇస్తారు.
- ఉపాధ్యాయుల సంఖ్య ఆధారంగా రెండు లేదా మూడు విడతల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ డీఈవో శ్యాముల్ రాజు తెలిపారు.
- ఈ తరహా శిక్షణ వల్ల జోన్ పరిధిలో చదువుతున్న 9 వేల మంది విద్యార్థులకు ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. వారిలో సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు ఈ శిక్షణ తోడ్పాటునందించనుంది. ఇదొక మంచి కార్యక్రమం అని ఉపాధ్యాయులు కూడా పేర్కొంటున్నారు.

సందడిగా రక్షాబంధన్

శ్రీనగర్‌కాలనీ: రక్షాబంధన్ వేడుకలు ఎర్రగడ్డలోని సంస్కార్ ది లైఫ్ స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తోటి విద్యార్థులకు రాఖీకట్టి సోదరభావాన్ని వ్యక్తం చేశారు. రక్షాబంధన్ విశిష్టతను చిన్నారులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ సీఈఓ మోహ వంశీ, డైరెక్టర్ మధుమతి తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావునగర్ కాలనీలో...

వెంగళరావునగర్: సమాజంలో అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని పెంచేది రాఖీ పౌర్ణమి అని కన్స్యూమర్స్ రైట్స్ కమిషన్ జాతీయ వైస్ చైర్మన్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం వెంగళరావునగర్ కాలనీలోని ఆయన కార్యాలయానికి పలువురు స్థానిక మహిళలు వచ్చి రాఖీ కట్టారు. ఆయన రాఖీ కట్టిన మహిళలనందరినీ ఆశీర్వదించి తన ఆత్మీయతను చాటుకున్నారు.

ఘనంగా రక్షాబంధన్

పంజగుట్ట: వెంకటరమణ కాలనీలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికి మరొకరు నాకు నీవు రక్ష, నీకు నేను రక్ష మనిద్దరం దేశానికి రక్ష అనుకుంటూ రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ గోల్కొండ భాగ్ సహ కార్యావహ గరడి విజయ్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సుదర్శన్, కోటేశ్వర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంగెళ్లపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రవిశేఖర్‌రెడ్డి రాఖీ కడుతున్న ముస్లిం మహిళ



రక్షాబంధన్ వేడుకల్లో సంస్కార్ విద్యార్థులు

ఉచిత వైద్యంతో రెండు ప్రాణాలను కాపాడిన 'విరించి' ఔదార్యం

బంజారాహిల్స్: అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో పేదరికంతో దిక్కుతోచని స్థితిలో మరో ఆస్పత్రి నుంచి బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రికి మార్చబడిన రోగికి సంబంధిత వైద్యులు పూర్తిగా ఉచిత వైద్యాన్ని అందించి రెండు నిండు ప్రాణాలను కాపాడారు. మంగళవారం విరించి ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఈవో డాక్టర్ సాయి రవి శంకర్ మాట్లాడుతూ... 34 సంవత్సరాల గర్భిణికి ఓ కార్పొరేట్ ఆస్పత్రి వైద్యం చేయలేమని ఆమె భర్త విరించి ఆస్పత్రిలో చేర్చారు. 22 వారల గర్భంతో ఉన్న డి.సునీత భర్తతో బైక్‌పై వెళ్తుంటే ప్రమాదానికి గురి కావడంతో సమస్య తలెత్తింది.. దీంతో ఆమెను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించాల్సి రావడం భారీ ఖర్చుతో కూడకున్న పని కావడంతో బాధిత కుటుంబ సభ్యులు లతామాఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ మాధవీ లతను సంప్రదించారు. ఆమె సిఫారసుతో విరించిలో చేరిన సునీతకు ఇక్కడి వైద్యులు తల్లి, బిడ్డలను క్షేమంగా, ఆరోగ్యంగా ఉంచగలిగారు. క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు, జనరల్ ఫిజీషియన్ న్యూరో సర్జన్ తదితరులు కడుపులో చిన్నారిని, తల్లిని కాపాడగలిగారని ఆయన తెలిపారు.

దేవర సుచరితకు నివాళి

బంజారాహిల్స్: విశ్రాంత ఐఏఎస్ అధికారి దేవర సుబ్బారావు సతీమణి దేవర సుచరిత ఇటీవల పరమపదించారు. ఆమె మృతికి శ్రద్ధాంజలి ఘటిస్తూ బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చిలో సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి రాజగోపాల్‌తో పాటు చందానగర్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రాజ్‌కుమార్, పలు విభాగాల అధికారులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. నాగార్జున యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా, విభాగాధిపతిగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో షారోన్‌ఫుల్ గాస్పెల్ చర్చి పాస్టర్ ప్రభుదాస్, పారిశ్రామికవేత్తలు పెంచల్ రెడ్డి, పవన్, దేవర సవినయ్, దేవర సతీష్, దేవర సుమంత్, నీలిమ, మేడిత రాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అధికారులు

కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షురాళ్ల నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న శంభుల ఉషశ్రీ

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాళ్లను నియమించారు. బంజారాహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మాధురి, హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షురాలిగా బి. కమల, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షురాలిగా కన్యాకుమారి, ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షురాలిగా పార్వతి, బి బ్లాక్ ప్రెసిడెంట్‌గా ఎ. ప్రియాంక, ఖైరతాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షురాలుగా పి.విజయలక్ష్మి, జనరల్ సెక్రటరీగా శ్రీదేవిలను నియమించారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ నియామక పత్రాలను వారికి అందజేశారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు ముఖ్య అతిథిగా విచ్చేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఖైరతాబాద్: ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం ఖైరతాబాద్‌లోని షాదాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినులకు బేగంపేట ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ జి.శంకర్‌రాజు విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ ప్రాముఖ్యత, రహదారిలో వెళ్తున్నప్పుడు బ్లూటూత్ (హ్యాండ్‌ఫ్రీ హెడ్‌సెట్‌లు) వాడకుండా ఉండటం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఏసీపీ పీపీటీ ప్రజెంటేషన్ చేసి చూపించారు. సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ బాలగోపాల్, కళాశాల చైర్మన్ షా ఆలం రసూల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సీట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

లిబర్టీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల కేటాయింపులో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కొమురం భీమ్ స్మారక సమితి రాష్ట్ర అధ్యక్షుడు రుద్రశంకర్ కోరారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉదయపూర్ డిక్లరేషన్‌కు కట్టుబడి ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బీసీలకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలన్నారు. ఈ ప్రకారం తెలంగాణలో 34 అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని విన్నవించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించారని గల్ఫ్ కార్మికుల కోసం పోరాటం చేస్తున్నారని రుద్ర శంకర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు సముచిత స్థానం దక్కుతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు.

సట్టా ఆడుతున్న వ్యక్తికి జైలుశిక్ష



గడ్డా రాఘవ

వెంగళరావునగర్: సట్టా ఆడుతున్న వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడలో నివసించే గడ్డా రాఘవ ప్రైవేటు జామ్ చేస్తుంటాడు. గుట్టు చప్పుడు కాకుండా యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాల్లో సట్టా ఆటను కూడా ఆటుతుంటాడు. విషయం తెలుసుకున్న మధురానగర్ పోలీసులు బుధవారం అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. 14వ అదనపు చీఫ్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ కన్హయ్య లాల్ కేసును విచారించి రాఘవకు రెండురోజుల జైలు శిక్ష, రూ. 500 జరిమానా విధించారు.

ఆర్టీసీ బస్సు రూటు పునరుద్ధరణ

అంబర్‌పేట: డివిజన్ నుంచి రాకపోకలు సాగించే సామాన్యులకు ఎట్టకేలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరించడం హర్షనీయమని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం ఉప్పల్ ఆర్టీసీ డిపో అధికారుల సహకారంతో నిలిచిపోయిన బస్సు ట్రిప్పును ప్రారంభించామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కోవిడ్‌కు ముందు పటేల్‌నగర్ నుంచి నడిచిన బస్సును నిలిపేశారన్నారు. పలు దఫాలుగా ఉప్పల్ డిపో అధికారులకు సమస్యను దృష్టికి తీసుకురావడంతో రూట్‌నెంబర్ 113ఎం ను పునరుద్ధరించడం హర్షణీయమన్నారు. డిపో మేనేజర్ శ్రీనివాస్, డ్రైవర్ సిద్ధార్థరెడ్డి, కండక్టర్ హేమలతను కార్పొరేటర్ సత్కరించారు.

2న డబుల్ ఇళ్ల పంపిణీ: మాగంటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

శ్రీనగర్‌కాలనీ: తమ సొంత ఇంటి కల నెరవేరుతున్నందుకు, తమ ఇంటిలో తాము ఉండబోతున్నామన్న నిజాన్ని తెలుసుకొని సంబరపడి ఆనంద భాష్పాలతో తమ సంతోషాన్ని పంచుకున్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని డివిజన్లకు సంబంధించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఆమోదం పొందిన లబ్ధిదారులతో సమావేశాన్ని నిర్వహించారు. గతవారం ప్రభుత్వం నిర్వహించిన లక్కీ డిప్ ద్వారా నియోజకవర్గంలో ఎన్నికైన 500 మంది డబుల్‌బెడ్ ఇళ్ల లబ్ధిదారుల పేర్లను అందరి సమక్షంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి నిరుపేద కుటుంబానికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల సాకారాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నిజంచేసి వారికి ఇంటి తాళాలను సెప్టెంబర్ 2న అందిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇళ్లను అందిస్తామని స్పష్టం చేశారు. 6 డివిజన్లలోని 500 మంది ఇళ్ల లబ్ధిదారులు తమ ఆనందాన్ని ఎమ్మెల్యే మాగంటితో పంచుకొని సంబరపడ్డారు.

కమిషనర్ ఆదేశంతో చక చకా పనులు!



కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో పాండ్‌ను శుభ్రం చేస్తున్న సిబ్బంది

వెంకటేశ్వరకాలనీ: నాలుగు రోజుల క్రితం జీహెచ్ఎంసీ కమిషనర్ మూడు గంటల పాటు కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో తిరగడంతో పాటు పలు సమస్యలను గుర్తించారు. ఇందులో భాగంగా సినీ నటుడు బాలకృష్ణ నివాసం వైపు వాక్‌వేలో ఉన్న వాటర్ ఫౌంటెయిన్‌ను గుర్తించారు. ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో ఎంతో మందికి ఆహ్లాదాన్ని పంచాల్సిన ఈ ఈ ఫౌంటెయిన్ పాండ్ నిర్లక్ష్యానికి గురైందని గుర్తించి వెంటనే దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో సిబ్బంది బుధవారం ఈ పాండ్‌లో ఉన్న చెత్తా చెదారంతో పాటు బురద వ్యర్థాలను పూర్తిగా తొలగించారు. దీనికి ఉన్న పైప్‌లైన్ వ్యవస్థను, లైటింగ్ వ్యవస్థను పునరుద్ధరించి బాగుచేసేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ఆ దిశగా పనులు చేస్తున్నారు.

వంట గ్యాస్ ధర తగ్గింపుపై హర్షం



ఆలపాటి లక్ష్మీనారాయణ

బంజారాహిల్స్: వంట గ్యాస్ ధరలను భారీగా తగ్గించిన ప్రధాని నరేంద్ర మోడీ దేశ మహిళల పట్ల మరోసారి తన సోదర భావాన్ని చాటుకున్నారని బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం సీనియర్ నేత ఆలపాటి లక్ష్మీనారాయణ అన్నారు. రాఖీ పౌర్ణమి కానుకగా వంట గ్యాస్ సిలిండర్ల ధర తగ్గించడం పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపశమనం లభిస్తుందన్నారు. సవరించిన ధరలు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయని వెల్లడించారు. మరోవైపు కేంద్ర మంత్రి అమిత్‌షా తెలంగాణ డిక్లరేషన్‌తో ఇక్కడి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది అన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు

రహమత్‌నగర్: ఇతర మతాల ప్రజల మనోభావాలు భంగం కలిగించకుండా, ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు సూచించారు. గణేష్ నవరాత్రులు, మీలాద్-ఉన్-నబీ ఉత్సవాలను పురస్కరించుకుని బోరబండ జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... ఉత్సవాలప్పుడు నిర్వాహకులు సమన్వయం పాటించాలని సూచించారు. ఇతర మతాల ప్రార్థన మందిరాల వద్ద రెచ్చగొట్టే నినాదాలు చేయవద్దని హెచ్చరించారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటన జరిగిన నిర్వాహకులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్, ఎస్ఐలు మనోజ్, తుల్జారాం, సప్నారెడ్డి, భూపాల్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

న్యూసెన్స్ కేసులో ఇద్దరికి జైలు



నిందితులు ఎస్.అశోక్‌కుమార్, కట్టాల రాజు

బంజారాహిల్స్: యువతి అనుమతి లేకుండానే ఆమెకు వాట్సాప్ కాల్ చేస్తూ ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ, అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వ్యక్తిగత జీవితానికి భంగం కలిగిస్తున్న నిందితుడికి న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఫిలింనగర్‌లోని దుర్గా భవానీనగర్ బస్తీకి చెందిన ఆటో డ్రైవర్ ఎస్. అశోక్‌కుమార్(22) కొంత కాలంగా ఓ యువతిని ఆమె ప్రమేయం లేకుండానే వేధింపులకు గురి చేస్తున్నాడు. ఆమె కదిలికలను గమనిస్తూ న్యూసెన్స్‌కు పాల్పడటంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై ఈ పెట్టి కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా అశోక్ కుమార్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

మరో ఘటనలో...

ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీకి చెందిన కట్టాల రాజు(27) మద్యం మత్తులో కుటుంబ సభ్యులను తీవ్ర వేదింపులకు గురి చేస్తున్నాడు. మద్యం సేవించిన మత్తులోనే బాత్‌రూమ్‌లోకి వెళ్లి లోపలి నుంచి గడియపెట్టుకొని కుటుంబ సభ్యులను బెదిరించడమే కాకుండా ఇష్టానుసారంగా తిట్టాడు. న్యూసెన్స్ చేస్తున్న నిందితుడిపై బాధితుడు ఇచ్చిన పిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు రాజుపై ఈ పెట్టి కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అదృశ్యం



సాయికుమార్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో హౌస్‌కీపింగ్‌లో పని చేస్తున్న సాయికుమార్(46) అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సాయికుమార్ యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్ఎన్.నగర్‌లో ఉంటూ బసవతారకం ఆస్పత్రిలో కొంత కాలంగా పని చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీన ఎప్పటిలాగే ఉదయం డ్యూటీకి వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లాడని ఆస్పత్రిలో ఆరా తీయగా సిబ్బంది చెప్పారు. అయితే ఇంటికి రాకపోవడంతో పాటు స్వగ్రామానికి కూడా వెళ్లకపోవడంతో అన్ని ప్రాంతాలు గాలించినా ఫలితం లేకపోయింది. తన సోదరుడు కనిపించడం లేదంటూ విజయశంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని సాయికుమార్ ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 86869 55652లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

ముగ్గురు ఆకతాయిలకు జైలు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ముగ్గురు ఆకతాయిలకు జైలు శిక్ష విధించారు. వివరాలివీ... ఈ నెల 28న రాజ్‌నగర్ మాతా టెంపుల్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా ముగ్గురు యువకులు గంజాయి మత్తులో ముగ్గురు యువకులు హంగామా చేస్తూ కర్రలతో వచ్చి పోయే వారిని బెదిరిస్తున్నారు. పోలీసులు వారిని వారించేందుకు ప్రయత్నించిన పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. వారు రాజ్‌కుమార్(23), డెలివరీ బాయ్, ఎం.భాస్కర్(24), డెకరేషన్ బాయ్, కె.అజయ్(20) స్టూడెంట్‌గా గుర్తించారు. వీరంతా ఖైరతాబాద్ బస్తీలకు చెందిన వారు. వీరిపై కేసు నమదు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి నిందితులు ముగ్గురికి 5 రోజుల పాటు జైలు శిక్షను విధించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై మద్యం బాటిల్స్‌తో దాడి



గాయపడ్డ సాయికృష్ణ

వెంగళరావునగర్: టీ తాగుతున్న యువకుడిపై ఇరువురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలివీ... వెంగళరావునగర్‌కాలనీలో నివసించే సాయికృష్ణ ఆ కాలనీకి సమీపంలో ఉన్న సాయిబాబా ఆలయం వద్ద మంగళవారం రాత్రి టీ తాగుతున్నాడు. ఈ క్రమంలో ఇద్దరు వచ్చి మద్యం బాటిల్స్‌తో అతనిపై దాడి చేసి పారిపోయారు. ఈ సంఘటనలో సాయికృష్ణ తలకు బలమైన గాయాలయ్యాయి. సాయికృష్ణ సోదరుడు సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలంలో ప్రసాద్ అనే వ్యక్తి ఉన్నాడని, కాగా తన సోదరుడిపై అహ్మద్ ఆలీ, నాయుడు అనే వ్యక్తులు దాడి చేసి ఉంటారని ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

క్లుప్తంగా...



బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న భూమన, ఈవో ధర్మారెడ్డి తదితరులు

18 నుంచి శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

తిరుమల: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్లను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి బుధవారం తిరుమల ఆలయం ఎదుట ఆవిష్కరించారు. అనంతరం భూమన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది అధికమాసం కారణంగా సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని చెప్పారు. సెప్టెంబర్ 18న ధ్వజారోహణం సందర్భంగా సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవేంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు సంతృప్తికరంగా వాహన సేవలతో పాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాల కోసం సిఫారసు లేఖలు స్వీకరించబోమన్నారు. సెప్టెంబరు 22న గరుడ సేవ, 23న స్వర్ణరథం, 25న రథోత్సవం, 26న చక్రస్నానం నిర్వహిస్తామని తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా ఆరుగురు ప్రమాణ స్వీకారం

తిరుమల: టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా బుధవారం ఆరుగురు శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా, వై.సీతారామిరెడ్డి, బాలసుబ్రమణియన్ పళనిస్వామి, ఆర్.వెంకటసుబ్బారెడ్డి, సిద్దవటం యానాదయ్య, సిద్ధా వీరవెంకట సుధీర్ కుమార్ బోర్డు సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. వీరితో శ్రీవారి ఆలయంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ప్రమాణ స్వీకారం చేయించారు.

4 నుంచి వ్యవసాయంపై జీ-20 వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: 'వాతావరణ పరిస్థితులను తట్టుకునే వ్యవసాయం'పై సెప్టెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు జీ-20 టెక్నికల్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఐకార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ వర్క్‌షాప్‌ను శంషాబాద్ సమీపంలోని నోవాటెల్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

పొత్తులు లేకుండా పోరాడే ధైర్యముందా?

చంద్రబాబుకు సజ్జల సవాల్

- ప్రధాని మోదీని తిట్టిన నోటితోనే పొగడ్తలా?
- కాళ్లు పట్టుకోగలిగే నేర్పు చంద్రబాబుకే సొంతం
- ప్రభుత్వ వ్యతిరేక ఓటే లేదు.. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు పొత్తులు లేకుండా పోటీ చేయాలనే ఆలోచన చేసే ధైర్యం కూడా లేదని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు బీజేపీతో పొత్తు కోసం నడ్డాతో వంగివంగి నంగినంగిగా మాట్లాడారని చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు దూషించిన నోటితోనే ఇప్పుడు పొగుడుతున్నారని గుర్తు చేశారు. ఎవరినైనా సరే తిట్టిన గంటలోనే కాళ్లు పట్టుకోగలిగే నేర్పు ఒక్క చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సజ్జల బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు.

ప్యాకేజీ చాలని.. సన్మానాలు నిర్వహించి

టీడీపీపై పూర్తిగా నమ్మకం కోల్పోయిన కార్యకర్తలను కాపాడుకోవడానికే చంద్రబాబు పొత్తుల కోసం పాకులాడుతున్నారు. పవన్ కల్యాణ్‌తో కలిసి పోటీ చేసేందుకు సిద్ధమైన చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో పొత్తుల కోసం తహతహలాడుతున్నారు. కమీషన్ల దాహంతో పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడం కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు 2016లో కేంద్రానికి తాకట్టు పెట్టారు. హోదా కంటే ప్యాకేజీతోనే అధికంగా ప్రయోజనం చేకూరుతుందని చంద్రబాబు సంబరాలు చేసుకున్నారు. నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని కూడా సన్మానించారు. ప్రత్యేక హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకొచ్చామని, అంతకు మించి బీజేపీతో విభేదాలు లేవంటూ ఇప్పుడు పచ్చి అబద్ధాలు వల్లిస్తున్నారు.

బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ..

ఏపీలో 175 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులే లేని టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారంటూ చంద్రబాబు జోకులు వేస్తున్నారు. ఆయన వ్యవహార శైలి బఫూన్‌కు ఎక్కువ.. జోకర్‌కు తక్కువ. జనసేన, బీజేపీతో పొత్తు ఉండదని బాబు ప్రకటిస్తే లోకేశ్ పాదయాత్రకు వస్తున్న అరకొర కార్యకర్తలు కూడా మొహం చాటేయడం ఖాయం.

వ్యతిరేక ఓటు ఉంటే కదా ఏకం చేయడానికి?

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ గత 50 నెలలుగా అందిస్తున్న సుపరిపాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్, తిరుపతి లోక్‌సభ.. బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రికార్డు స్థాయి విజయాలు సాధించడమే అందుకు నిదర్శనం. వైఎస్సార్‌సీపీకి 70 శాతం మంది ప్రజలు మద్దతు పలుకుతున్నారు. వ్యతిరేకంగా ఉన్నాయని ప్రతిపక్షాలు భావిస్తున్న 30 శాతం ఓట్లు ఏకమైనా ఒరిగేదేముంది? 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయభేరి మోగించడం ఖాయం. 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు.

ఎన్టీఆర్ ఆత్మకూ వెన్నుపోటు..

ఎన్టీఆర్ అగ్నిసాక్షిగా లక్ష్మీ పార్వతిని వివాహం చేసుకున్నారని, 1994 ఎన్నికల్లో వారిద్దరూ కలిసి ప్రచారం చేసి టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని, తద్వారా వారి వివాహాన్ని ప్రజలు హర్షించారని సజ్జల గుర్తు చేశారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని, టీడీపీని హస్తగతం చేసుకున్న చంద్రబాబుకు ఇప్పటికీ సొంత గుర్తింపు లేదన్నారు. అవసరమైనప్పుడల్లా ఎన్టీఆర్ బొమ్మను వాడుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమానికి ఆయన భార్య లక్ష్మీపార్వతిని ఆహ్వానించకుండా ఎన్టీఆర్ ఆత్మకు మరోసారి వెన్నుపోటు పొడిచి క్షోభ పెట్టారని మండిపడ్డారు. బీజేపీలోకి చంద్రబాబు పంపిన ఏజెంట్లతోపాటు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి టీడీపీ ఏజెంట్‌లా పని చేస్తున్నారని దుయ్యబట్టారు.

రాష్ట్ర రక్షణకు మేధావులు బీజేపీలోకి రావాలి..

▶ మొదటి పేజీ తరువాయి

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రోజువారీ ఖర్చుల కోసం కూడా.. భూముల వేలం ద్వారా డబ్బు సమకూర్చుకుంటోన్న దుస్థితి నెలకొందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక అవసరాల కోసం ఓఆర్ఆర్ రింగ్ రోడ్డును తాకట్టు పెట్టడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం తెలంగాణలోని విద్యావంతులు, మేధావులు బీజేపీలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని ఆయన పిలుపునిచ్చారు.

ఏ బాధ్యతనిచ్చినా స్వీకరిస్తాం

బీజేపీ అగ్రనేతలు వాజ్‌పేయి, అద్వానీ, మురళీ మనోహర్‌జోషి వంటి పెద్దల ప్రభావం తనపై ఉందని పార్టీలో చేరిన డాక్టర్ వికాస్ తెలిపారు. తాను, తన భార్య డా.దీప ప్రజలకు మరింత సేవ చేసేందుకు బీజేపీలో చేరామని, రాబోయే రోజుల్లో అప్పగించే బాధ్యతలను మనస్ఫూర్తిగా నిర్వర్తిస్తామన్నారు.

– డాక్టర్ వికాస్

ఎన్నికలెప్పుడొచ్చినా బీజేపీ గెలుపు తథ్యం

తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ గెలుపు తథ్యమని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనపట్ల ప్రజలు పూర్తిగా విసిగిపోయారనీ, రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలే ఇందుకు నిదర్శనమన్నారు. కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో రామరాజ్యం రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. డా.వికాస్, దీపల చేరికతో రాజన్న సిరిసిల్లలోని రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు ఖాయమన్నారు.

– బండి సంజయ్

విద్యావంతులు రాజకీయాల్లోకి రావాలి

దేశంలో మోదీ ప్రభుత్వ సుపరిపాలనకు ఆకర్షితులై, ప్రజలకు మరింత సేవ చేయాలనే సంకల్పంతో డాక్టర్ వికాస్, దీప దంపతులు బీజేపీలో చేరడాన్ని స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్ అన్నారు. రాష్ట్రంలోని విద్యావంతులు ముఖ్యంగా యువత రాజకీయ రంగంలోకి రావాలని విలువలతో కూడిన రాజకీయాలు, జవాబుదారీతనంతో కూడిన రాజకీయాలు వారితోనే సాధ్యమన్నారు.

– డా. కె. లక్ష్మణ్

ఉత్తర తెలంగాణలో బీజేపీ బలోపేతం

వేములవాడ ప్రాంతంలో సామాజిక, సేవా కార్యక్రమాలను చేపడుతున్న డాక్టర్ దీప, వికాస్ దంపతుల చేరికతో ఉత్తర తెలంగాణ ప్రాంతంలో బీజేపీ మరింత బలోపేతమవుతుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు.

– ఎంపీ అర్వింద్

సోలాపూర్‌లో మార్కండేయ రథయాత్ర

మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ హాజరు



సోలాపూర్‌లో స్థానిక నేతలతో హరీశ్, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని సోలాపూర్‌లో అత్యంత వైభవంగా జరిగిన మార్కండేయ రథోత్సవంలో రాష్ట్ర మంత్రులు టి.హరీశ్‌రావు, మహమూద్ అలీ పాల్గొన్నారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఇద్దరు మంత్రులతో పాటు మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ బుధవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో సోలాపూర్‌కు వెళ్లారు. స్థానిక పద్మశాలీ సమాజ్ ఆధ్వర్యంలో జరిగిన మార్కండేయ రథోత్సవంలో బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులతో కలిసి మంత్రులు పాల్గొన్నారు. వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ ఆలయంలో ప్రతి రాఖీ పౌర్ణమి సందర్భంగా రథయాత్ర నిర్వహించడం ఆనవాయితీ. కాగా ఈ రథోత్సవంలో పాల్గొనేందుకు వెళ్లిన మంత్రులకు స్థానిక మహిళలు, బీఆర్ఎస్ నేతలు స్వాగతం పలికి రాఖీలు కట్టారు. మార్కండేయ ఆలయ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆలయ నిర్వాహకులకు మంత్రి హరీశ్‌రావు రూ.కోటి విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.

సోలాపూర్ బహిరంగ సభాస్థలి పరిశీలన

సోలాపూర్‌లో త్వరలో జరిగే బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాల్గొంటారు. సభ నిర్వహణ కోసం అనువైన స్థలాన్ని మంత్రి హరీశ్‌రావు పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. బాల్‌కోటి మైదానం, ఈద్గా మైదానాలను పరిశీలించిన నేతలు కేసీఆర్‌తో చర్చించిన తర్వాత వేదికను ఖరారు చేస్తామని వెల్లడించారు.

చవితి తర్వాతే బీజేపీ బస్సుయాత్రలు

సాక్షి, హైదరాబాద్: వినాయక చవితి తర్వాతే బస్సు యాత్రలు నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పండుగ ముగియగానే భద్రాచలం శ్రీరాములవారి ఆలయం, బాసరలోని శ్రీసరస్వతీ దేవాలయం, ఆలంపూర్ శ్రీజోగుళాంబ గుడి నుంచి రథయాత్రలు(బస్సుయాత్ర)ప్రారంభించాలని నిర్ణయించినట్టు తెలిసింది. మూడు ప్రాంతాల నుంచి 18 రోజులపాటు 60–70 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ యాత్రలు నిర్వహించాలని భావిస్తున్నారు. సెప్టెంబర్ 7 తర్వాత రథయాత్రలు మొదలుపెట్టి 17న హైదరాబాద్ స్టేట్ విమోచన వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ప్రధాని మోదీ పాల్గొనేలా భారీ బహిరంగసభ నిర్వహించాలని తొలుత భావించారు. అయితే వినాయక చవితి, ఇతర కారణాల వల్ల సెప్టెంబర్ 20 తర్వాత ఈ యాత్రలు చేపడితే బాగుంటుందనే అభిప్రాయానికి వచ్చారు. బస్సు యాత్రల ముగింపు సందర్భంగా హైదరాబాద్‌లో బహిరంగసభ ద్వారా ఏర్పాటు చేసే అవకాశం ఉందని పార్టీవర్గాల సమాచారం.

మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



మంత్రి పట్నం మహేందర్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న కమిషనర్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య, జాయింట్ డైరెక్టర్ జగన్, ఈఈ వెంకటేష్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవల రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సమాచార, ప్రజా సంబంధాలు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని తనకు కేటాయించిన చాంబర్‌లో మహేందర్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. సచివాలయంలోని మొదటి అంతస్తులో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సమాచార శాఖ కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, కృష్ణారావు, బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నగర వార్తలు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

హిమాయత్‌నగర్: తమకు 30 శాతం పీఆర్‌సీ వర్తింపచేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉత్తర్వులు జారీ చేయడం చాలా ఆనందంగా ఉందని తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగుల సంఘం తెలిపింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తామంతా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈమేరకు బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు అభినయ శ్రీనివాస్ మాట్లాడుతూ... రాష్ట్రం ఏర్పడ్డాక కవులు, కళాకారులను గుర్తించి సముచిత న్యాయం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. తమకు ఉద్యోగాలు ఇచ్చిన సమయంలో రూ.24, 514 జీతం ఉంటే ప్రస్తుతం పెంచిన 30 శాతం పీఆర్‌ఎస్‌తో రూ.31, 861 జీతం అందుకోనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తాము ఎల్లప్పుడూ కృషి చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యస్‌పాల్, ఉపాధ్యక్షులు కోదారి శ్రీను, అంబటి వెంకన్న. కోశాధికారి చంద్రప్రకాష్, మహిళా కార్యదర్శి జలజ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 2న 'వర్షోత్సవం-2'

పంజగుట్ట: ధ్రువపథ్ గురుకులమ్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లాంగ్వేజెస్, కల్చర్ సహకారంతో సెప్టెంబర్ 2వ తేదీన కింగ్‌కోఠి లోని భారతీయవిద్యాభవన్‌లో 'వర్షోత్సవం–2' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు విజయ రామన్ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని సంగీత ద్వయం గాయకులు సంజీవ్ ఝా, మనీష్ కుమార్, అడ్వైజర్ ప్రీతితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు గంటల పాటు సాగే ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత కళాకారులచే గానకచేరీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ధ్రుపద్‌బంధు గాణద్వయం సంజీవ్ ఝా, మనీష్ కుమార్ గానం, తరువాత అభిమాన్ కౌశల్ సోలో తబలా వాయిద్యం ఉంటుందని, చివరగా సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత హిందుస్థానీ ఖయాల్ సంగీత గాయకులు పండిట్ వెంకటేశ్ కుమార్ గానం ఉంటుందన్నారు. సంగీత ప్రియులు పెద్దెత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కిమ్స్-సన్‌షైన్‌లో అరుదైన శస్త్ర చికిత్స

రాంగోపాల్‌పేట్: ఆస్టియోకాండ్రల్ గాయం కారణంగా యాంకిల్ నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి సికింద్రాబాద్ కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ ట్రామా వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ చికిత్స దేశంలో మూడవది కాగా రెండు తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి కావడం గమనార్హం. బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్థోపెడిక్ ట్రామా సర్జన్ డాక్టర్ కమలాకర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఆదర్శ్ అన్నపురెడ్డి వివరాలు వెల్లడించారు.

యాంకిల్ భాగంలో కార్టిలేజ్ గాయాలైనప్పుడు జాయింట్‌లో ఒత్తిడి కారణంగా పగుళ్లు మానక జాయింట్‌లోని ఫ్లూయిడ్స్ కింద ఎముకలోకి ప్రవేశించి అక్కడ ఎముక దెబ్బతినేలా చేస్తుందని దీనివల్ల కార్టిలేజ్ కూడా దెబ్బతిని తీవ్రమైన నొప్పి వస్తుందని ఇలాంటి వాటిని ఏ పద్ధతిలో సరిచేయడానికి వీలుండదని చెప్పారు. నగరానికి చెందిన ఓ 45 ఏళ్ల వ్యక్తి ఏడాది నుంచి యాంకిల్ నొప్పితో బాధపడుతూ సికింద్రాబాద్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులను సంప్రదించినట్లు చెప్పారు. ఇతనికి స్వీడన్‌కు చెందిన ప్రముఖ వైద్యులు ప్రొఫెసర్ లీఫ్ రిడ్ నేతృత్వంలో బుధవారం ఉదయం తమ వైద్య బృందం ఎపిసీలర్ జాజింట్ రీసర్ఫేసింగ్ పద్ధతిలో యాంకిల్‌కు ప్రత్యేక ఇంప్లాంట్‌ను అమర్చి అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. పాడైపోయిన కణజాలంను తొలగించి ఇంప్లాంట్ అందులో సరిగ్గా అమరిపోయే విధంగా ఎపిగైడ్ ఉపయోగించి కచ్చితత్వంతో అమరుస్తారని వివరించారు. స్వీడన్‌ను ఇదే రోగికి సరిపడేలా ఎపిసీలర్‌ను తయారు చేసి తెప్పించి అమర్చినట్లు చెప్పారు. ఇంత వరకు మన దేశంలో కేవలం కొచ్చి, బెంగుళూరులో మాత్రమే నిర్వహించగా ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటి కేసని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీవోవో సౌరబ్ గుప్తా, ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హర్ష, డాక్టర్ శమష్టీ, డాక్టర్ వంశీ, డాక్టర్ హరి, డాక్టర్ ఖుబ్‌చంద్, డాక్టర్ రఘు, రమేష్ పాల్గొన్నారు.



శస్త్ర చికిత్స వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

మూసీ నీటిలో పెరుగుతున్న భార లోహాల శాతం



రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల ఆవేదన

సనత్‌నగర్: భార లోహాలు ఆహారంలో భాగమై ఆరోగ్యానికి పెనుముప్పుగా మారాయని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మూసీనదిలో భార లోహాల శాతం పెరుగుతుందని అధ్యయనాల్లో తేలిందన్నారు. డాక్టర్ సక్సేనా ఇంటిగ్రేటివ్ మెడిసిన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో బుధవారం 'టాక్సిసిటీ ఇన్ ద సిటీ వీ ఎడిషన్' అనే అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో డాక్టర్ ప్రవీణ్ సక్సేనా వైద్య, ఆరోగ్య, ఆహార నిపుణులైన చక్రపాణి, దొంతి నర్సింహారెడ్డి, దినేష్‌కుమార్, డాక్టర్ బాబురావు, సుధ హాజరై ప్రసంగించారు. గత ఐదేళ్లలో భారీ లోహాలతో దుష్ప్రభావం విపరీతంగా పెరిగిందని మనకు తెలియకుండా శరీరంలోకి ప్రవేశిస్తున్న భార లోహాల విషయంలో అప్రమత్తత అవసరమని హెచ్చరించారు. ముఖ్యంగా మూసీలో ఉన్న భారీ లోహాలు నీరు, ఆహారం వంటి వివిధ రూపాల్లో శరీరంలోకి ప్రవేశిస్తున్నాయని అధ్యయనాల్లో తేలిందన్నారు. దీనిపై వైద్యులు కూడా స్పృహ కలిగి ఉండాలన్నారు. భార లోహాల ప్రభావంతో అనారోగ్యానికి గురై తమ వద్దకు రోగి వచ్చినప్పుడు కేవలం వైద్యానికే పరిమితం కాకుండా ఎక్కడ నీళ్లు తాగారు, ఎక్కడ ఉంటున్నారు అనే వివరాలను తెలియజేసి వైద్యాధికారులను కూడా అప్రమత్తం చేయడంలో కీలకంగా వ్యవహరించాలన్నారు. 1930 నుంచి 81,000లను పైగా సింథటిక్ రసాయనాలను పరిశ్రమలు తయారు చేస్తున్నాయంటే ఆ రసాయనాలతో ఆహారం ఏ విధంగా విషపూరితంగా మారుతుందో అర్థం చేసుకోవాలన్నారు.

తెలంగాణ జిల్లాలకు మహనీయుల పేర్లు పెట్టాలి

- సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ డిమాండ్



నినదిస్తున్న అసోసియేషన్ సభ్యులు

హిమాయత్‌నగర్: పోరాటయోధులు, సామాజిక న్యాయ శిఖరం కేంద్ర మాజీ మంత్రి పి.శివశంకర్, దళిత నేత కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి, తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ, బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేర్లు రాష్ట్రంలోని పలు జిల్లాలకు పెట్టాలని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాస్ రావు, తెలుగుసేన రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.సుశ్మిత డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పి.శివశంకర్ కేంద్ర న్యాయశాఖ మంత్రిగా అనేక సంస్కరణలు తెచ్చారని, దళిత ఆశాజ్యోతి జి.వెంకటస్వామి కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటలు చేశారని, తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ రజాకారుల దౌర్జన్యాలను అడ్డుకున్నారన్నారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణ మహాపోరాట వీరుడని తెలంగాణ ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాట యోధుల పేర్లు జిల్లాలకు పెట్టి, గద్దర్ కాంస్య విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ సామాజిక న్యాయ సాధన సమితి కార్యదర్శి విజయా దేవి, తెలుగుసేన బీసీ పోరాట సమితి నాయకులు సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఆత్మాభిమానం కలిగిన గొప్ప నటి జమున

చిక్కడపల్లి: ప్రముఖ నటి జమున ఆత్మాభిమానం, ఆత్మగౌరవం కలిగిన గొప్ప వ్యక్తి అని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. తనకు పద్మ అవార్డుల కంటే ప్రజా నటి అనే బిరుదే నచ్చుతుందని చెప్పేవారని గుర్తు చేశారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభ ప్రధాన వేదిక పై సుజారమణ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నటి జమున 87వ జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వంశీ రామరాజు మాట్లాడుతూ జమునతో కలిసి సినీ ప్రయాణం చేసిన సుజారమణను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంఖ్యాశాస్త్రవేత్త దైవజ్ఞశర్మ, శైలజ సుంకరపల్లి పాల్గొన్నారు. జమున సినీ పాటలను సూజా, బైరి శ్రీనివాస్, యశస్వి, ఇందునయన తదితరులు మధురంగా ఆలపించారు.



సుజా రమణను సత్కరిస్తున్న రామరాజు

పార్ట్‌టైమ్ టీచర్లను క్రమబద్ధీకరించాలి



ఉన్నత విద్యా మండలి వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నాంపల్లి: పార్ట్‌టైమ్ టీచర్లను క్రమబద్ధీకరించాలని ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైమ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోమేశ్వర్ బోనకుర్తి డిమాండ్ చేశారు .రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైమ్ టీచర్లందరూ బుధవారం తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట కేసీఆర్ ముఖ మాస్కులను ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆరు నెలల వేతనాలతో అర్ధాకలి బతుకులతో జీవితాలను వెల్లదీస్తున్నా పట్టించుకునే నాథులే లేదన్నారు. అన్ని రకాల అర్హతలు ఉండి కేవలం పార్ట్ టైమ్ అనే పేరుతో తమకు ఆరు నెలల వేతనాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పార్ట్ టైమ్ టీచర్లందరిని క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆరుట్ల జానకీ రెడ్డి, డాక్టర్ జూలు నాగేశ్వర్, డాక్టర్ పరశురాం పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందే..

పంజగుట్ట: 'తెలంగాణ ఉద్యమ సమయంలో 20 రోజులు చంచల్‌గూడ జైలులో ఉన్నాం. 2001 నుండి ఇప్పటి వరకు 23 ఏళ్లగా ముఖ్యమంత్రి కేసీఆర్ వెన్నెంటే ఉన్నాం. తెలంగాణ ఉద్యమం కోసం మా జీవితం, డబ్బు, కుటుంబం వదులుకుని పనిచేశాం . ఇప్పటివరకు సరైన ప్రాధాన్యం లభించలేదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అవకాశం కల్పించకపోతే పార్టీని వీడేందుకు కూడా సిద్ధమే' అని ఉప్పల్ నియోజవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు నందికొండ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బేతి సుభాష్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఎక్కడ పాల్గొన్నారో చెప్పాలని, అతనిపై ఒక్క కేసైనా నమోదైందా అని ప్రశ్నించారు. ఒకసారి ఓడిపోయినా బేతి సుభాష్ రెడ్డికి నియోజకవర్గం ఇన్‌చార్జి పదవి ఇచ్చి, మరోమారు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, అయినా ఇప్పుడు పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడడం దారుణమన్నారు. తెలంగాణ ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ బేతి సుభాష్‌రెడ్డి తీరు గర్హనీయమన్నారు. ఉద్యమకారుడు నిర్ధం భాస్కర్ గౌడ్, దోసల శంకర్, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



రంగారెడ్డి జిల్లా కోర్టులు: సెప్టెంబర్ 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర తెలిపారు. బుధవారం ఆమె ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లోక్ అదాలత్‌లలో కేసు రాజీకి అవకాశం ఉంటుందని, గత మూడేళ్లగా కేసుల రాజీ విషయంలో రంగారెడ్డి జిల్లా తెలంగాణలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. 9న జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే లోక్‌అదాలత్‌లో కక్షిదారులకు ఇబ్బంది కలగకుండా..సులభంగా పరిష్కారం లభించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కాగా లోక్‌అదాలత్ వాయిదా పడిందని కొన్ని సామజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆమె పేర్కొన్నారు. షెడ్యూలు ప్రకారమే లోక్ అదాలత్ జరుగుతందని చెప్పారు.



రాకింగ్ మామ



ఈ రోజు శ్రావణమాసం, పున్నమి రోజు. రక్షాబంధన్ వేడుక చేసుకుంటున్నాం. ఆడపడుచులు పుట్టింటికి వస్తారు. అన్నదమ్ముల శ్రేయస్సు కోరుతూ అక్కచెల్లెళ్లు భగవంతుడికి పూజ చేసి, తీపి వంటకాలను నివేదన చేస్తారు. పూజలో ఉంచిన రక్షాబంధనాన్ని అన్నదమ్ముల ముంజేతికి కట్టి 'ఇది నీకు రక్ష, నువ్వు నాకు రక్ష' అని మమతలు పూయిస్తారు. పురాణకాలంలో యమున తన సోదరుడు యముడికి రాఖీ కట్టింది. శ్రీకృష్ణుడికి వరుసకు చెల్లెలైన ద్రౌపది రాఖీ కట్టింది. చరిత్రకాలంలో రాణి కర్ణావతి చక్రవర్తి హుమయూన్‌కి రాఖీ పంపింది. ఈ కథనాలను చదువుకున్నాం. రాఖీ మీద వచ్చిన సినిమాలను చూశాం. సినిమాలో హీరోకి అక్క పాత్ర కట్టినంత అందమైన రాఖీని చూసినప్పుడు ఈ సారి రక్షాబంధన్‌కి తన తమ్ముడికి కూడా అలాంటి అందమైన రాఖీనే కట్టాలని ప్రతి అక్కా ఉవ్విళ్లూరుతుంది. అలా వచ్చినవే రకరకాల రాఖీలు. ముత్యాలను పోలిన తెల్లటి పూసలతో అల్లిన రాఖీలు, కెంపుల వంటి రాళ్ల పొదిగిన రాఖీలు, తెల్లటి రాళ్ల, పచ్చటి చమ్కీలతో మెరిసే రాఖీలు, రంగురంగు పూసల రాఖీలు, మువ్వల రాఖీలు రూపుదిద్దుకున్నాయి. ఎకో ఫ్రెండ్లీగా మట్టి రాఖీలు మణికట్టును ఆకట్టుకున్నాయి. బంగారు, వెండి రాఖీలు రాజ్యమేలాయి. ఈ ఏడాది మాత్రం రాఖీల్లో చందమామ హీరో అయ్యాడు. రాఖీల మీద రాకింగ్ చేస్తున్నాడు.





ఇక మేమైతే ఈ ఏడాది నీ రాఖీలతో పండుగ చేసుకుంటున్నాం. అమ్మాయిల చెవులు పట్టుకుని ఉయ్యాలలూగిన చాంద్‌బాలీలు ఇప్పుడు అబ్బాయిల మణికట్టు మీద మకుటాయమానంగా మెరుస్తున్నాయి. అర్ధవలయాకారంలో నువ్వు ముంజేతి మీద ఉంటే ప్రతి అబ్బాయీ 'మా అక్క కట్టింది చూడు' అని ప్రియురాలికి చూపించుకుంటూ తామే చందమామ అయినట్లు మురిసిపోతున్నారు... మెరిసిపోతున్నారు నీ మేనల్లుళ్లు.

> చందమామ రావే... జాబిల్లి రావే...
> అని పాలబువ్వ తిన్నన్ని రోజులూ పాడుతూనే ఉన్నాం. నీ పాట పాడుతూ, నువ్వు వస్తావని నమ్ముతూనే పెరిగాం. పెద్దయిన తర్వాత రావోయి చందమామా అని పిలిచాం. వస్తాడు నా రాజు ఈ రోజు అని దొంగచూపులు, బెంగచూపులు చూశాం. నెలవంక కోసం ఆకాశంలో వెతికాం. పున్నమి రోజు నీ వెన్నెల కోసం ఎదురుచూస్తుంటాం. మా చిన్నప్పుడు మా అమ్మ 'నిన్ను అంతగా పిలిచింది' ఎన్ని తరాలు పిలిచినా, ఎన్ని తరాల అమ్మలు పిలిచినా నువ్వు రాలేదు. అందుకే మేమే నీ దగ్గరకు వచ్చేశాం. అమ్మలందరికీ అమ్మ మా భూమాత. భూమి తల్లి తన ప్రతినిధిగా నీ దగ్గరకు విక్రమ్‌ని పంపించింది చూశావు కదా! అమ్మకు తమ్ముడంటే చాలా ఇష్టం మామా! రక్షాబంధన్ పండుగకు నీకు రాఖీ కట్టడానికే విక్రమ్‌ని పంపించింది చూడు!
> మరి!!! రక్షాబంధన్ కట్టించుకున్న నువ్వు... అమ్మకు బహుమతి ఏమిస్తున్నావ్ చందమామా!

శాక్సాఫోన్ సుబ్బలక్ష్మి



సుబ్బలక్ష్మి



సుబ్బలక్ష్మి ఇంటి పేరు ఎవరికీ తెలియదు. ప్రపంచమంతా ఆమెను శాక్సాఫోన్ సుబ్బలక్ష్మి అనే పిలుస్తుంది. మగవారు మాత్రమే వాయించే ఈ వాయిద్యంలో సుబ్బలక్ష్మి స్త్రీగా ఉనికి సాధించింది. పట్టుచీర, వడ్డాణం ధరించి వేదిక మీద సంప్రదాయ ఆహార్యంలో ఈ ఆధునిక వాయిద్యం మీద వెస్టర్న్, కర్నాటక్‌లో అద్భుత ప్రతిభ చూపుతుంది. డైరీలో ఒకరోజు కూడా ఖాళీ ఎరగని ఈ బెంగళూరు వాద్యకారిణి సక్సెస్ స్టోరీ.

40 ఏళ్ల సుబ్బలక్ష్మి ప్రోగ్రామ్ ఏర్పాటు చేయాలంటే సంవత్సరం ముందు బుక్ చేసుకోవాలి. ఆమె డైరీలో ఒక్కరోజు కూడా ఖాళీ ఉండదు. ఇవాళ చెన్నై, రేపు బెంగళూరు, ఎల్లుండి దుబాయ్... ఆమె కచ్చేరీలు సాగిపోతూ ఉంటాయి. భర్త కిరణ్ కుమార్‌కు ఐ.టి. రంగంలో మంచి ఉద్యోగం. కానీ ఈమె కచ్చేరీల బిజీ చూసి ఉద్యోగం మానేసి సాయంగా ఉంటున్నాడు. బెంగళూరులో నివాసం ఉండే సుబ్బలక్ష్మి సొంతింట్లో ఉండేది తక్కువ. కచ్చేరీలకు తిరిగేది ఎక్కువ. కాని ఈ విజయం అంత సులువు కాదు సుమా.

ఒక్కతే శిష్యురాలు

సుబ్బలక్ష్మి పూర్తిపేరు ఎం.ఎస్.సుబ్బలక్ష్మి. అవును. మహా గాత్ర విద్వాంసులు ఎం.ఎస్.సుబ్బులక్ష్మిని జ్ఞప్తికి తెచ్చే పేరు. ఆ పేరు ప్రభావమో, ఇంట్లో సంగీతం ఉండటమో సుబ్బలక్ష్మికి కూడా సంగీతం మీద ఆసక్తి ఏర్పడింది. సుబ్బలక్ష్మి తాత మైసూర్ సంస్థానంలో ఆస్థాన సంగీత విద్వాంసుడుగా ఉండేవాడు. సుబ్బలక్ష్మి తండ్రి సాయినాథ్ మంగళూరులో మృదంగ విద్వాంసుడు. అతడు అనేకమంది సంగీతకారులకు కచ్చేరీల్లో వాద్య సహకారం అందించేవాడు. ఐదో ఏట నుంచే గాత్ర సంగీతం నేర్చుకుంటున్న సుబ్బలక్ష్మి ఒకసారి తండ్రితోపాటు కచ్చేరీకి వెళ్లింది. అది శాక్సాఫోన్ విద్వాంసుడు కద్రి గోపాల్‌నాథ్ కచ్చేరి. అందులో గోపాల్‌నాథ్ అద్భుతంగా శాక్సాఫోన్ వాయిస్తుంటే సుబ్బలక్ష్మి మైమరిచిపోయింది. తాను కూడా శాక్సాఫోన్ నేర్చుకోవాలనుకుంది. అప్పుడు ఆమెకు 13 ఏళ్లు. ఆ రోజుల్లో ఆడపిల్లలు శాక్సాఫోన్‌ను అంతగా నేర్చుకునేవారు కాదు. గురువులు నేర్పించేవారు కూడా కాదు. అది పూర్తిగా మగవారి వాయిద్యం. కాని సుబ్బలక్ష్మి పట్టుబట్టింది. మొత్తం 16 మంది శిష్యులు ఆ సమయంలో కద్రి గోపాల్‌నాథ్ దగ్గర ఉంటే వారిలో ఒకే ఒక శిష్యురాలు సుబ్బలక్ష్మి.



ఎన్నో వెక్కిరింతలు

సాధనలో అబ్బాయిలు సుబ్బలక్ష్మిని అస్సలు సహించలేదు. 'నేను శాక్సా పట్టుకుని సాధన చేస్తుంటే వాళ్లు నవ్వుతుండేవారు. కుర్చీ కిర్రుకిర్రుమన్నట్లు ఉంది అనేవారు. గురువు గారి భార్య మా అమ్మకు స్నేహితురాలు. వీళ్లు నవ్వుతుంటే ఆమె బయటికొచ్చి చూసి- వాళ్లు నవ్వనీ ఏమైనా అననీ... నువ్వు మాత్రం ట్రై చేస్తూనే ఉండు. నీకు వస్తుంది అని ఎంకరేజ్ చేసింది. ఆమె ప్రోత్సాహం వల్ల ధైర్యం తెచ్చుకున్నాను. నేను శాక్సాఫోన్ నేర్చుకోవడంలో ప్రోత్సాహం కంటే అవమానమే ఎక్కువ. కచ్చేరీల్లో కావాలని నా టైము మధ్యాహ్నం ఇచ్చేవారు. ఆ సమయంలో ఆడియెన్స్ ఉండరు. మహా అయితే పది నిమిషాలు కేటాయించేవారు. మగవారు సాయంత్రం నిండు సభలో వాయించేవారు. వారికి గంట సమయం దొరికేది. నన్ను ప్రత్యేకంగా మహిళా శాక్సాఫోనిస్ట్ అని విడిగా చూసేవారు' అని తెలిపింది సుబ్బలక్ష్మి.

గర్భం దాల్చాక కూడా

సుబ్బలక్ష్మి శాక్సాఫోన్ వాయించడంలో ఒక వరుస ఉంటుంది. ఆమె మొదట కర్నాటక సంగీతం వాయించి ఆ తర్వాత ఫ్యూజన్‌లోకి వస్తుంది. వెస్ట్రన్‌ను, కర్నాటక్‌ను మిళితం చేసి కచ్చేరీల్లో ఒక ఊపు తెస్తుంది. అది జనానికి నచ్చుతుంది. ఇది కూడా కొంత మంది శాక్సాఫోన్ విద్వాంసులకు నచ్చదు. ఆమెను విమర్శిస్తుంటారు. 'నన్ను ఎన్నో విమర్శిస్తారు. కాని నేను భయపడలేదు. కచ్చేరీలు కొనసాగించాను. 7 కిలోల శాక్సాఫోన్‌ను రెండు గంటల పాటు పట్టుకుని కచ్చేరి చేయడం ఎంత కష్టమో ఆలోచించండి. ఆడది అలా చేయలేదు అనేవాళ్లకు సమాధానంగా నిలిచాను. నా ఊపిరితిత్తుల బలం నాకు సహకరించింది. పెళ్లయి గర్భం దాల్చాక నా శత్రువులు ఇక ఆమె కచ్చేరీలు చేయదు అనే ప్రచారం మొదలెట్టారు. డెలివరీ అయ్యాక కచ్చేరీలు సాధ్యం కాదని ఆర్గనైజర్స్‌ను భయపెట్టారు. దాంతో షోలు బుక్ చేసిన ఆర్గనైజర్స్ అడ్వాన్సులు వెనక్కు ఇమ్మని అడగడం మొదలెట్టారు. నేను పట్టుదలగా ఆ పుకార్లను తోసి పుచ్చాను. రేపు డెలివరీ అనగా ఇవాళ కూడా కచ్చేరీ చేశాను. నిండు గర్భవతిగా స్టేజ్ మీద శాక్సాఫోన్ వాయించింది నేనే అనుకుంటా. అలాగే డెలివరీ అయిన 15 రోజులకు మళ్లీ స్టేజ్ మీదకు వచ్చాను. ఈ రంగంలో నేనే మిటో నిరూపించుకోవాలనే నా పట్టుదలే నాకు బలాన్ని ఇచ్చింది' అంటుంది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి సోదరి లావణ్య కూడా శాక్సాఫోన్ విద్వాంసురాలిగా రాణిస్తోంది. వీరు విడివిడిగా కచ్చేరీలు చేసినా కలిసి చేసే కచ్చేరీలు కూడా వీనుల విందుగా ఉంటాయి.

డ్యాన్స్

ఇండియన్ బ్యాలెరినా



ఇష్నా చౌదరి

అంతర్జాతీయ వేదికలపైన ప్రసిద్ధి గాంచిన బ్యాలె డ్యాన్స్‌లో హైదరాబాద్ వాసి13 ఏళ్ల ఇష్నా చౌదరి రాణించడమే కాదు ప్రతిష్ఠాత్మక కెనడా నేషనల్ బ్యాలె స్కూల్ (ఎబీఎస్)లో ప్రవేశానికి ఎంపికైంది. ప్రపంచంలోని టాప్ 10 బ్యాలే స్కూల్స్‌లో ఒకటైన ఎన్‌బీఎస్ అకడమిక్ కరిక్యులమ్‌లో ప్రవేశం పొందిన మొదటి భారతీయురాలుగా చరిత్ర సృష్టించింది ఇష్నా. 'వివిధ దేశాలలో ఉన్న నా ఫ్రెండ్స్ ఇండియన్ బ్యాలెరినా' అని పిలుస్తున్నారు బ్యాలె ఈజ్ బ్యూటిఫుల్ అంటూ తన ఆనందాన్ని తెలియజేస్తోంది.

మూడేళ్ల వయసు నుంచే బ్యాలె పై మక్కువ పెంచుకున్న ఇష్నా ప్రముఖ టెలివిజన్ సిరీస్ ''ఏంజెలీనా బ్యాలేరినా' చూస్తూ తన ఆసక్తిని మరింత పెంచుకుంది. ఐదేళ్ల వయస్సులో ముంబైలో క్లాసికల్ బ్యాలెలో శిక్షణ ప్రారంభించింది. ఏడేళ్ల వయసులో ఇష్నా తల్లిదండ్రులు పూణేకు మారడంతో అక్కడే మూడేళ్లపాటు బ్యాలె ప్రాథమిక దశల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుంది. ఇందులో భాగంగానే లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్యాన్స్ గ్రేడెడ్ పరీక్షల్లో విజేతగా నిలిచి, ప్రత్యేకతను సంపాదించుకుంది.







వదలని పట్టుదల

కరోనా మహమ్మారి విజృంభించడంతో బ్యాలె స్టూడియోలు భౌతికంగా మూసేశారు. ''ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ శిక్షణ సంస్థలు అందించే ఆన్‌లైన్ క్లాస్‌ల పైన దృష్టి పెట్టాను. ఇందులో భాగంగా వాగనోవా బ్యాలె అకాడమీ ఆఫ్ రష్యా వంటి ప్రముఖ వేదికలు సమ్మర్ ఇంటెన్సివ్ శిక్షణ కోసం ఇష్నాను ఆడిషన్ చేశాయి. ఈ ఆడిషన్స్‌లో అంతర్జాతీయ విద్యార్థులతో కలిసి శిక్షణ పొందాను. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన వాగనోవాలోని బ్యాలేరినాలతో శిక్షణ పొంది, ప్రీ ప్రొఫెషనల్ బ్యాలె ప్రోగ్రామ్ కోసం ఆసియాలోని టాప్ బ్యాలె స్కూల్ అయిన మార్లుపి డాన్స్ అకాడమీ(ఇండోనేషియా)కి ఎంపికయ్యాను. కానీ ఇండోనేషియాకు మకాం మార్చడం కష్టం కాబట్టి మళ్లీ ఆన్‌లైన్ తరగతుల ద్వారానే ట్రైనింగ్ తీసుకున్నాను' అని వివరిస్తుంది ఇష్నా.

అవార్డులు.. స్కాలర్‌షిప్‌లు

బ్యాలెలో ఆసియాలోనే అత్యుత్తమ స్కూల్ అయినటువంటి మార్లుపి డ్యాన్స్ అకాడమీ (ఎమ్‌డీఏ) క్లాసికల్ బ్యాలెలో ప్రీ ప్రొఫెషనల్ శిక్షణను అందిస్తుంది. ఈ వేదికగా అంతర్జాతీయ స్థాయి డ్యాన్సర్లను తయారు చేసిన ప్రముఖ బ్యాలె శిక్షకురాలు మిస్ జోనాథ ఆధ్వర్యంలో ఇష్నా పదేళ్ల వయసున్నప్పటి నుంచే ఇంటర్నేషనల్ కాంపిటీషన్స్‌లో ఎన్నో అవార్డులను గెలుచుకుంది. సింగపూర్ యూత్ ఆర్ట్ ఫెస్టివల్లో క్లాసికల్ బ్యాలెలో వెండి, కాంస్య అవార్డులు, సింగపూర్ ఐబీజీపీఎస్‌లో పొటెన్షియల్ అవార్డు, జకార్తాలోని ఏషియన్ గ్రాండ్ ప్రిక్స్‌లో మెరిట్ అవార్డు, గ్రేట్ ఇండియా బ్యాలె పోటీలో గోల్డ్‌మెడల్ తదితర అవార్డులను ఇష్నా చౌదరి అందుకుంది. అంతేకాకుండా యూత్ అమెరికన్ గ్రాండ్ ప్రిక్స్ (వైఏజీపీ)లో సెమీఫైనల్‌కు కూడా అర్హత సాధించింది.

కెనాన్ డాన్స్ ఫెస్టివల్ సింగపూర్ ఫర్ సమ్మర్ ఇంటెన్సివ్ టు ఆసియా బ్యాలెట్ అకాడమీ (మలేషియా), నేషనల్ బ్యాలె అకాడమీ ఆఫ్ న్యూయార్క్ సమ్మర్ ఇంటెన్సివ్, జువాన్ పాయింట్ ప్రోగ్రామ్ న్యూజిలాండ్ వంటి వేదికల్లో స్కాలర్‌షిప్‌లను సైతం పొందింది. జువాన్ పాయింట్‌లో తన నైపుణ్యాల ఆధారంగా ఆమె స్కాలర్‌షిప్‌ను అడ్వాన్స్‌డ్ పాయింట్ ప్రోగ్రామ్‌కు పొడిగించడం విశేషం. ఎన్‌బీఎస్ కెనడా, ఏఅండ్‌ఏ బ్యాలె(చికాగో)లో శిక్షణ పొందేందుకు స్కాలర్‌షిప్ సాధించింది. అంతర్జాతీయ బ్యాలె వేర్ బ్రాండ్ 'బ్యాలె లైఫ్'కు ఇష్నా బ్రాండ్ అంబాసిడర్‌గా కూడా వ్యవహరిస్తుంది.

నిరంతర కృషి

ఈ ఏడాది ప్రపంచంలోని టాప్ బ్యాలె అకాడమీలతో వ్యక్తిగతంగా శిక్షణ పొందాలనుకుంది ఇష్నా. ఇందులో భాగంగా బోస్టన్ బ్యాలె (బోస్టన్, ఎమ్‌ఏ), రష్యన్ మాస్టర్స్ బ్యాలె (అలికాంటే, స్పెయిన్), ప్రతిష్ఠాత్మక స్కూల్ ఆఫ్ అమెరికన్ బ్యాలె (ఎస్‌ఏబీ, న్యూయార్క్)లో 8 శాతంతో సమ్మర్ ఇంటెన్సివ్‌ల ఆడిషన్‌లో ఎంపికైంది. నిరంతర కృషితో తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఇష్నా., సమ్మర్ ఆఫ్ 2023ని కెనడా నేషనల్ బ్యాలెలో శిక్షణ పొందాలని నిర్ణయించుకుంది. ఇంటెన్సివ్‌లో తన ప్రదర్శన ఫలితంగా కెనడా ఎన్‌బీఎస్‌లో ప్రొఫెషనల్ బ్యాలె ప్రోగ్రామ్ కోసం ఆఫర్ అందుకుంది. 1959లో స్థాపించబడిన ఎన్‌బీఎస్ ., ఔత్సాహిక యువ నృత్యకారులు, ఉపాధ్యాయుల కోసం ప్రపంచంలోని అగ్రగామి శిక్షణా సంస్థలలో ఒకటి. ఈ వేదికగా శిక్షణ పొందుతున్న మొట్టమొదటి భారతీయ బాలేరినాగా ఇష్నా చౌదరి చరిత్ర సృష్టించింది.

– హనుమాద్రి శ్రీకాంత్



సహానుభూతి కోరుకుంటున్నారా..?!



కొందరు వ్యక్తులు వ్యక్తిగత ఒత్తిడి, చికాకులు, కోపం, నిరాశ ... వంటి భావోద్వేగాలను సోషల్‌మీడియా వేదికగా పంచుకుంటూ జనాల మద్దతు కోరుకుంటూ ఉంటారు. ఈ విధానం వల్ల లాభం కన్నా నష్టాలే ఎక్కువ ఉన్నాయి. మానసిక సమస్యలను మోసగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకోవచ్చు. దీనివల్ల కొత్త ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉంది. యువత, మహిళల్లో ఎక్కువగా ఉండే ఈ సమస్య గురించి, జాగ్రత్తల గురించి తప్పక తెలుసుకోవాల్సిందే!

సైబర్ టాక్

సోషల్ మీడియాలో తమ భావోద్వేగాలు, ఆశనిరాశలు, ఆలోచనలు, ఆవేదనలు, వ్యక్తిగత అనుభవాలు, సమస్యలను విస్తృతంగా పంచుకునే వారి సంఖ్య ఇటీవల పెరిగింది. ఇతరుల సానుభూతిని కోరుకోవడానికి ఇలా చేస్తుంటారు. దీనికి కొందరు వ్యక్తులు తీర్పులు ఇస్తుంటారు లేదా తప్పుగా అర్థం చేసుకుంటారు.

కలిగే నష్టాలు

- సంఘర్షణ తీవ్రత పెరుగుతుంది
- అనవసరమైన వాటిపైన శ్రద్ధ
- నిరంతర సానుభూతి వచనాలను కోరుకుంటారు.
- మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది.

దీనికన్నా భావోద్వేగాలను అదుపు చేసుకోవడానికి నమ్మదగిన స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా మానసిక ఆరోగ్య నిపుణుల నుండి మద్దతు పొందడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే, మీ భావోద్వేగాల పరిస్థితిని మోసగాళ్లు ఓ కంట గమనిస్తుంటారు. వాటిని ఆసరాగా చేసుకొని మోసగాళ్ల ఫ్రెండ్స్ జాబితాలో చేరి, అనుకూలంగా మాట్లాడుతూ చివరకు ఆర్థికపరమైన నేరాలకు పాల్పడవచ్చు.

సానుభూతి కోరుకునేవారు..

- ప్రజల దృష్టిని ఆకర్షించడానికి భావోద్వేగాలను వ్యక్తపరుస్తుంటారు. లైక్‌లు, కామెంట్స్, ఫాలోవర్స్ ద్వారా మనకున్న ప్రాముఖ్యతను చూసుకుంటారు కాబట్టి చాలామంది వ్యక్తులు తమ ఫాలోవర్ బేస్‌ను పెంచుకోవడానికి దృష్టిని ఆకర్షించడానికి సోషల్ మీడియాలోకి వస్తారు.
- తమ భావోద్వేగాలను సానుకూలంగా లేదా ప్రతికూలంగా ఎవ్వరికీ కనిపించకుండా వ్యక్తీకరించడానికి సోషల్ మీడియా మాత్రమే అనుకూలంగా భావిస్తారు.
- మంచి, చెడు ఏదైనా సోషల్ మీడియాలో ముందుగా విషయాలను పంచుకోవాలనే ఆత్రుత, మనల్ని ఇతరులు గమనిస్తున్నారా లేదా అనే నిరీక్షణ ఉంటుంది.
- సోషల్ మీడియాలో ఆలోచనలు, భావాలను పంచుకోవడం వల్ల స్నేహితులు, కుటుంబ సభ్యులు లేదా అపరిచితుల నుండి కూడా మద్దతు పొందవచ్చు.
- కొందరు వ్యక్తులు ఎవ్వరికీ తెలియకుండా అజ్ఞాతంగా ఉంటూ సోషల్ మీడియాలో చురుకుదనాన్ని ప్రదర్శిస్తుంటారు. ఎందుకంటే వారు తమ వ్యక్తీకరణను అనామకంగా చేస్తారు. ఇది భద్రతా భావాన్ని అందిస్తుంది, తక్షణ పరిణామాల భయం లేకుండా ఉండటమే దీనికి గల కారణం.
- మార్పు కోసం వాదించడానికి లేదా ప్రభుత్వాలు, కార్పొరేట్లు, రాజకీయ పార్టీలు తీసుకున్న ముఖ్యమైన విషయాలపై (అంటే విధానాలు లేదా నిర్ణయాలు) దృష్టిని ఆకర్షించడానికి ఇదొక మార్గం.
- ఒంటరితనం, సన్నిహిత సంబంధాలు లేకపోవటం లేదా ఎవరితోనైనా మాట్లాడటానికి ఇబ్బంది పడుతుంటే, సోషల్ మీడియా మాత్రమే వారి వ్యక్తీకరణ సాధనంగా పనిచేస్తుంది.
- సోషల్ మీడియాలో తమను తాము వ్యక్తీకరించడం, వారి భావాలను పంచుకోవడంలో ఉపశమనం పొందుతుంటారు.
- కష్టాలు, సవాళ్లను పంచుకోవడం ద్వారా వ్యక్తులు తమలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న ఇతరులతో కనెక్ట్ అవ్వవచ్చు.
- కొందరితో వ్యక్తిగతంగా చెప్పలేని విషయాలు ఆన్‌లైన్‌లో పంచుకోవడం సుఖంగా ఉంటుంది.

ఎలా ఉండాలి..

- వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విభిన్న రకాల వ్యూవర్స్ మీకు ఉండే అనుకూలమైన సోషల్ మీడియా సైట్‌ను ఎంచుకోవాలి. (ఉదాహరణకు.. వ్యక్తిగత వ్యక్తీకరణల కోసం Facebook, ప్రజల కోసం Twitter ఎంచుకోవచ్చు.
- సహాయం కోరుతున్నారా, నైపుణ్యాన్ని పంచుకుంటున్నారా లేదా మిమ్మల్ని మీరు వ్యక్తపరుచుకుంటున్నారా అనే దానిపైన స్పష్టత ఉండాలి.
- మీ ఉద్వేగాల పరిస్థితిని కంప్లైంట్‌గా కాకుండా మీరు ఎలా, ఎందుకు దేనిగురించి భావిస్తున్నారో వివరించడానికి ప్రయత్నించాలి. దీనివల్ల మీరు చెప్పాలనుకుంటున్న విషయాన్ని ఇతరులు అర్థం చేసుకునే వీలుంటుంది.
- మీ భావాలను వ్యక్తపరిచేటప్పుడు, సున్నితమైన లేదా విభజన సమస్యలను తెచ్చేటప్పుడు జాగ్రత్త వహించాలి. లేదంటే సంఘర్షణకు దారితీయవచ్చు.
- సోషల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారమ్‌లు నిర్దిష్ట స్నేహితులు లేదా అనుచరులతో పోస్ట్‌లను పూర్తిగా పబ్లిక్ షేర్ చేయడానికి అనుమతిస్తాయి కాబట్టి గోప్యతా సెట్టింగ్‌లపై నియంత్రణ ఉండాలి.
- మీ గోప్యతకు భంగం కలిగించే మీ వివరాలను బహిర్గతం చేయకుండా ఉండాలి. (అనగా.. పేరు, చిరునామా, ప్లేస్, టెలిఫోన్ నంబర్, ఇ-మెయిల్, చిరునామా మొదలైన వ్యక్తిగత సమాచారం)
- ఫీడ్‌బ్యాక్ విషయంలో ఓపెన్‌గా ఉండాలి. గౌరవప్రదంగా ప్రవర్తించాలి. లేకపోతే ప్రతికూల చర్యలకు సిద్ధంగా ఉండాల్సి వస్తుంది.
- మీ విజయాలు, జీవిత అనుభవాలు లేదా సంతోషకరమైన క్షణాలను పంచుకోవడం ద్వారా ప్రోత్సాహకరమైన ఉనికిని పొందవచ్చు.
- మిమ్మల్ని మీరు వ్యక్తపరుచుకోవడం మీకు మంచి అనుభూతిని కలిగిస్తుందో లేదో, మీరు పోస్ట్ చేసిన దానితో సంతృప్తి చెందుతున్నారో లేదో ఒకటికి రెండుసార్లు సమీక్షించుకోవాలి.
- సోషల్ మీడియాలో మీ వ్యక్తీకరణను ఎలా తెలియజేస్తున్నారో స్నేహితుడితో, కుటుంబ సభ్యునితో, థెరపిస్ట్‌తో మాట్లాడటం మేలు చేస్తుంది. వాటిలోని మంచి చెడులను బేరీజు వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.

మీ వ్యక్తిగత ప్రతిష్ఠకు సమస్యలు ఎదురైతే రిపోర్ట్ చేయడానికి...

Facebook: https://www.facebook.com/help/1753719584844061/?helpref=uf_share
Instagram:https://help.instagram.com/contact/ 383679321740945
Twitter: https://help.twitter.com/en/forms/safety-and-sensitive-content
LinkedIn: https://www.linkedin.com/help/linkedin/answer/a1378278/report-inappropriate-content-messages-or-safety-concerns?lang=en



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్

సీజీఎఫ్ ఉపాధ్యక్ష పదవి రేసులో ఉష



భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు, దిగ్గజ అథ్లెట్, పార్లమెంట్ సభ్యురాలు పీటీ ఉష మరో అడుగు ముందుకు వేయనుంది. నవంబర్‌లో సింగపూర్‌లో జరిగే కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్) ఎన్నికల్లో 59 ఏళ్ల ఉష ఉపాధ్యక్ష పదవి కోసం పోటీపడనుంది. మూడు ఉపాధ్యక్ష స్థానాల కోసం ఉషతోపాటు పర్యాజ్ గ్రాహమ్ (కుక్ ఐలాండ్స్), బ్యారీ హెండ్రిక్స్ (దక్షిణాఫ్రికా), సాండ్రా ఒస్బోమ్ (బార్బడోస్), రిచర్డ్ పవర్స్ (కెనడా), ఇయాన్ రీడ్ (స్కాట్లాండ్), డొనాల్డ్ రుకారె (ఉగాండా) బరిలో ఉన్నారు.

గ్రాండ్‌మాస్టర్ల 'సెంచరీ' దాటుతాం: హంపి



ప్రపంచకప్ టోర్నీలో యువ గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, గుకేశ్, అర్జున్, నిహాల్ తదితరులు అద్భుత ప్రదర్శన చేశారని భారత స్టార్ కోనేరు హంపి కొనియాడింది. కోల్‌కతాలో నేడు మొదలయ్యే టాటా స్టీల్ చెస్ ఇండియా టోర్నీలో హంపి పోటీ పడనుంది. త్వరలోనే భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య 100 దాటుతుందని హంపి విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ ఏడాది జూలైలో ఆదిత్య సామంత్ రూపంలో భారత్ నుంచి 83వ గ్రాండ్‌మాస్టర్ అవతరించాడు.

'మేధావి'కి ఘన స్వాగతం



- సొంతగడ్డకు చేరిన ప్రపంచకప్ చెస్ టోర్నీ రన్నరప్ ప్రజ్ఞానంద
- రూ. 30 లక్షలు నగదు పురస్కారం అందించిన తమిళనాడు ప్రభుత్వం

చెన్నై: ప్రపంచకప్ చెస్ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో ఫైనల్ వరకు చేరిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద తన స్వస్థలం చెన్నై చేరుకున్నాడు. ప్రతిష్టాత్మక చదరంగ వేదికపై తనదైన ముద్ర వేసి తిరిగొచ్చిన ఈ 18 ఏళ్ల కుర్రాడిని సొంత నగరం ఆత్మీయంగా అక్కున చేర్చుకుంది. అతనికి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఒకవైపు ఆత్మీయులు, సన్నిహితులు ఆనందంగా తమవాడికి వెల్‌కమ్ చెప్పగా, మరోవైపు తమిళనాడు ప్రభుత్వం అధికారికంగా స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆ రాష్ట్ర సాంప్రదాయ నృత్యాలు కరగట్టం, ఒయిలట్టంలతో విమానాశ్రయం బయట కళాకారులు ప్రజ్ఞానందకు స్వాగతం పలికారు. పూలు, శాలువాలు, పుష్ప గుచ్ఛాలతో మిత్రులు, అభిమానులు ప్రజ్ఞను ముంచెత్తారు. 'నాకు లభించిన ఈ స్వాగతం పట్ల చాలా సంతోషంగా ఉన్నాను' అంటూ జాతీయ పతాకాన్ని చేతిలో ప్రదర్శిస్తూ ప్రజ్ఞానంద వ్యాఖ్యానించాడు. అతని తల్లి నాగలక్ష్మి కూడా తన ఆనందాన్ని దాచుకోలేకపోయింది. అనంతరం ప్రజ్ఞానంద, అతని తల్లిదండ్రులు నాగలక్ష్మి, రమేశ్‌బాబులను తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞానందకు జ్ఞాపికతోపాటు రూ. 30 లక్షలు నగదు పురస్కారం అందజేశారు. అజర్‌బైజాన్‌లోని బాకులో జరిగిన 'ఫిడే' వరల్డ్ కప్ ఫైనల్లో వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో ఓడిన ప్రజ్ఞానంద రన్నరప్‌గా నిలిచాడు.

పాక్ ఆడుతూ పాడుతూ...

ఆసియా కప్ తొలి పోరులో భారీ విజయం

- నేపాల్‌పై 238 పరుగులతో గెలుపు
- బాబర్, ఇఫ్తిఖార్ సెంచరీలు
- నేడు బంగ్లాదేశ్, శ్రీలంక మ్యాచ్


బాబర్


ఇఫ్తిఖార్

ముల్తాన్: సొంతగడ్డపై మొదలైన ఆసియా కప్ టోర్నీలో పాకిస్తాన్ క్రికెట్ జట్టు శుభారంభం చేసింది. 15 ఏళ్ల తర్వాత ఈ టోర్నమెంట్‌కు ఆతిథ్యమిస్తున్న పాక్ పసికూన నేపాల్‌పై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ భారీ విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ 238 పరుగుల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ ముందుగా 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 342 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ బాబర్ ఆజమ్ (131 బంతుల్లో 151; 14 ఫోర్లు, 4 సిక్స్‌లు) కెరీర్‌లో 19వ సెంచరీ సాధించగా, ఇఫ్తిఖార్ అహ్మద్ (71 బంతుల్లో 109 నాటౌట్; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు శతకంతో చెలరేగాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 21.5 ఓవర్లలోనే 214 పరుగులు జోడించారు. అనంతరం నేపాల్ 23.4 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. సోంపాల్ కామి (28), ఆరిఫ్ షేక్ (26) మాత్రమే నాలుగో వికెట్‌కు 59 పరుగులు జత చేసి కొద్దిగా పోరాడే ప్రయత్నం చేశారు. పాక్ బౌలర్లలో షాదాబ్ ఖాన్ 4 వికెట్లు పడగొట్టాడు. నేడు పల్లెకెలెలో జరిగే పోరులో శ్రీలంకతో బంగ్లాదేశ్ తలపడుతుంది.

నాలుగు పరుగుల వ్యవధిలో పాక్ ఓపెనర్లు ఫఖర్ (14), ఇమామ్ (5) వికెట్లు కోల్పోయింది. అయితే బాబర్, రిజ్వాన్ (50 బంతుల్లో 44; 6 ఫోర్లు) మూడో వికెట్‌కు 86 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు. రిజ్వాన్, సల్మాన్ (5) కూడా తక్కువ వ్యవధిలోనే వెనుదిరిగారు. ఈ దశలో బాబర్, ఇఫ్తిఖార్ భారీ భాగస్వామ్యం జట్టును పటిష్ట స్థితికి చేర్చింది. 55 పరుగుల వద్ద కరణ్ ఖత్రి రిటర్న్ క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన బాబర్ 109 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. భారీ ఛేదనలో 14 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన తర్వాత నేపాల్ ఏమాత్రం కోలుకోలేకపోయింది. అనుభవలేమి కారణంగా ఆ జట్టు ప్రత్యర్థి బౌలింగ్ బృందాన్ని సమర్థంగా ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైంది.

స్కోరు వివరాలు

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ (సి) ఆసిఫ్ (బి) కరణ్ 14; ఇమామ్ ఉల్ హఖ్ (రనౌట్) 5; బాబర్ ఆజమ్ (సి) (సబ్) జోరా (బి) సోంపాల్ 151; రిజ్వాన్ (రనౌట్) 44; సల్మాన్ (సి) భుర్తేల్ (బి) లమిచానే 5; ఇఫ్తిఖార్ (నాటౌట్) 109; షాదాబ్ (బి) సోంపాల్ 4; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం** (50 ఓవర్లలో 6 వికెట్లకు) 342. వికెట్ల పతనం: 1-21, 2-25, 3-111, 4-124, 5-338, 6-342. బౌలింగ్: సోంపాల్ 10-1-85-2, కరణ్ 9-0-54-1, గుల్షన్ 4-0-35-0, లలిత్ 10-0-48-0, లమిచానే 10-0-69-1, దీపేంద్ర సింగ్ 6-0-40-0, కుశాల్ 1-0-10-0.

నేపాల్ ఇన్నింగ్స్: భుర్తేల్ (సి) రిజ్వాన్ (బి) షాహీన్ 8; ఆసిఫ్ (సి) ఇఫ్తికార్ (బి) నసీమ్ 5; రోహిత్ కుమార్ (ఎల్బీ) (బి) షాహీన్ 0; ఆరిఫ్ (బి) రవూఫ్ 26; సోంపాల్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 28; గుల్షన్ (సి) ఫఖర్ (బి) షాదాబ్ 13; దీపేంద్ర (బి) నవాజ్ 3; కుశాల్ (సి) ఇఫ్తికార్ (బి) షాదాబ్ 6; లమిచానే (బి) షాదాబ్ 0; కరణ్ (నాటౌట్) 7; లలిత్ (ఎల్బీ) (బి) షాదాబ్ 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం** (23.4 ఓవర్లలో ఆలౌట్) 104. వికెట్ల పతనం: 1-10, 2-10, 3-14, 4-73, 5-82, 6-90, 7-91, 8-91, 9-104, 10-104. బౌలింగ్: షాహీన్ అఫ్రిది 5-0-27-2, నసీమ్ 5-0-17-1, రవూఫ్ 5-1-16-2, షాబాద్ 6.4-0-27-4, నవాజ్ 2-0-13-1.

శ్రీలంక గడ్డపై భారత జట్టు

శనివారం పాకిస్తాన్‌తో తొలి పోరు


ఇషాన్ కిషన్, శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్, తిలక్ వర్మ

కాండీ: ఆసియా కప్‌లో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు బుధవారం శ్రీలంకకు చేరుకుంది. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో ఆరు రోజుల ప్రత్యేక శిక్షణ శిబిరం ముగిసిన తర్వాత టీమిండియా లంకకు బయల్దేరింది. నేరుగా విమానంలో కొలంబోలో దిగిన రోహిత్ శర్మ బృందం అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కాండీకి చేరుకుంది. గాయం నుంచి పూర్తిగా కోలుకోని బ్యాటర్ కేఎల్ రాహుల్ మినహా ఇతర జట్టు సభ్యులంతా ఒకేసారి లంక గడ్డపై అడుగు పెట్టారు. రాహుల్ టోర్నీలో తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఆసియా కప్‌లో భాగంగా శనివారం పల్లెకెలె మైదానంలో జరిగే తమ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ తలపడుతుంది. గురువారం శ్రీలంకకు చేరుకునే పాకిస్తాన్ ఒకరోజు విశ్రాంతి అనంతరం మ్యాచ్ బరిలోకి దిగనుండగా... సోమవారం పల్లెకెలె మైదానంలోనే నేపాల్‌ను భారత్ ఎదుర్కొంటుంది.

కోకో గాఫ్ అలవోకగా...

- మూడో రౌండ్‌లోకి అమెరికా టీనేజ్ స్టార్
- ఏడో సీడ్ గార్సియా, వీనస్ ఓటమి


కోకో గాఫ్

న్యూయార్క్: సొంతగడ్డపై అమెరికా టీనేజ్ స్టార్ కోకో గాఫ్ మెరిసింది. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 19 ఏళ్ల గాఫ్ 6-3, 6-2తో మిరా ఆంద్రీవా (రష్యా)పై గెలిచింది. 76 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో గాఫ్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 18 సార్లు దూసుకొచ్చి 15 సార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు ఏడో సీడ్ గార్సియా (ఫ్రాన్స్), 2000, 2001 చాంపియన్ వీనస్ విలియమ్స్ (అమెరికా), 12వ సీడ్ క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. గార్సియా 4-6, 1-6తో యఫాన్ వాంగ్ (చైనా) చేతిలో, వీనస్ 1-6, 1-6తో గ్రీట్ మినెన్ (బెల్జియం) చేతిలో, క్రిచికోవా 4-6, 6-7 (3/7)తో లూసియా బ్రోన్‌జెట్టి (ఇటలీ) చేతిలో ఓడిపోయారు. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఆరో సీడ్ సినెర్ (ఇటలీ) రెండో రౌండ్‌లోకి చేరారు.

మరో విజయంపై నీరజ్ దృష్టి

నేడు డైమండ్ లీగ్ మీట్‌లో పోటీపడనున్న భారత స్టార్



జ్యూరిక్ (స్విట్జర్లాండ్): ఈ ఏడాది బరిలోకి దిగిన ప్రతి టోర్నీలోనూ అగ్రస్థానంలో నిలిచిన ఒలింపిక్, ప్రపంచ చాంపియన్, భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మరో విజయంపై దృష్టి సారించాడు. ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్‌లో భాగంగా నేడు జ్యూరిక్‌లో జరిగే మీట్‌లో నీరజ్ పోటీపడనున్నాడు. ఈ సీజన్‌లో నీరజ్ రెండు డైమండ్ లీగ్ మీట్‌లలో (మే 5 దోహా; జూన్ 30 లుజానె) అగ్రస్థానంలో నిలిచాడు. అనంతరం ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. నేడు అర్ధరాత్రి 12 తర్వాత మొదలయ్యే జావెలిన్ త్రో ఈవెంట్‌లో నీరజ్‌తోపాటు జాకుబ్ వాద్లెచ్ (చెక్ రిపబ్లిక్), ప్రపంచ మాజీ చాంపియన్ పీటర్స్ అండర్సన్ (గ్రెనెడా), వెబెర్ (జర్మనీ) తదితర స్టార్స్ పోటీపడనున్నారు.

ప్రపంచ చాంపియన్‌షిప్ కోసం బిడ్..!

2027 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆతిథ్య హక్కుల కోసం భారత్ బిడ్ వేస్తుందని బుధవారం ఇక్కడి మీడియాతో నీరజ్ చోప్రా వ్యాఖ్యానించాడు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోద ముద్ర లభిస్తే భారత అథ్లెటిక్స్ సమాఖ్య చొరవ తీసుకుంటుంది. 2027 ప్రపంచ చాంపియన్‌షిప్ నిర్వహణ కోసం అక్టోబర్ 2లోపు బిడ్ దాఖలు చేయాలి. ఇప్పటికే 2027 ప్రపంచ చాంపియన్‌షిప్ ఆతిథ్యం కోసం బీజింగ్ తమ బిడ్ దాఖలు చేసింది.

సినిమా

రాఖీ స్పెషల్

సోదరుడికి ప్రేమతో...

అన్న గుండె ఆగిపోయిన క్షణాన చెల్లెలి గుండె ఆగిపోతుంది... అందుకే వెండితెరపై అన్నాచెల్లెలి అనుబంధం అనగానే వీరి 'రక్త సంబంధం' గుర్తుకు వస్తుంది. ఇంకా తెలుగు తెరపై అన్నా చెల్లెళ్ల అనుబంధంతో చాలా సినిమాలు వచ్చాయి.. ప్రేక్షకులను ఆకట్టుకున్న చిత్రాలు చాలానే ఉన్నాయి. ఈ రాఖీ పండగ సందర్భంగా ఓ పది సినిమాల గురించి చెప్పుకుందాం..



రక్త సంబంధం (1962)

ఎన్టీఆర్-సావిత్రి.. తెలుగు చిత్ర పరిశ్రమలో జంటగా ఎన్నో విజయాలను సొంతం చేసుకున్న 'హిట్ పెయిర్'. అలాంటి హిట్ జోడీని అన్నా-చెల్లెలిగా చూపించే సాహసం చేసి, 'రక్త సంబంధం' చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు వి. మధుసూదనరావు. ఈ అన్నాచెల్లెలి అనుబంధానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఎన్టీఆర్, కాంతారావు, సావిత్రి, దేవిక, సూర్యకాంతం ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'రక్త సంబంధం'. తమిళంలో ఘనవిజయం సాధించిన 'పాస మలర్' సినిమాకి రీమేక్‌గా 'రక్త సంబంధం' రూపొందింది. హీరో-హీరోయిన్లుగా అలరించిన ఎన్టీఆర్-సావిత్రిలు 'రక్త సంబంధం'లో అన్నా, చెల్లెలు పాత్రల్లో జీవించారు. ఈ సినిమా క్లైమాక్స్‌లో రాజు (ఎన్టీఆర్), రాధ (సావిత్రి) ఒకేసారి ప్రాణాలు వదలడం ప్రేక్షకుల చేత కన్నీళ్లు తెప్పిస్తుంది. మరణం కూడా విడదీయలేనంత అనుబంధం రాజు-రాధలది. అందుకే అన్నా చెల్లెళ్ల అనుబంధం అనగానే.. ముందుగా గుర్తుకు వచ్చేది 'రక్త సంబంధం' చిత్రమే.



బంగారు గాజులు (1968)

రాము (నాగేశ్వరరావు), రాధ (విజయనిర్మల) అన్నాచెల్లెళ్లు. చెల్లెలి చేతికి బంగారు గాజులు తొడగాలని రాము ఆశ పడతాడు. ఇందుకోసం డబ్బు కూడబెడుతుంటాడు. ఓ రైస్ మిల్లులో రాము డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. అయితే ఆ రైస్ మిల్లు యజమాని రావూజీ కన్ను రాధపై పడుతుంది. రాధను బలవంతం చేయబోతాడు రావూజీ. ఆ సమయంలో రాధ తప్పించుకుంటుంది. ఇదే సమయంలో రాము హంతకుడనే నిందను మోపి అతన్ని జైలుపాలు చేస్తాడు రావూజీ. చెల్లెలిని వెతుక్కునే క్రమంలో రాము హైదరాబాద్‌కి వచ్చి రాధను చూస్తాడు. కానీ రాధ గుర్తు పట్టదు. దీంతో రాము ఆశ్చర్యానికి గురవుతాడు. కానీ హైదరాబాద్‌లో కనిపించిన రాధను తన చెల్లెలిగానే భావిస్తాడు. ఏదో తెలియని ఆత్మీయతతో రామును కూడా రాధ అన్నయ్యలానే భావిస్తుంటుంది. అయితే ఇద్దరు రాధలు ఉన్నారని, ఈ ఇద్దరు కవలలని, అందుకే రాముని హైదరాబాద్‌లో ఉన్న రాధ గుర్తుపట్టలేక పోయిందన్నది ట్విస్ట్. ఈ ఇద్దరు చెల్లెళ్లకు బంగారు గాజులు తొడుగుతాడు రాము. నాగేశ్వరరావు, విజయనిర్మల ముఖ్య తారాగణంగా భారతి, పద్మనాభం, గీతాంజలి కీలక పాత్రల్లో నటించిన 'బంగారు గాజులు' సినిమాకు సీఎస్‌రావు దర్శకత్వం వహించారు.



చెల్లెలి కాపురం (1971)

రాము (శోభన్‌బాబు)కు చెల్లెలు (మణిమాల) అంటే చాలా ఇష్టం. చెల్లికి పెళ్లి చేయాలని డబ్బు సంపాదించడం కోసం పట్నంలో అడుగుపెట్టిన రాముకు అతని స్నేహితుడు శ్రీరామ్ (నాగభూషణం) తారసపడతాడు. స్వతహాగా రచయిత అయిన రాము తన రచనలతో డబ్బులు సంపాదించాలనుకుంటాడు. కానీ రాము ఆహార్యం చూసి, అతని రచనలను అచ్చు వేసేందుకు ప్రచురణ కర్తలెవరూ ముందుకు రారు. రాము విజ్ఞప్తి మేరకు అతని స్నేహితుడైన శ్రీరామ్.. రాము రచనలను తన రచనలుగా పబ్లిష్ చేయించుకుని, కీర్తి ప్రతిష్ఠలు సంపాదిస్తాడు. ఈ క్రమంలోనే రాము చెల్లిని శ్రీరామ్ వివాహం చేసుకుంటాడు. ఆ తర్వాత రాము చెల్లిని ఎలాంటి కష్టాలు పెట్టాడు? ఆ కష్టాల నుంచి ఆమెను రాము, అతన్ని ప్రేమించే రాధ (వాణీ శ్రీ) ఎలా కాపాడారు? శ్రీరామ్ తన తప్పు తాను తెలుసుకునేలా రాధ ఏం చేసింది? అన్నదే కథ. కె. విశ్వనాథ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.




పల్నాటి పౌరుషం (1994)

రెండు కుటుంబాల మధ్య జరిగే కథతో రూపొందిన చిత్రం 'పల్నాటి పౌరుషం'. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కృష్ణంరాజు (భీమినేని బ్రహ్మన్న), రాధిక (సీత) అన్నా చెల్లెలి పాత్రల్లో నటించారు. తనకెంతో ఇష్టమైన చెల్లిని (సీత) వేరే ఊర్లోని రాజారావ్ (చరణ్‌రాజ్)కి ఇచ్చి వివాహం జరిపిస్తాడు బ్రహ్మన్న. అయితే రాజారావ్ బావమ్మర్ది సూరిబాబు (సురేశ్)కి బ్రహ్మన్న అంటే ఇష్టం ఉండదు. దీంతో కుట్రలతో ఇరు కుటుంబాల్లో కలహాలు తీసుకొస్తాడు సూరిబాబు. ఆ కలహాలకి తన భర్తే కారకుడని తెలుసుకున్న సూరిబాబు భార్య ఆత్మహత్య చేసుకుంటుంది. ఆమె మృతికి బావ బ్రహ్మన్నే కారణమని భావించి, అన్నని కలవొద్దని తన భార్య సీతకు ఆంక్ష విధిస్తాడు రాజారావ్. ఆ తర్వాత బ్రహ్మన్న, సీతలకు నిజం ఎలా తెలుస్తుంది? ఈ కుటుంబాలను కలపడంలో తర్వాతి తరం పాత్ర ఎంత... అన్నదే 'పల్నాటి పౌరుషం' కథాంశం. తమిళ హిట్ మూవీ 'కిళక్కు సీమయిలే'కు రీమేక్ ఇది.



హిట్లర్ (1997)

మాధవరావు అలియాస్ హిట్లర్ (చిరంజీవి)కు ఐదుగురు శారద (అశ్వని), అనుపమ (మోహిని), లక్ష్మి (పద్మశ్రీ), గాయత్రి (గాయత్రి), సరస్వతి (మీనాకుమారి) చెల్లెళ్లు. మాధవరావు చిన్నతనంలోనే తల్లి మరణించడం, తండ్రి జైలుపాలు కావడంతో ఐదుగురి చెల్లెళ్ల బాధ్యత అతనిపైనే పడుతుంది. చాలా కష్టపడి, వారిని పెంచి, పెద్ద చేస్తాడు మాధవరావు. తన రెండో చెల్లి మోహిని ప్రేమను మాధవరావు సరిగా అర్థం చేసుకోకపోవడం, మొదటి చెల్లి శారద కాపురంలోని ఇబ్బందులు, సవతి తల్లి ఇద్దరు కూతుళ్లను చేరదీయడం వంటి కారణాలతో మాధవరావుకు, అతని చెల్లెళ్లకు మధ్య మనస్పర్థలు వస్తాయి. మరి.. మాధవరావుకు, అతని చెల్లెళ్లకు మధ్య ఉన్న అభిప్రాయభేదాలను బాలు (మోహిని భర్త, మాధవరావు మామయ్య కొడుకు రాజేంద్రప్రసాద్) ఎలా పరిష్కరిస్తాడు? మాధవరావు, అతని చెల్లెళ్లు తిరిగి ఎలా కలుస్తారు? ఇందులో బుజ్జి (రంభ) పాత్ర ఏమిటన్నదే 'హిట్లర్' కథాంశం. సిద్దిఖీ దర్శకత్వంలో రూపొందిన మలయాళ హిట్ ఫిల్మ్ 'హిట్లర్'కు తెలుగు రీమేక్ 'హిట్లర్'లో చిరంజీవి హీరోగా నటించారు. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వం వహించారు.



శివరామరాజు (2002)

పూసపాటి శివరామరాజు (జగపతిబాబు), రామరాజు (వెంకట్), రుద్రరాజు (శివాజీ) అన్నదమ్ములు. ఈ ముగ్గురి అన్నదమ్ములకు ఏకైక చెల్లెలు స్వాతి (మోనికా). అయితే శివరామరాజు కుటుంబంపై పగ తీర్చుకోవడం కోసం శత్రువర్గం నాటకం ఆడి స్వాతిని తమ ఇంటి కోడలుగా చేసుకుంటుంది. ఈ పెళ్లి తర్వాత శివరామరాజు, రామరాజు, రుద్రరాజు తమ ఆస్తిని కోల్పోయి పేదవాళ్లు అయిపోతారు. తనవల్ల పేదరికంలో జీవిస్తున్న అన్నలను చూసి స్వాతి కుమిలిపోతుంటుంది. స్వాతిని అత్తింటి వేధింపుల నుంచి శివరామరాజు ఎలా కాపాడాడన్నదే చిత్రకథ. అన్నా చెల్లెళ్ల సెంటిమెంట్ నేపథ్యంలో వి. సముద్ర ఈ సినిమాకి దర్శకత్వం వహించారు.



అర్జున్ (2004)

అర్జున్ (మహేశ్‌బాబు), మీనాక్షి (కీర్తి రెడ్డి) కవలలు. మీనాక్షి, ఉదయ్ (రాజా) ప్రేమించుకుంటారు. తనకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని మీనాక్షికి ఉదయ్ ఓ లేఖ రాస్తాడు. ఈ లేఖను అర్జున్‌కు చూపిస్తుంది మీనాక్షి. దీంతో ఉదయ్ తల్లిదండ్రులు బాలానాయర్ (ప్రకాశ్‌రాజ్), ఆండాళ్ (సరిత) అతనికి చేయాలనుకున్న అమ్మాయితో కాకుండా, మీనాక్షితో వివాహం జరిగేలా చేస్తాడు అర్జున్. అంతా బాగానే ఉందనుకుంటున్న తరుణంలో బాలానాయర్, ఆండాళ్‌లు కలిసి మీనాక్షిని చంపి, ఉదయ్‌కు మరో అమ్మాయితో వివాహం చేయాలనుకుంటున్నారనే ఆలోచనలో ఉన్నట్లుగా అర్జున్‌కు తెలుస్తుంది. అప్పుడు మీనాక్షిని రక్షించేందుకు సోదరుడిగా అర్జున్ ఏం చేశాడు? మధుర మీనాక్షి అమ్మవారి సాక్షిగా మీనాక్షిని ఎలా కాపాడుకున్నాడు- అన్నదే అర్జున్ కథ. గుణశేఖర్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది.



'పుట్టింటికి రా చెల్లి' (2004)

చిన్నతనంలోనే శివన్న (అర్జున్) తల్లి కన్నుమూస్తుంది. దీంతో చెల్లెలు లక్ష్మి (మధుమిత) ఆలనాపాలన శివన్నపై పడుతుంది. సేద్యం చేస్తూ చెల్లెల్ని చదివిస్తాడు శివన్న. తన చెల్లెలు ప్రేమించిన అజయ్ (శ్రీనాథ్)తోనే ఆమె వివాహం జరిపిస్తాడు. ఈ పెళ్లి ఇష్టం లేని అజయ్ కుటుంబ సభ్యులు లక్ష్మిని నిత్యం వేధిస్తుంటారు. అంతేకాదు.. ఎలాగైనా లక్ష్మి ఇంట్లో నుంచి వెళ్లిపోయేలా చేసేందుకు ఓ పెద్ద నింద వేస్తారు. అది నమ్మిన అజయ్ గర్భవతిగా ఉన్న లక్ష్మిని పట్టించుకోడు. పుట్టింటికి రమ్మని శివన్న వచ్చి లక్ష్మిని వేడుకుంటాడు. నిందతో రాను.. నిప్పులా వస్తానని అన్నకు చెబుతుంది లక్ష్మి. ఆ తర్వాత లక్ష్మిపై పడ్డ నిందని శివన్న ఎలా చెరిగిపోయేలా చేశాడు- అనే కథాంశంతో 'పుట్టింటికి రా చెల్లి' సినిమా రూపొందింది. అర్జున్, మీనా జంటగా కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన చిత్రమిది.



రాఖీ (2006)

అల్లారుముద్దుగా పెరిగిన తన చెల్లి చావుకి కారణమైన ఆమె అత్తింటి వారిపై ఓ అన్నగా, తోడ పుట్టకపోయినా.. సమాజంలోని కొందరు యువతులపై దౌర్జన్యం చేసినవారిపై రాఖీ బ్రదర్‌గా రామకృష్ణ ఎలా పగ తీర్చుకున్నాడు? అనే కథాంశంతో 'రాఖీ' సినిమా రూపొందింది. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎన్టీఆర్ హీరోగా నటించారు. రామకృష్ణ అలియాస్ రాఖీ (ఎన్టీఆర్)కి చెల్లెలు గాయత్రి (మంజూష) అంటే అమితమైన ప్రేమ. ఐదు లక్షల కట్నం ఇచ్చి రవివర్మతో గాయత్రి వివాహం జరిపిస్తారు రాఖీ, కుటుంబ సభ్యులు. అయితే తన కొడుక్కి కోటి రూపాయల కట్నం వస్తుందని తెలుసుకొని మూడు నెలల గర్భవతి అయిన గాయత్రిని కిరోసిన్ పోసి చంపేస్తారు అత్తింటివారు. కానీ, వారు నిర్దోషులంటూ కోర్టులో కేసు కొట్టేస్తారు. దీంతో తన చెల్లిని చంపిన అత్తింటి వారందర్నీ కారుతో సహా పెట్రోల్ పోసి తగులబెడతాడు రాఖీ. తన చెల్లెలి కేసుకు వ్యతిరేకంగా వాదించిన లాయర్‌ని, దొంగ సాక్ష్యం ఇచ్చిన డాక్టర్‌ని, పోలీసు అధికారులని కూడా పెట్రోల్ పోసి తగులబెడతాడు. ఆ తర్వాత ఏ మహిళకు అన్యాయం జరిగినా అందుకు కారకులైన వారిని పెట్రోల్ పోసి తగులబెడుతుంటాడు. వరుస హత్యలు చేస్తున్న రాఖీని పోలీసులు పట్టుకున్నాక కోర్టు అతనికి శిక్ష విధించిందా? అన్నది ఈ చిత్ర కథాంశం.



గోరింటాకు (2008)

అశోక్ (రాజశేఖర్)కి చెల్లెలు లక్ష్మి (మీరా జాస్మిన్) అంటే పంచప్రాణాలు. చిన్నతనంలోనే తల్లితండ్రులు చనిపోవడంతో అన్నీ తానై చెల్లెల్ని పెంచి పెద్ద చేస్తాడు అశోక్. చెల్లికి పెళ్లి అయ్యేవరకు తాను కూడా చేసుకోకూడదనుకుంటాడు. చెల్లెలు ప్రేమించిన అబ్బాయి ఆకాశ్‌కి ఇచ్చి పెళ్లి చేస్తాడు. అయితే ఆకాశ్‌ని ఆస్తి కోసం అయినవాళ్లే మోసం చేసి, జైలుకి పంపిస్తారు. ఈ విషయాన్ని అన్నయ్యకి చెప్పి, సాయం అడుగుదామని ఇంటికి వచ్చిన లక్ష్మిని.. అశోక్ భార్య నందిని (ఆర్తి అగర్వాల్) అవమానించి పంపించేస్తుంది. భర్త జైలులో ఉండటం..అన్నయ్యను కలిసే అవకాశం లేకపోవడం.. పిల్లలు ఆకలితో అలమటిస్తుండడంతో.. ఏం చేయాలో పాలుపోని లక్ష్మి.. పిల్లలతో సహా బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంటుంది. విషయం తెలిసి లక్ష్మి భౌతిక కాయం వద్ద అశోక్ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ.. అక్కడే ప్రాణాలు విడవడం ప్రేక్షకులతో కన్నీరు పెట్టిస్తుంది. కన్నడ హిట్ 'అన్న తంగి'కి రీమేక్‌గా వీఆర్ ప్రతాప్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. కాగా, 2008 నుంచి ఇప్పటివరకు అన్నాచెల్లెళ్ల అనుబంధం నేపథ్యంలో పలు చిత్రాలు వచ్చాయి. ఇటీవల 'భోళా శంకర్'లో చిరంజీవి, కీర్తీ సురేశ్, రెండేళ్ల క్రితం వచ్చిన 'పెద్దన్న'లో రజనీకాంత్, కీర్తీ సురేశ్ అన్నాచెల్లెళ్లుగా నటించిన విషయం తెలిసిందే.

సాక్షి బిజినెస్
గురువారం
31-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
11	5
65,087	19,347

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్డాక్	14,030	▲	86
డోజోన్స్	34,910	▲	58
ఎఫ్టీఎస్ఈ 100	7,474	▲	9
డాక్స్	15,892	▽	39
షాంఘై	3,137	▲	1
నికాయ్	32,333	▲	106

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,292	▲	423
బంగారం (99.5 స్వచ్ఛత)	59,055	▲	422
వెండి (కిలో)	76,661	▲	880

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	81.91	83.58
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	102.83	106.21
€	యూరో	ఎకటం	88.41	91.50
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	55.73	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	52.42	54.72
S$	సింగపూర్ డాలర్	ఎకటం	60.22	62.18
SAR	సౌదీ రియాల్	ట్రావెలర్స్	21.11	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	ట్రావెలర్స్	21.63	23.42
¥	చైనా యువాన్	ట్రావెలర్స్	10.23	12.30

చిన్న సంస్థలకు రుణాలపై పీఎన్బీ ఫోకస్..

జీఎస్టీ ఇన్వాయిస్ ద్వారా లోన్లు



న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణ లభ్యతను పెంచడంపై ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ) మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా జీఎస్టీ ఇన్వాయిస్ల ఆధారంగా కూడా రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం జీఎస్టీ సహాయ్ పేరిట యాప్ను ప్రారంభించింది. మొత్తం రుణ లావాదేవీ అంతా డిజిటల్ విధానంలో, తక్కువ వ్యయాలతో, వేగవంతంగా, సులభతరంగా జరిగేందుకు ఈ యాప్ సహాయపడగలదని బ్యాంక్ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ తెలిపారు. ఈ సర్వీస్ ద్వారా రుణం నేరుగా .. పీఎన్బీలోని రుణగ్రహీత కరెంటు అకౌంటులోకి జమవుతుందని ఆయన వివరించారు. జీఎస్టీ ఇన్వాయిస్ల ద్వారా ఎంఎస్ఎంఈలకు రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చిన తొలి ప్రభుత్వ రంగ బ్యాంక్ తమదేనని గోయెల్ చెప్పారు.

హైదరాబాద్లో పెరిగిన ఇళ్ల ధరలు

- జూన్ త్రైమాసికంలో 7 శాతం అధికం
- 43 పట్టణాల్లో ఇదే పరిస్థితి
- నేషనల్ హౌసింగ్ బ్యాంక్ డేటా వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల ధరలు జూన్ త్రైమాసికంలో 6.9 శాతం పెరిగినట్టు నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్హెచ్బీ) విడుదల చేసిన 'హౌసింగ్ ప్రైస్ ఇండెక్స్' డేటా తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా 43 పట్టణాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కరోనా ముందు నాటితో పోలిస్తే గృహ రుణాల రేట్లు ఇప్పటికీ తక్కువగానే ఉన్నాయని, దీంతో ఇళ్ల ధరల అందుబాటు ఆరోగ్యకర స్థాయిలో ఉన్నట్టు ఎన్హెచ్బీ నివేదిక తెలిపింది. అహ్మదాబాద్లో ఇళ్ల ధరలు 9.1 శాతం పెరగ్గా, బెంగళూరులో 8.9 శాతం, కోల్కతాలో 7.8 శాతం చొప్పున ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో ఎగిశాయి. చెన్నైలో 1.1 శాతం, ఢిల్లీలో 0.8 శాతం, ముంబైలో 2.9 శాతం, పుణేలో 6.1 శాతం చొప్పున ఇళ్ల ధరలు పెరిగాయి. ఎన్హెచ్బీ హౌసింగ్ ప్రైస్ ఇండెక్స్ 50 పట్టణాల్లోని ప్రాపర్టీల విలువల సమాచారాన్ని బ్యాంక్లు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీల నుంచి తీసుకుని ప్రతి త్రైమాసికానికి నివేదిక విడుదల చేస్తుంటుంది. మొత్తం మీద 50 పట్టణాల్లో ఇళ్ల ధరలు జూన్ క్వార్టర్లో, క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చినప్పుడు 4.8 శాతం వృద్ధి చెందాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇళ్ల రేట్ల పెరుగుదల 7 శాతంగా ఉండడం గమనార్హం. ఇక ఈ ఏడాది మార్చి త్రైమాసికంతో పోల్చి చూసినప్పుడు 50 పట్టణాల్లో ఇళ్ల ధరలు 0.7 శాతం పెరిగాయి. 2021 జూన్ నుంచి ప్రతీ త్రైమాసికంలోనూ ఇళ్ల ధరల సూచీ పెరుగుతూ వస్తోందని ఎన్హెచ్బీ నివేదిక వెల్లడించింది.

ఫోన్పే నుంచి స్టాక్ బ్రోకింగ్ సర్వీసులు

షేర్డాట్మార్కెట్ ప్లాట్ఫాం ఆవిష్కరణ



బెంగళూరు: ఫిన్టెక్ సంస్థ ఫోన్పే తాజాగా స్టాక్ బ్రోకింగ్ విభాగంలోకి ప్రవేశించింది. షేర్డాట్ మార్కెట్ పేరిట ప్రత్యేక ప్లాట్ఫాంను ప్రారంభించింది. బీఎస్ఈ ఎండీ సుందరరామన్ రామమూర్తి బుధవారం దీన్ని ఆవిష్కరించారు. ప్రాథమికంగా స్టాక్స్, ఈటీఎఫ్లతో ప్రారంభించి క్రమంగా ఫ్యూచర్స్, ఆప్షన్స్ తదితర సెగ్మెంట్స్ను కూడా ఇందులో అందుబాటులోకి తేనుంది. దీనికి ఉజ్వల్ జైన్ సీఈవోగా వ్యవహరిస్తారు. స్టాక్ బ్రోకింగ్ సెగ్మెంట్లోకి ఎంట్రీ ద్వారా తమ ఆర్థిక సేవల పోర్ట్ఫోలియో సంపూర్ణమైందని ఫోన్పే వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ నిగమ్ తెలిపారు. మరోవైపు, 2025 నాటికల్లా ఫోన్పే నిర్వహణ లాభాలను సాధించే అవకాశం ఉందని సమీర్ నిగమ్ తెలిపారు.

ఆఖర్లో లాభాల స్వీకరణ

మూడో రోజూ స్వల్ప లాభాలతో క్లోజ్



ముంబై: ఆఖర్లో అమ్మకాలు తలెత్తడంతో బుధవారం స్టాక్ సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఆగస్టు నెలవారీ ఎఫ్ అండ్ఓ డెరివేటివ్స్ ముగింపు, దేశీయ క్యూ1 జీడీపీ వృద్ధి డేటాతో సహా కీలక స్థూల ఆర్థిక గణాంకాల విడుదల(నేడు)కు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఆయిల్అండ్ గ్యాస్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా ట్రేడింగ్లో 406 పాయింట్లు బలపడిన సెన్సెక్స్ చివరికి 11 పాయింట్ల లాభంతో 65,087 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 110 పాయింట్లు పెరిగిన నిఫ్టీ అయిదు పాయింట్ల లాభంతో 19,347 వద్ద స్థిరపడింది. మెటల్, ఐటీ, రియల్టీ, ఆటో, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు రాణించాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జియో ఫైనాన్షియల్ సర్వీసెస్(జేఎఫ్ఎస్) షేరు వరుసగా మూడో రోజూ అప్పర్ సర్క్యూట్ను తాకింది. ఇటీవల ఆర్ఐఎల్ ఏజీఎం సమావేశంలో జేఎఫ్ఎస్ బీమా, మ్యూచువల్ ఫండ్స్ వ్యాపారాల్లోకి విస్తరిస్తుందని కంపెనీ అధినేత ముకేశ్ అంబానీ చేసిన ప్రకటన ఈ షేరు ర్యాలీకి దోహదపడుతున్నాయి. తాజాగా బుధవారం బీఎస్ఈలో 5% ఎగసి రూ.233 వద్ద అప్పర్ సర్క్యూట్ వద్ద లాకైంది.
- గోకుల్ దాస్ ఎక్స్పోర్ట్స్ షేరు ర్యాలీ రెండో రోజూ కొనసాగింది. బీఎస్ఈలో 19% ఎగసి రూ.874 వద్ద స్థిరపడింది. యూఈఏకి చెందిన దుస్తుల తయారీ కంపెనీ అట్రాకోను 55 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.455 కోట్లు)కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడం ఈ షేరు ర్యాలీకి కారణమవుతోంది.

ఐటీ హార్డ్వేర్ పీఎల్ఐ.. 32 దరఖాస్తులు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఐటీ హార్డ్వేర్ పీఎల్ఐ కింద మొత్తం 32 కంపెనీలు దరఖాస్తు చేసుకున్నట్టు మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. హెచ్పీ, డెల్, లెనోవో తదితర బహుళ జాతి కంపెనీలు సైతం దరఖాస్తులు సమర్పించినట్టు మంత్రి చెప్పారు. ఈ పథకం కింద కేంద్రం ప్రోత్సాహకాల మద్దతుతో రూ.3.35 లక్షల కోట్ల అదనపు తయారీ దేశీయంగా నమోదవుతుందన్నారు. "విశ్వసనీయ సప్లయ్ చైన్ భాగస్వామిగా, విలువను జోడించే భాగస్వామిగా భారత్ అవతరిస్తోంది. తయారీ, డిజైన్ కోసం కంపెనీలు భారత్కు వచ్చేందుకు సుముఖంగా ఉన్నాయి. ఇప్పటి వరకు ఐటీ హార్డ్వేర్ పీఎల్ఐ కింద 32 దరఖాస్తులు వచ్చాయి. ఈ స్పందన అంచనా వేసిన దాని కంటే ఎక్కువగా ఉంది" అని మంత్రి తెలిపారు.

డీల్స్ @ రూ. 60,000 కోట్లు!

- ఆగస్టులో షేర్ల బ్లాక్ డీల్స్లో రికార్డ్
- కోఫోర్జ్లో రూ. 7,684 కోట్ల విలువైన వాటా సేల్
- అదానీ పవర్లో రూ. 7,412 కోట్ల షేర్ల విక్రయం



ముంబై: ఓ వైపు దేశీ స్టాక్ మార్కెట్లు ఈ నెల(ఆగస్ట్)లో ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ మరో పక్క లిస్టెడ్ కార్పొరేట్ ప్రపంచంలో భారీస్థాయి విక్రయ లావాదేవీలు జోరుగా సాగుతున్నాయి. గత ఐదు నెలల తదుపరి ఆగస్ట్లో మార్కెట్లు కొంతమేర వెనకడుగు వేయగా.. షేర్ల అమ్మకపు డీల్స్ కొత్త రికార్డ్కు తెరతీశాయి. ఒక పరిశీలన ప్రకారం ఈ నెలలో 29 వరకూ మొత్తం రూ. 60,000 కోట్ల మేర భారీ బ్లాక్డీల్స్ జరిగాయి. క్యాలెండర్ ఏడాదిలోని ఏ నెలలోనైనా విలువరీత్యా ఇవి అత్యధికం కాగా.. రెండు భారీ డీల్స్ ఇందుకు దోహదపడ్డాయి. సాఫ్ట్వేర్ సేవల దేశీ కంపెనీ కోఫోర్జ్(గతంలో ఎన్ఐఐటీ టెక్నాలజీస్)లో రూ. 7,684 కోట్ల విలువైన ఈక్విటీని పీఈ దిగ్గజం బేరింగ్ అనుబంధ కంపెనీ హల్ట్ విక్రయించింది. ఇదేవిధంగా ప్రయివేట్ రంగ విద్యుత్ కంపెనీ అదానీ పవర్లో ప్రమోటర్ గ్రూప్ రూ. 7,412 కోట్ల విలువైన షేర్లను యూఎస్ దిగ్గజం జీక్యూజీ పార్ట్నర్స్కు విక్రయించింది. ఈ బాటలో ఇండిగో బ్రాండు విమానయాన సేవల కంపెనీ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్లో సహవ్యవస్థాపకుడు రాకేష్ గంగ్వాల్ కుటుంబం 3 శాతం వాటాను రూ. 2,802 కోట్లకు విక్రయించింది. దేశీ డిజిటల్ పేమెంట్స్ కంపెనీ పేటీఎమ్లో చైనా దిగ్గజం అలీబాబా గ్రూప్ కంపెనీ యాంట్ఫిన్ రూ. 2,037 కోట్ల విలువైన వాటాను అమ్మివేయగా.. ఆన్లైన్ ఫుడ్ సర్వింగ్ ప్లాట్ఫామ్ జొమాటోలో పీఈ దిగ్గజం టైగర్ గ్లోబల్ 1.44 శాతం వాటాను రూ. 1,124 కోట్లకు విక్రయించింది.

మార్కెట్ల వెనకడుగు..

ఈ ఏడాది జూలై 20న దేశీ స్టాక్ మార్కెట్ల ప్రామాణిక ఇండెక్స్ సెన్సెక్స్ సరికొత్త గరిష్టం 67,500 పాయింట్లను అధిగమించింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం దాదాపు 20,000 పాయింట్ల స్థాయికి చేరింది. ఈ రికార్డ్ స్థాయిల నుంచి సెన్సెక్స్, నిఫ్టీ నిజానికి ఆగస్ట్లో 3 శాతం వెనకడుగు వేశాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 65,100, నిఫ్టీ 19,350 వద్ద కదులుతున్నాయి. అయితే దేశీయంగా అదనపు లిక్విడిటీ, మిడ్, స్మాల్క్యాప్స్నకు విస్తరించిన యాక్టివిటీ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడుల జోరు వంటి అంశాలు.. ఈ నెలలో భారీ స్థాయి లావాదేవీలకు కారణమవుతున్నట్లు కార్పొరేట్ వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికితోడు దేశ ఆర్థిక వ్యవస్థపై మధ్య, దీర్ఘకాలిక వృద్ధి అంచనాలు, స్టాక్ మార్కెట్ భవిష్యత్పై పెరుగుతున్న ఇన్వెస్టర్ల విశ్వాసం జత కలుస్తున్నట్లు తెలియజేశాయి.

ఇతర స్టాక్స్లోనే..

ప్రధానంగా ఇండెక్సేతర కంపెనీలలోనే ఇటీవల వాటాల విక్రయాలలో భారీ లావాదేవీలు నమోదైనట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో మొత్తం మార్కెట్లో జరుగుతున్న అంశాలను సెన్సెక్స్ లేదా నిఫ్టీ ప్రతిఫలించకపోవచ్చని తెలియజేశాయి. మ్యూచువల్ ఫండ్స్(ఎంఎఫ్లు), విదేశీ పోర్ట్ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్పీఐలు), పీఈ సంస్థలు తదితర దీర్ఘకాలిక ఇన్వెస్టర్లు స్వల్పకాలిక అంశాలను పరిగణనలోకి తీసుకోవని వివరించాయి. ఈ నెలలో మార్కెట్లు రికార్డ్ గరిష్టాల నుంచి కొంతమేర క్షీణించినప్పటికీ.. మిడ్, స్మాల్ క్యాప్స్ చరిత్రాత్మక గరిష్టాలకు చేరడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాయి. కాగా.. ఈ ఏడాది ఇప్పటివరకూ ఎన్ఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ 23% జంప్చేయగా.. నిఫ్టీ దాదాపు 7% ఎగసింది. ఇక జూన్లోనూ మొత్తం రూ. 50,000 కోట్ల విలువైన భారీ బ్లాక్ డీల్స్ నమోదుకావడం మార్కెట్ల లోతుకు నిదర్శనమని నిపుణులు విశ్లేషించారు.

జొమాటోలో వాటా విక్రయం

సాఫ్ట్బ్యాంక్ నుంచి 1.16% వాటా ఔట్



న్యూఢిల్లీ: జపనీస్ ఇన్వెస్ట్మెంట్ దిగ్గజం సాఫ్ట్బ్యాంక్ తాజాగా ఆన్లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్ఫామ్ జొమాటోలో 1.16 శాతం వాటా విక్రయించింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా 10 కోట్ల షేర్ల(1.16 శాతం వాటా)ను అమ్మివేసింది. అనుబంధ సంస్థ ఎస్వీఎఫ్ గ్రోత్(సింగపూర్) పీటీఈ షేరుకి రూ. 94.7 సగటు ధరలో రూ. 947 కోట్లకు విక్రయించింది. మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఏబీ సన్లైఫ్, యాక్సిస్, కొటక్ మహీంద్రాతోపాటు సొసైటీ జనరాలి, మోర్గాన్ స్టాన్లీ ఏషియా సింగపూర్, నోమురా సింగపూర్ తదితరాలు జొమాటో షేర్లను కొనుగోలు చేశాయి. ఈ లావాదేవీ తదుపరి జొమాటోలో సాఫ్ట్బ్యాంక్ వాటా 3.35% నుంచి 2.19 శాతానికి క్షీణించింది.

ఈ వార్తలతో జొమాటో షేరు 5.3 శాతం జంప్ చేసి రూ. 100 సమీపంలో ముగిసింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ, ఢిల్లీలో 30 పోస్టులు

న్యూఢిల్లీలోని డా.బీఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ, వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 30
» పోస్టుల వివరాలు: మెడికల్ ఆఫీసర్-01, సెక్షన్ ఆఫీసర్-04, సెక్యూరిటీ ఆఫీసర్-01, స్టాఫ్ నర్స్-01, సీనియర్ అసిస్టెంట్(జనరల్, సెక్రటేరియల్ సర్వీస్ అండ్ ఐటీ)-12, సెక్యూరిటీ సూపర్వైజర్-02, స్పోర్ట్స్ కోచ్-02, స్టూడియో అసిస్టెంట్-01, అసిస్టెంట్(జనరల్)/అసిస్టెంట్ కమ్ కేర్టేకర్/డాక్యుమెంటేషన్ అసిస్టెంట్/అసిస్టెంట్(సెక్రటేరియల్ సర్వీసెస్)-06.
» అర్హత: సంబంధిత విభాగంలో 10+2, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, సీఏ, ఇంటర్ ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:08.09.2023
» వెబ్సైట్: https://aud.ac.in

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్లో నాన్ టీచింగ్ పోస్టులు

అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ డైరెక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 06
» పోస్టుల వివరాలు: రిజిస్ట్రార్-01, ఫైనాన్స్ ఆఫీసర్-01, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్-01, జూనియర్ ఇంజనీర్(సివిల్)-01, సెక్యూరిటీ అసిస్టెంట్-02.
» అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్లైన్ ద్వారా.
» ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:09.09.2023
» దరఖాస్తు హార్డ్కాపీని పోస్టులో పంపేందుకు చివరితేది: 21.09.2023.
» వెబ్సైట్: https://cuap.ac.in

సెంట్రల్ యూనివర్శిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్లో టీచింగ్ పోస్టులు

అనంతపురంలోని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్శిటీ.. డైరెక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 03
» పోస్టుల వివరాలు: ప్రొఫెసర్(ఎకనామిక్స్)-01, అసోసియేట్ ప్రొఫెసర్(సైకాలజీ/ఇంగ్లిష్)-02.
» అర్హత: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:09.09.2023
» దరఖాస్తు హార్డ్కాపీని పోస్టులో పంపేందుకు చివరితేది: 21.09.2023.
» వెబ్సైట్: https://cuap.ac.in

ఎఫ్డీడీఐలో 62 పోస్టులు

ఫుట్వేర్ డిజైన్ అండ్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్(ఎఫ్డీడీఐ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 62
» పోస్టుల వివరాలు: డిప్యూటీ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, చీఫ్ టెక్నాలజిస్ట్, సీనియర్ టెక్నాలజిస్ట్ తదితరాలు.
» విభాగాలు: కెమికల్ ల్యాబొరేటరీ, కెమిస్ట్రీ, గార్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నాలజీ, లెదర్ గూడ్స్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్లో బీఈ/బీటెక్ /గ్రాడ్యుయేషన్/బీకామ్/బీఏ/బ్యాచిలర్స్ డిగ్రీ/డిప్లొమా/ఎంబీఏ పీజీడీఎం /మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 30 నుంచి 55 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.30,000 నుంచి రూ.1.5 లక్షలు చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: స్కిల్ టెస్ట్/రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఫ్యాకల్టీ హెచ్ఓ-హెచ్ఆర్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఫోర్త్ ఫ్లోర్, రూమ్ నెం.406, ఎఫ్డీడీఐ, నోయిడా, ఉత్తరప్రదేశ్-201301 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 05.09.2023.
» వెబ్సైట్: www.fddiindia.com

ఎన్ఎస్సీఎల్, న్యూఢిల్లీలో 89 పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్, కార్పొరేట్ ఆఫీస్.. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఎస్సీఎల్ రీజనల్/ఏరియా ఆఫీసుల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 89
» అర్హత: సంబంధిత విభాగంలో సీనియర్ సెకండరీ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్లైన్ దరఖాస్తులకు చివరితేది:25.09.2023
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది: 10.10.2023
» వెబ్సైట్: https://www.indiaseeds.com

టాప్ వర్సిటీల్లో పీహెచ్డీ

» ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ నోటిఫికేషన్ విడుదల
» జేఎన్యూ, డీయూ, బీహెచ్యూ, బీబీఏయూలలో అడ్మిషన్స్
» పీజీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అవకాశం



ఒకే పరీక్షతో నాలుగు ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో.. పీహెచ్డీలో ప్రవేశం పొందొచ్చు! అందుకు అవకాశం కల్పిస్తోంది.. ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ ఎగ్జామ్!! ఆర్ట్స్ నుంచి సైన్సెస్ వరకూ.. పలు విభాగాల్లో తమ అర్హతకు సరితూగే పేపర్లలో పరీక్షకు హాజరై.. ఆ స్కోర్తో పీహెచ్డీలో అడుగు పెట్టొచ్చు! నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే.. ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్కు తాజాగా నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎన్టీఏ పీహెచ్డీ ప్రవేశ పరీక్షకు అర్హతలు, విభాగాలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

పీహెచ్డీ ప్రవేశాల కోసం అభ్యర్థులు ప్రతి యూనివర్సిటీకి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి. దీనికి కొంత ఉపశమనం కలిగించేలా.. ఒకే ప్రవేశ పరీక్ష ద్వారా నాలుగు యూనివర్సిటీల్లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తోంది.. ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ టెస్ట్.

నాలుగు యూనివర్సిటీలు

ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ టెస్ట్లో స్కోర్ ఆధారంగా దేశంలోని నాలుగు ప్రతిష్టాత్మక కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందొచ్చు. అవి.. జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్యూ), ఢిల్లీ యూనిర్సిటీ(డీయూ), బెనారస్ హిందూ యూనివర్సిటీ(బీహెచ్యూ), బాబాసాహెబ్ భీమ్రావ్ అంబేడ్కర్ యూనివర్సిటీ.

ఆరు విభాగాలు

- ఈ నాలుగు యూనివర్సిటీల్లో అందుబాటులో ఉన్న పీహెచ్డీ ప్రోగ్రామ్ల మేరకు మొత్తం ఆరు విభాగాల్లో పలు సబ్జెక్టులలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. కామర్స్ అండ్ సైన్స్, ఆర్ట్ అండ్ కల్చర్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్, సైన్సెస్తోపాటు కామన్ సబ్జెక్ట్స్ విభాగం కూడా ఉంది.
- కామర్స్ అండ్ ఫైనాన్స్ విభాగంలో.. మూడు కోర్సులు; ఆర్ట్ అండ్ కల్చర్ విభాగంలో 8 కోర్సులు, హ్యూమానిటీస్ విభాగంలో 12 కోర్సులు, లాంగ్వేజెస్ విభాగంలో 19 కోర్సులు, సైన్సెస్ విభాగంలో 32 కోర్సులు, కామన్ సబ్జెక్ట్స్ విభాగంలో 24 కోర్సులు అందుబాటులో ఉంటాయి.

పీజీతో దరఖాస్తు అవకాశం

ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్కు పీజీ ఉత్తీర్ణతతో పోటీ పడే అవకాశం ఉంది. పీజీలో తాము చదివిన స్పెషలైజేషన్కు అనుగుణంగా ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్కు హాజరవ్వొచ్చు. పీజీ ఉత్తీర్ణత ఆధారంగానే పరీక్షకు అవకాశం ఉన్నప్పటికీ.. ఆయా యూనివర్సిటీలు పీహెచ్డీ ప్రవేశాలకు పేర్కొన్న అర్హత నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవడం ఉపయుక్తంగా ఉంటుంది. పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన అమలవుతోంది. గరిష్టంగా మూడు సబ్జెక్ట్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

మలి దశలో ప్రవేశ ప్రక్రియ

ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్లో స్కోర్ ఆధారంగా యూనివర్సిటీలు మలి దశలో ప్రత్యేక ప్రవేశ ప్రక్రియ నిర్వహిస్తాయి. అభ్యర్థులు ఆయా విశ్వవిద్యాలయాల నోటిఫికేషన్లకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తుతో పాటు ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ స్కోర్ను కూడా తెలియజేయాలి. ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న సబ్జెక్ట్ విభాగాలు, అందుబాటులో ఉన్న సీట్లను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులను షార్ట్లిస్ట్ చేస్తారు. ఇలా ఎంపికైన వారికి పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి ప్రవేశం ఖరారు చేస్తారు.

ఈ ఏడాది ప్రవేశాలకు మాత్రమే

ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ టెస్ట్ స్కోర్ను ఆయా యూనివర్సిటీల్లో ఈ విద్యా సంవత్సరం(2023-24)లో ప్రవేశాలకు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. స్కోర్ కార్డ్ డౌన్ లోడ్ సదుపాయాన్ని 2024, జనవరి 31 వరకే అందుబాటులో ఉంచుతామని ఎన్టీఏ వర్గాలు స్పష్టం చేశాయి.

రాత పరీక్ష.. రెండు విభాగాల్లో

- ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ టెస్ట్ను రెండు విభాగాల్లో 100 ప్రశ్నలతో నిర్వహిస్తారు. -మొదటి విభాగంలో రీసెర్చ్ మెథడాలజీ నుంచి 50 ప్రశ్నలు, రెండో విభాగంలో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు.
- ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు చొప్పున మొత్తం 400 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో నిర్వహిస్తారు.
- పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.
- నెగెటివ్ మార్కుల నిబంధన అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- ఆన్లైన్ దరఖాస్తు చివరి తేదీ: సెప్టెంబర్ 8, 2023
- ఆన్లైన్ దరఖాస్తు సవరణ: సెప్టెంబర్ 9-11 తేదీలు.
- పరీక్ష తేదీలు:నవంబర్లో నిర్వహించే అవకాశం.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్
- పూర్తి వివరాలకు వెబ్సైట్: https://phdentrance.samarth.ac.in

మంచి స్కోర్కు మార్గాలు

రీసెర్చ్ మెథడాలజీ

అభ్యర్థులు తాము పరీక్షకు హాజరవుతున్న విభాగానికి సంబంధించి పరిశోధన, నిర్వచనం, ఆ విభాగంలో ఇప్పటికే పూర్తయిన రీసెర్చ్, పరిశోధనల ఆవశ్యకత, ప్రాబ్లమ్ ఫైండింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, డేటా కలెక్షన్, డేటా ప్రాసెసింగ్ అండ్ అనాలిసిస్, ఇన్ఫర్మేషన్ సోర్సెస్, రీసెర్చ్ ఎథిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ స్టాటిస్టిక్స్కు సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా పరిశోధనలు, వాటి ఫలితాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి అవగాహన పెంచుకోవాలి.

సబ్జెక్ట్ విభాగం

సబ్జెక్ట్ విభాగానికి సంబంధించి అభ్యర్థులు పీజీ స్థాయిలో అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్తో ప్రిపరేషన్ సాగించాలి. తమ సబ్జెక్ట్లకు సంబంధించి ప్రస్తుతం ఉన్న సమస్యలు, వాటి పరిష్కారం దిశగా ఉపయోగపడే పరిశోధనల పరంగా అవగాహన పెంచుకోవాలి. అభ్యసనం చేసేటప్పుడే రీసెర్చ్ ఓరియెంటేషన్ అలవర్చుకోవడం లాభిస్తుంది.

ఫెలోషిప్

ఎన్టీఏ పీహెచ్డీ ఎంట్రన్స్ ద్వారా ప్రవేశం ఖరారు చేసుకున్న వారికి.. నాన్-నెట్ ఫెలోషిప్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం సైతం లభించే అవకాశం ఉంది. ఎంపికైన వారికి నెలకు రూ.8వేల ఫెలోషిప్ అందిస్తారు. దీంతోపాటు సైన్స్ విభాగాల అభ్యర్థులకు ఏడాదికి రూ.పది వేలు, నాన్-సైన్స్ అభ్యర్థులకు ఏడాదికి రూ.8వేలు చొప్పున కాంటింజెన్సీ గ్రాంట్ కూడా లభిస్తుంది.

కెరీర్ అవకాశాలు

పీహెచ్డీ పూర్తి చేయడం ద్వారా భవిష్యత్తులో ఎన్నో అవకాశాలను అందుకోవచ్చు. ముఖ్యంగా ఐఐసీటీ, సీఎస్ఐఆర్, ఐసీఏఆర్, ఎన్జీఐఆర్ఐ, ఇక్రిశాట్ తదితర సంస్థల్లో జూనియర్ సైంటిస్ట్లుగా అవకాశం లభిస్తుంది. బోధన రంగంలో పీహెచ్డీ ఫ్యాకల్టీగా కెరీర్ ప్రారంభించే వీలుంది. ప్రైవేటు సంస్థల ఆర్ అండ్ డీ విభాగాల్లో సైంటిస్ట్లుగా ప్రారంభంలోనే నెలకు రూ.2 లక్షల వేతనం అందుకోవచ్చు. పీహెచ్డీ పూర్తి చేసిన తర్వాత సొంత రీసెర్చ్ ప్రాజెక్ట్లను చేపట్టేందుకు సైతం అవకాశం లభిస్తుంది. ఇలాంటి అభ్యర్థులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డ్.. ఎక్స్ట్రా మ్యూరల్ రీసెర్చ్ ఫండింగ్, ఎర్లీ కెరీర్ రీసెర్చ్ అవార్డ్, నేషనల్ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ పేరుతో పలు పథకాలు అందుబాటులో ఉంచింది. ఏడాదికి రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు రీసెర్చ్ గ్రాంట్, నెలకు రూ.55 వేల ఫెలోషిప్, ఇతర రీసెర్చ్ ఖర్చుల కోసం ఓవర్ హెడ్స్ పేరుతో ఏడాదికి రూ.లక్ష మేర ఆర్థిక ప్రోత్సాహకాలు లభిస్తాయి.

క్లుప్తంగా...

గ్లోబల్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం సదస్సుకు ఉడుముల



సాక్షి, హైదరాబాద్: స్వీడన్‌లో వచ్చేనెల 19 నుంచి మూడురోజుల పాటు జరిగే గ్లోబల్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుల సదస్సులో హైదరాబాద్‌కు చెందిన పాత్రికేయుడు ఉడుముల సుధాకర్‌రెడ్డి పాల్గొననున్నారు. దక్షిణ స్వీడన్‌లోని ఫోజ మీడియా ఇన్‌స్టిట్యూట్ లిన్నెయస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగే సదస్సులో అవినీతి, అక్రమాలను అరికట్టేలా ప్రజలను చైతన్యపరిచేందుకు అవసరమైన సరికొత్త పద్ధతులపై 150 సెషన్స్ నిర్వహిస్తారు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టులు అనుసరించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సదస్సులో టెక్నిక్‌లు, అత్యాధునిక వర్క్‌షాప్‌లు, విస్తృత నెట్‌వర్కింగ్, టూల్స్ వంటి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఈ సదస్సుకు 100కు పైగా దేశాలనుంచి 2 వేల మంది హాజరుకానున్నారు.

1 నుంచి అన్ని న్యాయస్థానాల్లో హైబ్రిడ్ విధానం

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 1 నుంచి హైకోర్టులోని అన్ని న్యాయస్థానాల్లో హైబ్రిడ్ (ఫిజికల్ అండ్ వర్చువల్) విధానం అమల్లోకి రానుంది. ఇప్పటికే మొదటి కోర్టులో కేసుల విచారణ హైబ్రిడ్ పద్ధతిలో సాగుతున్న విషయం తెలిసిందే. ఇదే విధానాన్ని అన్ని కోర్టుల్లో అమలు చేయనున్నట్లు ఐటీ కమ్ సీపీసీ రిజిస్ట్రార్ వెల్లడించారు. ఈ పద్ధతిని న్యాయవాదులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కోర్టుల వారీగా లింక్, మీటింగ్ ఐడీ వివరాలను హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

బోర్డు నిర్ణయానుసారమే బ్యాంకు లావాదేవీలు

- మార్క్‌ఫెడ్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన అన్ని లావాదేవీలు మార్క్‌ఫెడ్ బోర్డు అనుమతితో నిర్వహిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ మేరకు 'సాక్షి'లో ప్రచురితమైన 'మార్క్‌ఫ్రాడ్' కథనంపై స్పందించింది. తెలంగాణ ప్రభుత్వ ఆదేశానుసారం వ్యవసాయ ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది. ఎరువుల సరఫరా, నిర్వహణకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. మార్క్‌ఫెడ్ వివిధ ప్రభుత్వ, షెడ్యూల్ బ్యాంక్‌ల్లో ఖాతాలు తెరిచి నిధులను నిర్వహిస్తుంది. ప్రభుత్వ పూచీకత్తుతో వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొంది ఆ సొమ్మును పంట కొనుగోలుకు సంబంధించి రైతులకు చెల్లింపులు, ఎరువుల నిర్వహణ ఖర్చులకు వినియోగిస్తుంది. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ నిర్వహిస్తున్న అన్ని బ్యాంక్ ఖాతాలు మిగతా బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ, కొనుగోలు చెల్లింపులు, రైతులకు చెల్లింపులు చేస్తోంది. ఎరువుల కొనుగోలు, చెల్లింపులు సకాలంలో పారదర్శకంగా నిర్వహించడానికి ఈ–కలెక్షన్, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా నిర్వహించడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ ఎండీ తెలిపారు.

సుస్థిర వ్యవసాయంతోనే ఆహార భద్రత

దేశంలో ఓ మోస్తరు సుస్థిర వ్యవసాయమే..



- ఏపీ సహా కేవలం ఐదు రాష్ట్రాల్లోనే సుస్థిర వ్యవసాయాభివృద్ధి
- పంజాబ్, హరియాణా సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందున్నా సాగు సుస్థిరతలో వెనకే
- 'సుస్థిరత'కు పెనుసవాలుగా రసాయన ఎరువులు, నీరు, విద్యుత్ అధిక వినియోగం
- సుస్థిర వ్యవసాయం సాధించకపోతే ఆహార భద్రత కష్టమే అంటున్న ఐసీఏఆర్
- వ్యవసాయ రంగంలోని 51 సూచికల ఆధారంగా అధ్యయనం చేసిన ఐకార్ శాస్త్రవేత్తలు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

రానున్న సంవత్సరాల్లో భారత్‌లో ఆహార సంక్షోభం తలెత్తనుందా? దేశవ్యాప్తంగా సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధ్యం కావడం లేదా? కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఈ సుస్థిర వ్యవసాయంలో ముందుకు వెళ్తున్నాయా? అలా వెళ్తున్న రాష్ట్రాలు ఆహార భద్రతకు భరోసా కల్పిస్తున్నాయా? సుస్థిర వ్యవసాయానికి మొత్తం 51 సూచికలను ప్రామాణికంగా తీసుకుని దేశవ్యాప్తంగా జరిపిన అధ్యయనం తర్వాత సుస్థిర వ్యవసాయం సాధించలేని పక్షంలో ఆహార భద్రత కష్టమేనని అఖిల భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్–ఐకార్) అభిప్రాయపడుతోంది. 'కాంపోజిట్ ఇండెక్స్ ఆఫ్ అగ్రికల్చర్ సస్టైనబిలిటీ'పేరిట దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని వ్యవసాయ విధానాలను ఐకార్ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రేమ్‌చంద్, కిరణ్‌కుమార్‌లు పరిశీలించి నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో ఐకార్ ఈ అభిప్రాయానికి వచ్చింది. వ్యవసాయ విధానాల్లో స్పష్టమైన మార్పులు రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేస్తోంది.

వ్యవసాయ సుస్థిరతకు సవాళ్లు

'వ్యవసాయ రంగంలో రసాయన ఎరువుల వినియోగం పెరగడం, తీవ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబించడం, భూసారం తగ్గిపోవడం వ్యవసాయ సుస్థిరతకు పెనుసవాలుగా మారుతోంది. 2030 నాటికి దేశ జనాభా 150 కోట్లకు చేరుకుంటుంది. ఆ జనాభాకు ఆహార భద్రత కల్పించాల్సిన బాధ్యత సాగు రంగంపై ఉంది. కొన్ని రాష్ట్రాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నా.. వ్యవసాయ సుస్థిరత సూచీలకు వచ్చేసరికి వెనుకబడుతున్నాయి..' అని ఐసీఏఆర్ వెల్లడించింది. పంజాబ్, హరియాణ సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందంజలో ఉన్నప్పటికీ.. వ్యవసాయ సుస్థిరత సూచీని పరిశీలించినప్పుడు వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. భారత వ్యవసాయ రంగం సుస్థిరత కోణంలో ఉన్నత స్థానంలో లేదని ఓ మోస్తరు సుస్థిరతతోనే ఉన్నట్లు స్పష్టం చేసింది.

ప్రభుత్వాలు సహకరించాలి..

'సుస్థిర వ్యవసాయానికి ప్రధాన సూచికలైన అతి తక్కువ నీరు, రసాయనాలు, ఎరువులు, విద్యుత్ వినియోగిస్తూ, భూసారం తగ్గకుండా పంటలు పండించే రైతాంగానికి ప్రభుత్వాలు సరైన సమయంలో సాయం అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే భారత్‌లో ఆహార భద్రతకు ఇబ్బందులు రావు. ప్రస్తుతం మిజోరం, కేరళ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మాత్రమే సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనే రాజస్తాన్ సుస్థిర వ్యవసాయంలో చివరలో ఉంది..' అని ఐకార్ నివేదిక తెలిపింది.

సుస్థిర వ్యవసాయానికి 51 సూచికలు

సుస్థిర వ్యవసాయాభివృద్ధికి 51 సూచికలను ప్రామాణికంగా తీసుకున్నట్లు ఐకార్ వెల్లడించింది. సారవంతమైన నేలలు, నీటి వనరులు, జీవ వైవిధ్యం, సామాజిక, ఆర్థిక, పర్యావరణ సమతుల్యత తదితర సూచికలు ప్రధానమైనవిగా గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, బిహార్, హరియాణాతోపాటు వరి పండించే జార్ఖండ్, అస్సాం రాష్ట్రాలు ఎక్కువ ప్రమాదంలో ఉన్నట్లు ఐకార్ వివరించింది. ఇక్కడ వ్యవసాయ విధానాల్లో మార్పులు అత్యావశ్యమని హెచ్చరించింది. పంటల మార్పిడి, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పంట రుణాలు, నీటి వనరుల కల్పన తదితరాలతో సుస్థిర వ్యవసాయం సాధ్యమంది. అధిక ఇన్‌పుట్ సబ్సిడీల నుంచి పద్ధతి ప్రకారం రైతులకు లబ్ధి చేకూరే విధానాలు రావాల్సి ఉందని తెలిపింది. భూములు సారవంతంగా లేని చోట రసాయన ఎరువుల వాడకం పెరుగుతోందని, దీనివల్ల భూమిలో ఆర్గానిక్ కార్బన్ తగ్గుదల చోటు చేసుకుంటోందని వివరించింది.



దేశంలో ఓ మాదిరి సుస్థిరతే..


సుస్థిర వ్యవసాయంలో 0 నుంచి 1ని ప్రామాణికంగా తీసుకుంటే దేశంలో సరాసరిన 0.50 నమోదు అవుతోందని, ఇది ఓ మాదిరి సుస్థిరత మాత్రమేనని ఐసీఏఆర్ తేల్చింది. 0ను అధ్వానంగా పేర్కొంటే , 1ని అత్యుత్తమంగా పేర్కొంది. హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరాఖండ్, కేరళలు జాతీయ సగటును మించి ఉన్నాయి. పంజాబ్, హరియాణా, రాజస్తాన్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో భూగర్భ జలాల వినియోగం అధికంగా ఉందని, భూగర్భ జలాలు 40 సెంటీమీటర్ల మేరకు వేగంగా పడిపోయాయని ఐకార్ పేర్కొంది. ఇక పర్యావరణ సుస్థిరతలో కర్ణాటక, మహారాష్ట్ర, మిజోరం, ఉత్తరాఖండ్‌లు మెరుగైన పనితీరును కనపరుస్తున్నట్లు తెలిపింది. ఇందులో అస్సాం, మణిపూర్, జార్ఖండ్, పంజాబ్, తెలంగాణ అధ్వానంగా ఉన్నట్లు తమ పరిశోధనలో తేలిందని పేర్కొంది. ఈ రాష్ట్రాల్లో ఆర్గానిక్ వ్యవసాయం చాలా తక్కువ పరిమాణంలో ఉందని, గ్రీన్‌హౌస్ గ్యాసెస్ ఎక్కువగా వ్యవసాయ రంగం నుంచే వెలువడుతున్నట్లు పేర్కొంది.



రామాంజనేయులు, సుస్థిర వ్యవసాయ నిపుణులు, హైదరాబాద్

వాణిజ్య పంటలున్నా ఏపీ భేష్

సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధిస్తున్న ఐదారు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఉండటం అభినందనీయం. మిజోరం, కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కూడా ఉన్నా.. ఆ రాష్ట్రాల్లో వాణిజ్య పంటలు తక్కువగా ఉంటాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో వాణిజ్య పంటలు అధికంగా సాగు చేస్తున్నా.. రసాయన ఎరువులు, నీరు తక్కువ వినియోగం, భూసారాన్ని పెంపొందించేలా చేయడం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని సాధించింది. సుస్థిర వ్యవసాయం చేస్తున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరం ఉంది. ఈ రైతులను ఆదుకుంటే దేశ ఆహార భద్రతకు వచ్చే ముప్పేమీ ఉండదు.



సెప్టెంబర్ 25 నుంచి డీఎడ్ పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 25 నుంచి 30వరకు డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్య పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

విదేశీ విద్యాపథకం, 'బెస్ట్' దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలోని వివేకానంద విదేశీ విద్యా పథకం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం (బెస్ట్) పథకాలకు దరఖాస్తు చేసే గడువును పొడిగించినట్లు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలనాధికారి రఘురామశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31తో ముగిసిన గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించామన్నారు.

లక్షకు చేరువలో ఇంజనీరింగ్ స్టూడెంట్స్

- ముగిసిన ప్రత్యేక కౌన్సెలింగ్
- సెప్టెంబర్ 3, 4 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు..8 నుంచి తరగతులు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ప్రత్యేక కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు రిపోర్టు చేసే గడువు బుధవారంతో ముగిసింది. కన్వీనర్‌కోటా కింద మొత్తం 75 వేలమంది సీట్లు పొందినట్టు అధికారవర్గాలు చెబుతున్నాయి. యాజమాన్యకోటా కింద మరో 25 వేలకుపైగా సీట్లు భర్తీ అయినట్టు తెలిసింది. అయితే పూర్తి గణాంకాలు అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. 58 శాతానికిపైగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, దాని అనుబంధ కోర్సుల్లోనే భర్తీ అయినట్టు అధికారులు తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి కాలేజీల్లో ఇంటర్నల్ స్లైడింగ్ చేపడుతున్నారు. ఒక బ్రాంచ్ నుంచి వేరొక బ్రాంచ్‌కు మారేవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటారు. కాలేజీల్లో మిగిలిన సీట్ల వివరాలు ప్రతీ కాలేజీ సెప్టెంబర్ 1న వెల్లడించాలని సాంకేతికవిద్య కమిషనరేట్ ఆదేశించింది 3,4 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఖాళీలు భర్తీ చేస్తారు. ఎంసెట్ అర్హులు నేరుగా కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు పొందే వీలుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 18,815 సీట్లు మిగిలిపోయే వీలుందని అధికారులు అంచనా వేశారు.

దళితబంధు అర్హుల ఎంపిక ఎలా?

పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌కు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన దళితులకు ఇచ్చే దళితబంధు పథకం కింద అర్హులను ఎలా ఎంపిక చేస్తున్నారో...ఆ వివరాలు వెల్లడించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎమ్మెల్యేలు, అధికారులే వీరిని ఎంపిక చేస్తున్నారా? లేదా ఇతర ప్రక్రియ ఏదైనా పాటిస్తున్నారా? చెప్పాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. విచారణ వాయిదా వేసింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 1,100 మందిని దళితబంధుకు అర్హులుగా గుర్తించాలని జూన్ 24న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గానికి గతంలోనే ఇచ్చి ఉండటంతో దానికి మినహాయింపు ఇచ్చారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి వీరిని ఎంపిక చేయాలని పేర్కొన్నారు. ఇలా అయితే నియోజకవర్గాల్లో అర్హులకు కాకుండా, ఎమ్మెల్యేలు చెప్పిన వారికే రూ.10 లక్షలు ఇచ్చే అవకాశం ఉందని పేర్కొంటూ హైదరాబాద్‌కు చెందిన కేతిసీడి అఖిల్‌శ్రీ గురుతేజ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం జారీచేసిన జీఓ నంబర్ 8ని రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ నిర్ణయం కారణంగా అర్హులకు లబ్ధి చేకూరదని చెప్పారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని, ఇదే పద్ధతిని దళితబంధుకు అనుసరించేలా ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

పట్టా పాసుపుస్తకానికి ఆధార్ తప్పనిసరి కాదు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: పట్టాదార్ పాసుపుస్తకం జారీకి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఆధార్ లేనంత మాత్రాన పాసుపుస్తకం జారీ చేయలేమని రెవెన్యూ అధికారులు చెప్పడాన్ని తప్పుబట్టింది. పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకుని తీర్పు వెలువరించిన నాటి నుంచి రెండు వారాల్లో పట్టాదార్ పాసుపుస్తకాన్ని అందజేయాలని ఆదేశించింది. వికారాబాద్ జిల్లా కొత్రేపల్లి గ్రామానికి చెందిన అమీనా బేగం తన 6.02 ఎకరాల భూమి పాసుపుస్తకం కోసం అధికారులకు దరఖాస్తు చేసుకుంది. అయితే తనకు ఆధార్ నంబర్ లేని కారణంగా పాసుపుస్తకం జారీ చేసేందుకు అధికారులు నిరాకరించారు. దీన్ని సవాల్ చేస్తూ అమీనా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున టి.బాలస్వామి, ప్రభుత్వం తరఫున రెవెన్యూ న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం ఆర్డర్ కాపీ అందిన రెండు వారాల్లో పిటిషనర్‌కు పాసుపుస్తకం అందజేయాలని ఆదేశించింది.

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు ప్రదానం

నాంపల్లి: వివిధ రంగాల్లో నిష్ణాతులైన 12 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. బుధవారం ఎన్టీఆర్ కళా మందిరంలో జరిగిన 2021 పురస్కారాల ప్రదానోత్సవ సభలో జ్ఞాపిక, నగదు, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు మాట్లాడుతూ సమాజంలో విస్మరణకు గురైన మహనీయులను వెలికితీసి ప్రతి ఏడాది తెలుగు విశ్వవిద్యాలయం వివిధ పురస్కారాల పేరిట సముచితరీతిన సత్కరిస్తోందన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. వివిధ రంగాలలోని వ్యక్తుల శక్తి సామర్థ్యాలను వెలికితీసి వారి సమర్థతను గుర్తించి గౌరవించడం తెలుగు వర్సిటీ ఔన్నత్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ స్వాగతోపన్యాసం చేశారు. సభా ప్రారంభంలో వెద్మ శంకర్‌చే గోండీ భాషలో పాండవుల కథను ప్రదర్శించారు.

పురస్కార గ్రహీతలు వీరే...

గింజల నర్సింహారెడ్డి–కవిత, తేరాల సత్యనారాయణ శర్మ–పరిశోధన, బి.నరహరి– చిత్రలేఖనం, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి–శిల్పం, ఎస్.కుమార్–నృత్యం, పి.పూర్ణచందర్–సంగీతం, జి.వల్లీశ్వర్–పత్రికారంగం, దెంచనాల శ్రీనివాస్–నాటకరంగం, వెద్మ శంకర్–జానపద కళా రంగం, డాక్టర్ ముదిగొండ అమరనాథ శర్మ–అవధానం, డాక్టర్ కొండపల్లి నీహారిణి–ఉత్తమ రచయిత్రి, డాక్టర్ జి.అమృతలత–కథ.

సాంకేతికతతో ఎన్నికలకు సవాళ్లు

- పోలీసు అధికారులకు శిక్షణలో సీఈఓ వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: సాంకేతికంగా వస్తున్న విప్లవాత్మక మార్పులు కొత్త సవాళ్లను విసురుతున్నాయని, మీడియాలో ఉధృతంగా సాగే ఎన్నికల ప్రచార కార్యక్రమాల విషయంలో సత్వరంగా దిద్దుబాటు చర్యలు తీసుకోవడం కష్టంగా మారిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ తెలిపారు. శాసనసభ ఎన్నికలకు సన్నద్ధతలో భాగంగా బుధవారం తన కార్యాలయంలో పోలీసు అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో 700 మంది పోలీసు అధికారులను బదిలీ చేశామని డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా సరిహద్దుల వద్ద 80–85 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పోలీసు అధికారులకు వివరించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల సీఈఓలు ఆరీజ్ అఫ్తాబ్, తిరుసత్యబ్రత సాహూలు మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీలు మహేశ్ భగవత్, సంజయ్‌కుమార్ జైన్, రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్, హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రపై కోదండరాం ఉచిత క్లాసులు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు సంబంధించి తెలంగాణ ఉద్యమ చరిత్ర 150 మార్కుల పూర్తి సిలబస్‌పై ప్రొఫెసర్ ఎం.కోదండరాం ఉచిత తరగతులు నిర్వహిస్తున్నట్లు అమిగోస్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ప్రతీరోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు తరగతులు ఉంటాయని వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు వివరాల కోసం 9000230734 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చని జనార్దన్‌రెడ్డి సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.